


సూర్య

నేటి దినపత్రిక



visit us @ http://epaper.suryaa.com
www.suryaa.com
సంపుటి 10 | సంచిక 275
శుక్రవారం | 4 ఆగస్టు 2017 | విజయవాడ
| పేజీలు 12+12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష రుతువు, శ్రావణ మాసం, శుక్ల, తిథి : ద్వాదశి సా. 6.25 నక్షత్రం : మూల రా. 9.41, వర్జ్యం రా. 7.54 నుంచి 9.41 వరకు
రాహుకాలం: ఉ. 10.30 నుంచి 12.00 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుంచి 9.08 వరకు తిరిగి మ. 12.32 నుంచి 1.23 వరకు సూర్యోదయం: ఉ. 6.00 గం; సూర్యాస్తమయం: సా. 6.45 గం.



చంద్రబాబును కాల్చి చంపండి

- ఇది ధర్మయుద్ధం
- ఈ ఎన్నికల్లో ప్రజలు శ్రీకృష్ణ పాత్ర పోషించాలి
- నంద్యాల సభలో నిప్పులు చెరిగిన వైఎస్ జగన్
- ఎన్నికలొస్తేనే బాబుకు మైనారిటీలపై ప్రేమ
- మేం అధికారంలోకి వస్తే నంద్యాలను జిల్లా చేస్తాం
- అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితులను ఆదుకొంటాం
- కొడుకును ఎమ్మెల్సీగా చేసిన బాబు మూడు నెలల్లో మంత్రి చేశారు..కానీ ఓ ముస్లింకు కేబినెట్‌లో చోటు ఇవ్వలేదు
- శిల్పా చక్రపాణిరెడ్డి సింహంలా రాజీనామా చేశారు



నంద్యాల సభలో వైఎస్ జగన్

నంద్యాల, మేజర్‌న్యూస్ : నంద్యాలలో జరుగుతున్నది ఉప ఎన్నిక మాత్రమే కాదని ధర్మయుద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ధర్మానికి అధర్మానికి, న్యాయానికి అన్యాయానికి మధ్య జరుగుతున్న యుద్ధమని ధ్వజమెత్తారు. 2019లో జరగబోయే కురుక్షేత్రం సంగ్రామానికి నాంది ఈ ఎన్నికలు ఈ ఎన్నికల్లో ప్రజలది శ్రీకృష్ణుడి పాత్ర అని పేర్కొన్నారు. ప్రజలు ఆయుధం పట్టనక్కర్లేదు యుద్ధం చేయనక్కర్లేదు తమ చూపుడు వేలితో ఈవీఎం అనే విష్ణు చక్రం తిప్పుతూ చంద్రబాబు కౌరవ సామ్రాజ్యం కూకటి వేళ్లతో పెకలించాలని మిగతా 6లో



తన కుమారుడు పరిటాల శ్రీరామ్ వివాహానికి సీఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న రాష్ట్ర మంత్రి పరిటాల సునీత

100 గజాలలోపు ఉచిత క్రమ బద్ధీకరణ

- మార్కెట్ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ
- 100 గజాల లోపు వరకు ఉచితమే
- 101 నుంచి 250 వరకు 15 శాతం ఫీజు
- 251 నుంచి 500 గజాల వరకు 30 శాతం
- ఏపీ మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో నివాసాలను ఏర్పరచుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేదలకు లబ్ది చేకూరనుంది. 2013 భూముల మార్కెట్ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 100 చదరపు గజాల వరకు ఉచితంగా, 101 నుంచి 250 చదరపు గజాల వరకు మార్కెట్ విలువలో 15 శాతం ఫీజుగా నిర్ణయించారు. 251 నుంచి 500 గజాల్లో ఉన్న నివాసాలకు 30 శాతం ఫీజుగా నిర్ణయించారు. అలాగే 500 గజాలపై ఉన్న వారికి 2013 మార్కెట్ విలువ ఆధారంగా ఫీజును ప్రభుత్వం నిర్ణయించింది. సోలార్ పాలసీలో మార్పులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గురువారం సాయంత్రం వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి మిగతా 6లో

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా' ఉంటుంది

- స్టే ఇచ్చేందుకు నిరాకరించిన అత్యున్నత న్యాయస్థానం
- నోటా వద్దంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్
- పిటిషన్ తిరస్కరిస్తున్నట్టు ప్రకటించిన కోర్టు
- కాంగ్రెస్ పార్టీకి కొత్త భయాలు

11లో





మసూద్ విషయంలో మరోసారి అడ్డుకున్న చైనా

- అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించకుండా సాంకేతిక కారణాలు
- నిర్ణయం చెప్పేందుకు మూడు నెలల సమయం కోరిన చైనా
- నెరవేరని భారత్ కోరిక

11లో

నేడో రేపో కర్నాటక మంత్రి శివకుమార్ అరెస్ట్

- ఐటీ ఉచ్చులో చిక్కుతున్న మంత్రి
- రూ. 11 కోట్లకు పైగా అక్రమ సంపాదన
- స్వాధీనం చేసుకున్న ఆదాయపు పన్ను శాఖ
- అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం
- బీజేపీ రాజకీయమన్న కాంగ్రెస్ పార్టీ

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

అంతే ఇంతే!



దళితుడ్ని సీఎం చేద్దామనుకున్నారు అనుకోకుండా మీరయ్యారు.

పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః వర్ధమాన పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ఆహ్వానం పలుకుతోందని ఐటీ, పరిశ్రమలు, పురపాలక, మైనింగ్ శాఖల మంత్రి కె.తారకరామారావు అన్నారు. పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అత్యంత అనుకూలమైందని పేర్కొన్నారు. ప్రముఖ పారిశ్రామిక కేంద్రాలన్నీ హైదరాబాద్ కేంద్రగానే ఉన్నాయని గుర్తుచేశారు. పరిశ్రమలకు అవసరమైన అనుమతులన్నీ 15రోజుల్లోనే వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టిన కల్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. దేశంలో మొదటి సారిగా ప్రైవేట్ సెక్టార్లో డిఫెన్స్ ఎక్విప్‌మెంట్ తయారు చేయడం దీనికి హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం అభినందనీయమని ఐటీ శాఖ మంత్రి కే. తారకరామారావు అన్నారు. ఈ రోజు హార్డ్‌వేర్ కళ్యాణి రఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. డీఆర్డీవో, బీడీఎల్, డీఆర్డీఎల్, ఆర్సీఐ వంటి ప్రభుత్వ సంస్థలతో పాటు ఇలాంటి ప్రైవేటు సంస్థలు నగరంలో ఉండటం మనకు గర్వకారణమని అన్నారు.



హామీల జోరు... కార్యకర్తల్లో హుషారు

- అధికారంలోకి రాగానే 13 జిల్లాలు ఇక 25 చేస్తాం
- నవరత్నాల అమలుకు నంద్యాలే నాంది
- నంద్యాలను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతా
- ఆర్యవైశ్య సోదరులకు ప్రత్యేక కార్పొరేషన్
- 2019 కురుక్షేత్ర యుద్ధానికి సన్నద్ధం
- నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో జగన్ కీలక ప్రకటన

కర్నూలు నుంచి సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో కార్యకర్తల్లో హుషారు కనిపించింది. మైదానమంతా ఇసుకేస్తే రాలనంత జనం సభకు తరలిరావడంతో ప్రతిపక్ష నేతలో ఉత్సాహం రెట్టింపైంది. అధికార పార్టీ అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్న వస్తున్నాడంటూ పదే పదే వేదికపై మాట్లాడిన మాటలకు కార్యకర్తలు ఈలలు వేస్తూ కేరింతలు కొట్టారు. అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల కాలంలో మూడ లక్షల కోట్లు దోచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ నంద్యాలలోనే మకాం వేశారని జగన్ ఆరోపించారు. అలాగే కేబినెట్‌తో పాటు ఎంపీలు, ముఖ్య నేతలంతా ఉప ఎన్నిక కోసం ఇక్కడకు వచ్చారని అన్నారు. లేకుండా నంద్యాల ముఖం కూడా వారు చూసే వారు కాదని, పైసా నిధులు కూడా విదిల్చేవారు కాదని జగన్ ఆరోపించారు.



నంద్యాల ఉపఎన్నిక నేపథ్యంలో గురువారం వైసీపీ నిర్వహించిన బహిరంగ సభలో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కీలక ప్రకటనలు చేశారు. బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఏపీలో ఉన్న 13 జిల్లాలోని ప్రతి పార్లమెంటునూ ఒక జిల్లాగా చేయబోతున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు. ముఖ్యంగా 13 జిల్లాలను 25జిల్లాలు చేయబోతున్నట్లు జగన్ ప్రకటించారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌గా నంద్యాల ఉంటుందని ఆయన అన్నారు. నంద్యాల జిల్లా అయితే మీ కళ్లముందే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం, ఇక్కడే జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ కార్యాలయం ఉంటుందని జగన్ ప్రకటించారు. నంద్యాలను మోడల్ టౌన్‌గా చేస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. నవరత్నాలు అమలుకు నంద్యాలే నాంది కావాలన్నారు. నంద్యాల అభివృద్ధి బాధ్యత పూర్తిగా తనకు వదిలేయాలంటూ జగన్ తెలిపారు. నిరుపేదలందరికీ ఇళ్లు కట్టించి రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలన్నింటినీ లబ్ధిదారుల చేతికే ఇస్తామని వైసీపీ అధినేత జగన్ చెప్పారు. దేవుడి దయ వల్ల అధికారంలోకి వస్తే ఆర్య వైశ్య సోదరులందరికీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని జగన్ భరోసా ఇచ్చారు. మరీ ముఖ్యంగా టీడీపీ వైపు ఫరూక్ ఉన్నారని, వైసీపీ తరపున ముఖ్యనేత ఎవరూ లేరని తనను ముస్లిం సోదరులూ సంప్రదించి మాట్లాడారన్నారు. 2019 కురుక్షేత్ర యుద్ధం కంటే ముందు 2018లో ఒకే ఒక ఎమ్మెల్సీ సీటు వస్తుందని, ఆ ఒక్క సీటు నంద్యాల నుంచి ముస్లిం సోదరులకే ఇస్తామని జగన్ మాటిచ్చారు. నంద్యాల ప్రజలకు జగన్ ఇచ్చిన హామీలు, కీలక ప్రకటనల్లో నంద్యాలను జిల్లా కేంద్రంగా మార్చడంతోపాటు అధికారంలోకి వస్తే విత్తనాలు, వ్యవసాయానికి నంద్యాలను కేరాఫ్‌గా మారుస్తామని ప్రకటించారు. నంద్యాలలోనే వ్యవసాయ యూనివర్శిటి ఏర్పాటు చేయడంతోపాటు కేశవరెడ్డి బాధితులకు పూర్తిగా న్యాయం చేస్తామన్నారు. అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితులకు అధికారంలోకి వచ్చిన మూడునెళ్లకే వారికి ఇవ్వాల్సిన డబ్బులు పూర్తిగా ఇచ్చేస్తామని, కుల, మతాలకతీతంగా అందరికీ నవరత్నాలు అందిస్తామని, ఇవి అందాలంటే ఇప్పుడున్న వ్యవస్థను పూర్తిగా మార్చాల్సిన అవసరం ఉందని జగన్మోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం.

రాయలసీమ జిల్లాల్లో అమిత్ షా పర్యటన



అనంతపురం,సూర్యప్రతినిధి: బీజేపీ జాతీయ అధ్యక్షులు అమిత్‌షా ఈనెల 27, 28, 29 తేదీల్లో రాయలసీమ జిల్లాల్లో పర్యటించనున్నట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. 2019 ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పర్యటన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షా అనంతపురం జిల్లాలోనూ పర్యటిం చనున్నట్లు చెప్పారు. నగరంలో 263 పోలింగ్ కేంద్రాలున్నాయని, అన్నింటికీ కమిటీలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

చంద్రబాబును కలిసిన పరిటాల సునీత



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : పరిటాల కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. దివంగత పరిటాల రవి, ప్రస్తుత రాష్ట్ర మంత్రి పరిటాల సునీతల తనయుడు పరిటాల శ్రీరామ్ వివాహం అక్టోబరు 1న జరగనుంది. శింగనమల నియోజకవర్గం నార్పల మండలంకు చెందిన ఏవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆలం వెంకటరమణ, సుశీలమ్మల కుమార్తె ఆలం జ్ఞానతో పెళ్లి నిశ్చయమైంది. ఈ నెల 10న హైదరాబాద్‌లో నిశ్చితార్థం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంత్రి సునీత గురువారం ముఖ్యమంత్రి నివాసానికి వచ్చి ముఖ్య మంత్రి చంద్రబాబును ఆహ్వానించారు. వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్‌లో పరిటాల శ్రీరామ్ నిశ్చితార్థం జరగనుంది.

సర్కార్ వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగింది

- 33 శాతం నుంచి 41 శాతానికి పెరిగిన ప్రసవాలు
- అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో అత్యల్పంగా మేడ్చల్ జిల్లాలో
- మేడ్చల్ సహా ప్రసవాలు తక్కువ జరిగిన వైద్యశాలల్లో వసతులు, సిబ్బంది పెంపు
- అదుపులో సీజనల్ వ్యాధులు- అరికట్టిన వైద్యాధికారులకు అభినందనలు
- కెసిఆర్ కిట్ల పథకాన్ని సమీక్షించిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ప్రభుత్వ ఆసుపత్రులలో గత ఆరు నెలల్లోనే ప్రసవాలు గణనీయంగా పెరిగాయని, గత ఏడాది కేవలం 33శాతంగా ఉన్న ప్రసవాల సంఖ్య 41శాతానికి పెరిగిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి తెలిపారు. అత్యధికంగా మారుమూల ఆదిలాబాద్ జిల్లాలో 82శాతం కాగా, అత్యల్పంగా మేడ్చెల్ జిల్లాలో 5శాతంగా నమోదైందని మంత్రి వివరించారు. అత్యల్పంగా ప్రసవాలు నమోదైన మేడ్చల్ జిల్లాలో వెంటనే అవసరమైన వసతులు పెంచి, సిబ్బందిని నియమించాలని అధికారులని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానాల్లో ప్రసవాలు గణనీయంగా పెరగడంతోపాటు, ఈ ఏడాది సీజనల్ వ్యాధులు అదుపులో ఉండటం, పట్ల సంతోషం వ్యక్తం చేసిన సంబంధిత వైద్యాధికారులు, సిబ్బందిని అభినందించారు. గురువారం కేసీఆర్ కిట్ల పథకం, సీజనల్ వ్యాధుల మీద హైద్రాబాద్ వెంగళరావు నగర్ లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్‌లో అన్ని జిల్లాల జిల్లా వైద్యాధికారులతో మంత్రి లక్ష్మారెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రసవాలలో అనవసరమైన శస్త్ర చికిత్సలు నివారిస్తూ, ప్రభుత్వ దవాఖానాల్లోనే ప్రసవాలు జరగాలని సీఎం కెసిఆర్ ఇచ్చిన పిలుపు, సూచనల మేరకు వైద్యాధికారులు, సిబ్బంది బాగా పని చేశారన్నారు. 2017 జనవరిలో 33శాతంగా ఉన్న ప్రసవాలు, ఫిబ్రవరిలో 30శాతంగా, మార్చిలో 35శాతంగా, ఏప్రిల్ లో 39శాతంగా, మేలో 40శాతంగా, జూన్ లో 41శాతంగా నమోదయ్యాయన్నారు. కెసిఆర్ కిట్ల పథకం తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగిందన్నారు. కెసిఆర్ కిట్ల పథకం ప్రజల్లోకి బాగా వెళ్ళిందని, ప్రభుత్వ దవాఖానాల్లోనే ప్రసవాలు కావడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారని మంత్రి అన్నారు. అయితే, రాష్ట్రంలో జరుగుతున్న మొత్తం ప్రసవాల్లో కనీసం 50శాతం ప్రసవాలు ప్రభుత్వ దవాఖానాల్లోనే జరగాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. సగటు 50శాతంగా కాకుండా, ఒక్కో దవాఖానాల్లో తప్పని సరిగా 50శాతం రీచ్ అవ్వాలని అంటే నూటికి నూరు శాతం లక్ష్యాలు సాధించాలని మంత్రి ఆదేశించారు. అందుకు తగ్గట్లుగా వైద్యాధికారులు, వైద్యులు, సిబ్బంది పని చేయాలని మంత్రి ఆదేశించారు. ఇక జిల్లాల వారీగా తీసుకుంటే, ఆదిలాబాద్లో 82శాతం, హైదరాబాద్లో 78శాతం, వరంగల్ అర్బన్లో 76శాతం, మహబూబ్నగర్లో 58శాతంగా సర్కార్ దవాఖానాల్లో ప్రసవాలు నమోదయ్యాయని మంత్రి వివరించారు. కెసిఆర్ కిట్ల పథకాన్ని పకడ్బందీగా



అమలు చేయాలని చెప్పారు. అంతా ఆన్లైన్లో పారదర్శకంగా నడవాలని తెలిపారు. మరోవైపు సీజనల్ వ్యాధుల మీద మంత్రి సమీక్షించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సీజనల్ వ్యాధులు అదుపులో ఉండటం, సీజనల్ వ్యాధుల కారణంగా మరణాలు సంభవించకపోవడం మంచి పరిణామమన్నారు. ముందుగా చేపట్టిన చర్యలు, ఏజెన్సీ ప్రాంతాలున్న 11 జిల్లాల కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారులతో సమీక్షలు సత్ఫలితాలిచ్చాయన్నారు. ఈ ఒరవడిని ఇలాగే కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యాలను సాధించాలని, ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలుగా పని చేయాలని మంత్రి లక్ష్మారెడ్డి జిల్లాల వైద్యాధికారులకు ఉద్బోధించారు. ఈ సమీక్షలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, జిల్లాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ పాదయాత్రకు మా మద్దతు
సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



పశ్చిమగోదావరి, మేజర్‌న్యూస్ః కాపు ఉద్యమ నేత ముద్రగడ పాదయాత్రకు మేం మద్దతు ఇస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన హామీని అమలు చేయమని ముద్రగడ అడుగుతుంటే ప్రభుత్వానికి భయమేందుకని ఆయన అన్నారు. ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెట్రోల్ డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. ఇసుక, ల్యాండ్ మాఫియా గ్యాంగ్లను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అడ్డుకోలేకపోతున్నాయన్నారు. కాపు రిజర్వేషన్ల కోసం ముద్రగడ పద్మనాభం చలో అమరావతి పాదయాత్రకు బయలుదేరితే పోలీసులు అడ్డుకున్నారు. నేటితో ముద్రగడపై విధించిన గృహ నిర్బంధం ముగిసిపోయింది. మరోసారి పాదయాత్రకు రెడీ అయినా ముద్రగడను ఇంటి వద్దనే పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఇది నిరవధిక పాదయాత్ర వాయిదా వేసేది లేదని ఎట్టి పరిస్థితుల్లోనైనా పాదయాత్ర చేసి తీరుతానని ముద్రగడ స్పష్టం చేశారు. మరోవైపు ముద్రగడ నివాసం వద్ద పోలీసు బలగాలు భారీగా మోహరించాయి

పేదలందరికీ సొంత ఇళ్లు
ఏపీ స్పీకర్ కోడెల శివప్రసాద రావు



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : సొంత ఇంటి కోసం కలగనే పేదలకు ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం వరంగా మారిందని ఏపీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. గురువారం నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ, యలమంద గ్రామాల్లో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద 177 గృహాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంక్షేమ పథకాల అమలులో దూసుకుపోతుందన్నారు. రాజధాని నిర్మాణం, గోదావరి కృష్ణ కలయిక, పోలవరం,ఇళ్లు, గ్యాస్, రేషన్, శ్మశానవాటికలు, మరుగుదొడ్ల నిర్మాణం ఇలా అన్నింటిలో అభివృద్ధి పథంలో ముందుకెళ్లుతున్నామన్నారు. సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో మరుగుదొడ్లు, శ్మశానవాటికల నిర్మాణం ప్రపంచం మొత్తం మెచ్చుకుంటున్నాయన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో గత 60సంవత్సరాల్లో ఎప్పుడూ జరగని అభివృద్ధి చేసుకున్నామన్నారు. గతంలో నిర్మించినవి, ప్రస్తుతం నిర్మిస్తున్నవి కాకుండా కొత్తగా ఇళ్లు కావలసిన వారు దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ తో పాటు నరసరావుపేట , ప్రభాకర్ ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ కేసులో రాష్ట్రపతి, ప్రధానులకు రేవంత్ రెడ్డి ఫిర్యాదు

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః డ్రగ్స్ బాగోతంలో జాతీయ స్థాయి సంస్థలతో దర్యాప్తు చేయిస్తే అసలు వ్యక్తులు బయటపడతారన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జంకుతోందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. గురువారంఈ వ్యవహారంపై జోక్యం చేసుకుని జాతీయ సంస్థలతో దర్యాప్తు ఆదేశించాలని కోరుతూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే కేంద్ర హోం, ఆర్థిక శాఖ మంత్రులకు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ సంస్థలకు ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో వెలుగు చూసిన ఈ వ్యవహా రంలో పాఠశాలలు, కళాశాలలు, సినిమాలు, ఐటీ, వ్యాపార రంగాలలో డ్రగ్స్ ప్రమేయం ఉందని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాధికారులు గుర్తించారని ఆయన తెలిపారు. కోట్లాది రూపాయల లావాదే వీలు విదేశీ బ్యాకులలో జరిగాయని, నగరానికి డ్రగ్స్ ఇతర దేశాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చాయని, కేసును విచారిస్తున్న అధికారి అకున్




సబర్వాల్‌కు ఆఫ్రికా దేశాలనుంచి బెదిరింపు కాల్స్ కూడా వచ్చాయని ప్రభుత్వమే చెబుతోందని తన ఫిర్యాదులో రేవంత్ పేర్కొన్నారు. అందుకోసమే డ్రగ్స్‌కు సంబంధించిన మూలాలను వెలికి తీయడానికి, ఇతర రాష్ట్రాలు, దేశాలలో జరిగిన లావాదేవీలను పరిశోధించడానికి విదేశీ బ్యాంకుల ఖాతాలను స్తంభింపజేయడానికి ప్రస్తుతం డ్రగ్స్ కేసును దర్యాప్తు చేస్తున్న రాష్ట్ర ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధి సరిపోదని తాము రాష్ట్ర ప్రభుత్వానికి సూచించామని తెలిపారు. ఈ కారణంగానే జాతీయ స్థాయి సంస్థలతో డ్రగ్స్ కేసును దర్యాప్తు చేయించాల్సిన ఆవశ్యకతను చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నినియోగానికి వేదికలైన పబ్బులను ప్రోత్సహిస్తూ 50కి పైగా కొత్త పబ్‌లకు గత మూడేళ్ల కాలంలో అనుమతించడం జరిగిందని, దీంతో డ్రగ్స్ వినియోగానికి, మహిళలపై అత్యాచారాలు చేయడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. మహారాష్ట్ర, కర్నాటక వంటి రాష్ట్రాలలో అనుమతి నిరాకరించిన డీజే షోలను కూడా తెలంగాణ అధికారులు ఆహ్వానించి హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. సాంకేతిక నైపుణ్యత కలిగిన దర్యాప్తు సంస్థలు విచారణను చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ సమాజాన్ని, శారీరకంగానూ, మానసికంగానూ నాశనం చేస్తాయని అందుకే తీవ్రమైన ఈ సమస్యను ఆశామాషీగా తీసుకోవడానికి వీలు లేదని చెప్పారు. ఈ పరిస్థితుల్లోనే డ్రగ్స్ వ్యవహారాన్ని ఎన్‌సీబీ, ఈడీ లాంటి సంస్థలతో దర్యాప్తు చేయించాలని, అసు వ్యక్తులను, డ్రగ్స్ రవాణా వ్యవస్థను పూర్తిగా నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఫిర్యాదు ప్రతులను కేంద్ర నేతలు, అధికారులతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మంత్రి పద్మారావుకు పంపినట్లు తెలిపారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం



వేములవాడ, మేజర్‌న్యూస్: తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజు దగ్గరలోనే ఉందని, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు అన్నారు. ఇసుక మాఫియాలో బడా రాజకీయ నేతల హస్తం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా ఇటు ప్రభుత్వాన్ని, అటు పోలీసులను నడిపిస్తోందని ఆరోపించారు. గురువారం నేరెళ్ల బాధితులను ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ నేరెళ్లలో దళితులపై దాడి కిరాతకం పోలీసులది కాదని ప్రభుత్వానిదని మండిపడ్డారు. పాలకులే దళితులపై దాడికి పోలీసులను ఉసిగొల్పారని ఆయన ఆరోపించారు. ఖమ్మంలో రైతులకు బేడీలు వేసిన నిరంకుశ ప్రభుత్వం నేరెళ్లలో దళితులను, బడుగులను చిత్రహింసలకు గురిచేసిందని ఆయన విమర్శించారు. నేరెళ్ల బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ ఘటనపై గవర్నర్‌కు, ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేస్తామని మురళీధర్‌రావు తెలిపారు.

ముద్రగడ పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు



కిర్లంపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఛలో అమరావతి పేరుతో నిరవధిక పాదయాత్రను చేపట్టిన మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను పోలీసులు గురువారం మళ్లీ అడ్డుకున్నారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ముద్రగడ తన అనుచరులతో కలిసి ఇంటి ఆవరణలో ఉన్న గేటు వద్దకు చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ముద్రగడ పోలీసు అధికా రులతో వాగ్వాదానికి దిగారు. శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేయాల నుకుంటున్న పాదయాత్రకు ఎందుకు ఆటంకం కలిగిస్తున్నారో చెప్పాలని ఆయన పోలీస్ అధికారులను డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రకారం ప్రభుత్వం నుంచి పాదయాత్రకు అనుమతి తీసుకోవాలని, కానీ మీరు అనుమతి తీసుకోని కారణంగానే అనుమతి ఇవ్వట్లేదని పోలీసులు ముద్రగడకు తెలిపారు.

నెల్లూరులో 7న వెంకయ్య నాయుడు ఆత్మీయ సన్మాన సభ



నెల్లూరు,సూర్యప్రతినిధి: ఉప రాష్ట్రపతిగాఅభ్యర్థిగా ఎన్నికయ్యాక మొట్టమొదట తన సొంత జిల్లా నెల్లూరుకు వస్తున్న సందర్భంగా జిల్లా ప్రజలు రాజకీయాలకు అతీతంగా వెంకయ్యనాయుడుకి అపూర్వ స్వాగతం పలుకుతూ ఆత్మీయ సన్మాన సభను ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ వెంకయ్య నాయుడు నెల్లూరు నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించి తనదైన ముద్ర వేశారన్నారు. ఈనెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు పోలీసు పెరేడ్ గ్రౌండ్‌కు హెలికాప్టర్ ద్వారా వెంకయ్యనాయుడు నెల్లూరుకు చేరుకుంటారని తెలిపారు. అక్కడ నుంచి వీఆర్సీ కూడలి వరకు నిర్వహించే ర్యాలీలో పాల్గొని అనంతరం వీఆర్సీ మైదానంలో జరిగే ఆత్మీయ సన్మాన సభలో పాల్గొంటారన్నారు.

చక్రపాణిరెడ్డి రాజీనామా చేసి వైసీపీలోకి వెళ్లాలి

- నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా
- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

కర్నూలు, మేజర్‌న్యూస్ః నంద్యాల ఉపఎన్నిక నేపథ్యంలో కర్నూలు జిల్లా రాజకీయాలు రసకందమయంగా మారుతున్నాయి. నంద్యాల ఉప ఎన్నికలే లక్ష్యంగా అధికార టీడీపీ, వైసీపీల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. టీడీపీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణి రెడ్డి సైకిల్‌కు గుడ్ బై చెప్పి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకోన్నారు. ఈ తతంగానికి ముందే శిల్పా చక్రపాణి తక్షణమే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరాలంటూ టీడీపీ నేతలు, వైసీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన నేతలు డిమాండ్ చేశారు. వైసీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచి బుడ్డా రాజశేఖర్ రెడ్డి టీడీపీ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుడ్డా మీడియాతో మాట్లాడుతూ శిల్పా చక్రపాణి టీడీపీకి రాజీనామా చేసి వైసీపీ తీర్థం పుచ్చుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తాను కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఆయన చెప్పుకొచ్చారు. శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే వైసీపీని వీడి టీడీపీలో చేరానని ఆయన మీడియాతో చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యే సీట్ల కోసం శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీ మారుతున్నాడంటూ ఎమ్మెల్యే బుడ్డా ఆరోపించారు. వై.ఎస్.జగన్‌ది రాక్షస



మనస్తత్వం, శిల్పా సోదరులది పిశాచి మనస్తత్వం అంటూ ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. శిల్పా సోదరులకు స్వార్థ రాజకీయాలే మక్కువ అంటూ ఎమ్మెల్యే బుడ్డా విమర్శించారు.

జర్నలిస్ట్‌లపై పోలీసుల దాడిని ఖండిస్తున్నాం: బీజేపీ అధికార ప్రతినిధి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రగతి భవన్ ముందు జర్నలిస్ట్‌లపై పోలీసుల దాడిని ఖండిస్తున్నామని బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణసాగర్ రావు అన్నారు. వెంటనే ఏసీపీపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీతో ఏకాంతంగా మాట్లాడిన విషయాలను కేసీఆర్ మీడియాకు చెప్పడం సరికాదని అన్నారు. మోదీ ఎప్పుడూ ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకమేనని ఆయన తెలిపారు. రాజకీయలబ్ధి కోసం ప్రధాని మాటలను కేసీఆర్ వక్రీకరించారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ పాలనలో దళితులు బోర్డులు పెట్టుకోవాలా?, అని ప్రశ్నించారు. కేసీఆర్ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని కృష్ణ సాగర్ రావు అన్నారు.

ప్రాజెక్టులపై కాంగ్రెస్ నేతలు కేసులు వేయలేదా? : బాల్క సుమన్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: కాంగ్రెస్ నేతలపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన విమర్శలు సహేతుకమైనవేనని పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ అన్నారు. కేసీఆర్ ఏదో అనరాని మాటలు అన్నట్లు కాంగ్రెస్ నేతలు ఉలిక్కిపడుతున్నారన్నారని ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రిపై చేస్తున్న విమర్శలు అర్ధరహితమని ఆయన అన్నారు. ప్రాజెక్టులపై కాంగ్రెస్ నేతలు కేసులు వేసింది నిజం కాదా? అని సుమన్ ప్రశ్నించారు. సింగరేణి ఉద్యోగాలను అడ్డుకున్నది నిజం కాదా? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి రాజకీయ ఉన్మాదని సుమన్ విరుచుకుపడ్డారు.

సీఎల్పీనేత జానారెడ్డి, మండలివిపక్షనేత షబ్బీర్‌అలీలు ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. అన్నింటికీ రాజకీయ రంగు పులమడం కాంగ్రెస్ నేతలకు అలవాటయిందన్నారు.

నేరెళ్లలో ఇసుక లారీ ప్రమాదంలో యువకుడు మరణిస్తే దానికి దళితరంగు పులిమి వివాదం చేశారన్నారు.కాంగ్రెస్ నేతలు ఎన్ని కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకోవాలని చూసినా, నిర్మించి తీరుతామని చెప్పారు. కేసుల ద్వారా రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్‌పార్టీ అడ్డుపడుతోందని పల్లారాజేశ్వర్‌రెడ్డి అన్నారు.

తన అసమర్ధతను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్‌పై నిందలా?

- ముఖ్యమంత్రి కేసీఆర్ భాష తీవ్ర అభ్యంతరకరం
- రాష్ట్రాభివృద్ధికి సహకరించేందుకు సదా సిద్ధం
- ఇదే భావజాలాన్ని ప్రజలకు చెప్పదలిచారా?
- కడుపుమండినవారే కోర్టుకు వెళుతున్నారు
- సింగరేణి వారసత్వ ఉద్యోగులపై కోర్టుకు వెళ్లిందెవరు?
- జాగృతిలో పనిచేసిన వారు కాదా??
- వారసత్వ ఉద్యోగాల నియామకానికి అసెంబ్లీలో మద్దతు ఇచ్చాం
- సీఎల్పీ నేత జానారెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ వ్యవహారశైలి అరాచకంగా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు టీఆర్‌ఎస్‌కే వర్తిస్తాయి. ఆయన వ్యాఖ్యలను చాలా తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రతిపక్ష పార్టీగా చాలా సంయమనంగా ఉన్నాం. సీఎం పదజాలాన్ని తీవ్రస్థాయిలో ఖండించాల్సిన అవసరం ఉంది. ఇష్టానుసారంగా పాలన చేస్తానంటే ఎలా?, తప్పు కాంగ్రెస్‌పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారు. తన అసమర్ధతను కప్పిపుచ్చుకోవడానికి మాపై నిందలు వేస్తున్నారని సీఎల్పీనేత జానారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ నేతల వ్యవహారశైలిపై ముఖ్యమంత్రి కేసీఆర్ త్రీవస్థాయి విమర్శలు గుప్పించిన నేపథ్యంలో జానారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ కేసీఆర్ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయంటూ విరుచుకుపడ్డారు.

ప్రజల ఆకాంక్ష నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కోర్టులకు వెళ్లేవారితో కాంగ్రెస్‌పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. కడుపు మండినవాళ్లే కోర్టుకు వెళుతున్నారని చెప్పారు. గతంలో జాగృతిలో పనిచేసినవారే కోర్టులో కేసు వేశారని, ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు కోర్టులో నిలబడటం లేదని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్‌పార్టీ అన్నివిధాలుగా సహకరిస్తుందన్న జానా, సింగరేణి కారుణ్య నియామకాలపై అసెంబ్లీలో మద్దతు ఇచ్చామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి తరహాలో తాను మాట్లాడగలనని కాకపోతే సంస్కారం అడ్డువస్తుందన్నారు. కేసీఆర్ తన హోదాకు తగినట్లుగా మాట్లాడాలని హితవు పలికారు. సీఎం వాడుతోన్న భాషా రాష్ట్రానికి ఎంతమాత్రం మంచిది కాదన్నారు. ఇదే భావజాలాన్ని ప్రజలకు చెప్పాలని సీఎం భావిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. సర్కార్ తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్‌పై బురద చల్లుతుందని మండిపడ్డారు. ప్రజలు అన్ని విషయాల్ని గమనిస్తున్నారన్న జానా, బట్టకాల్చి మీద వేస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో టీఆర్‌ఎస్ కూడా కోర్టులకు వెళ్లిన విషయంపై ఏమి సమాధానం చెబుతారన్నారు.



ఆహంకారపూరితంగా సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః కాంగ్రెస్‌పార్టీపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆహంకారపూరితంగా ఉన్నాయని మండలి విపక్షనేత షబ్బీర్ అలీ అన్నారు. తనకు రాజకీయ జన్మ నిచ్చిన కాంగ్రెస్‌పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హాస్యాస్ప దంగా ఉందన్నారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు మహిళలను కించ పరచడమేనన్నారు. కేసీఆర్ తక్షణమే మీరాకుమార్ క్షమాపణ చెప్పాలన్నారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిరిసిల్ల దళితులపై సీఎం చులకనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పోలీసు అధికారులను సస్పెండ్ చేయకుండా, వారికి సీఎం మద్దతు పలుకడం దారుణంగా ఉందన్నారు. కోర్టుల కు వెల్లవద్దని ముఖ్యమంత్రి ఎలా అంటారని ప్రశ్నించారు.సామాన్యులు న్యాయం కోసం కోర్టుకు కాకుండా ఎక్కడికి వెళ్లాలన్నారు. నయీం,మియాపూర్, ఎంసెట్ కేసులలో వాస్తవాలను బయట పెట్టకుండా ఏ కోర్ట్ అడ్డ కుందన్నారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేక పోవడం కేసీఆర్ కు అలవాటైందన్నారు. మంత్రి కేటీఆర్ హిమాన్ష్ కంపనీలో భాగస్వామి అవునా? కాదా?అని షబ్బీర్ అలీ ప్రశ్నించారు. కేటీఆర్ ఒకవేళ హిమాన్షు కంపెనీలో భాగస్వామి కాకపోతే, అబిడ్స్ సెంటర్ కు రావాలన్నారు. నీవు చెప్పిందే నిజ మయితే నేను ముక్కు నెలకు రాస్తానని, లేకపోతే కేటీఆర్ ముక్కు నేలకు రాయాలని సవాల్ చేశారు. మైనార్టీ,ఎస్టీ రిజర్వేషన్ లను చట్టం చేసి కేసీఆర్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.కేసీఆర్, తన చేతగాని తనాన్ని కాంగ్రెస్ పైరుద్దే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పై అడ్డగోలు విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రతిష్టాత్మకంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



- ఎకరా వేరుసెనగ కూడా ఎండకూడదు
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి
- ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు భూ పంపిణీకి చర్యలు
- చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న

చిత్తూరు, సూర్య ప్రధాన ప్రతినిధి : తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఎంతో అరుదైన అవకాశం. ఆయా వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలి. తదనుగుణంగా ముందుకు సాగి నభూతో నభవిష్యతి అన్న రీతిన వైభవంగా నిర్వహించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన జిల్లా అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రద్యుమ్న మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లాలో నిర్వహించడం ఓ అద్భుత అవకాశమన్నారు. వేడుకల ఏర్పాట్లపై దృష్టిసారించి సర్వ సన్నద్ధం చేయాలని సూచించారు. ఆయా వేడుకలపై ముందస్తు సమీక్ష నిర్వహణకు ఈ నెల 5, 6 తేదీల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ జిల్లాకు విచ్చేస్తున్నారన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి భూ పంపిణీకి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ సుజల పథకాన్ని సమర్ధంగా అమలు చేసేందుకు ప్రాధాన్యత ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ఒక ఎకరా వేరుసెనగ పంట ఎండిపోరాదని, జల ఫిరంగుల సహాయంతో నీటితడులు ఇప్పించాలన్నారు. ఇప్పటికే రెండువేల ఎకరాలకు జలఫిరంగులు ఉపయోగించామన్నారు. గత మూడురోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరో పదిరోజుల పాటు జలఫిరంగుల ఉపయోగం ఉండదన్నారు. వీటి వినియోగంపై రైతులకు ఎక్కడికక్కడ అవగాహన కల్పించాలన్నారు. జిల్లాకు అవసరమైన జల ఫిరంగులను పదిరోజుల్లో సిద్ధం చేసి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట సంజీవని నీటికుంటల్లో చాలావరకు నీటి నిల్వ ఉందని, సదరు నీటిని జల ఫిరంగుల సహాయంతో వేరుసెనగ పంటకు నీటితడులు ఇవ్వాలని వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్‌ను ఆయన ఆదేశించారు. వర్షాలు కురుస్తుండటంతో సాగుకు నోచుకోని భూముల్లో ప్రత్యామ్నాయ పంటలైన రాగి, జొన్న, ఉలవలు తదితర పంటల సాగుకు అవసరమైన విత్తనాలను సత్వరమే రైతులకు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మద్యం గొలుసు దుకాణాలు(బెల్ట్) దుకాణాలు) సమస్య ఉన్నదని, రోజువారీ కేసుల నివేదికను సహాయ కమిషనరు ప్రసాద్, జేసీ గిరీషాకు అందజేయాలని ఆదేశించారు. ఇప్పటికే 46 బెల్ట్ షాపులను రద్దు చేశామన్నారు. మొత్తం 430 మద్యం దుకాణాల్లో 370 పనిచేస్తున్నాయని, మరో 30 దుకాణాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్ట్ దుకాణాలుంటే కేసులు నమోదు చేస్తున్నామని సహాయ కమిషనరు పాలనాధికారికి వివరించారు. ఎక్కడెనా బెల్ట్ దుకాణం నడుస్తున్నట్లు తన దృష్టికి వస్తే తీవ్ర చర్యలు తీసుకుంటానని చెప్పారు. జిల్లాలో 74 ఇసుక రీచ్‌లు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక ఉచితమైనా, అధిక ధరలకు అమ్ముతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దూరాన్ని బట్టి ధర నిర్ణయించి, ఈ మేరకే ఇసుకను విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో జిల్లా సంయుక్త పాలనాధికారి గిరీషా, శిక్షణ కలెక్టరు కీర్తి, డీఆర్వో రజియాబేగం, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు కూర్మానాథ్, రవిప్రకాష్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్, జలవనరుల శాఖ ఎస్‌ఈ శ్రీరామకృష్ణ, భూగర్భ గనుల శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులపై కేసీఆర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం : తమ్మినేని



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు కమ్యూనిస్టులపై చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. గురువారం టి మాస్ ఫోరమ్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ దగ్గరలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో త్యాగాలు చేసి ప్రజల తరపున నిరంతరం పోరాడే కమ్యూనిస్టుల చరిత్ర తెలుసుకోమని ఆయన సూచించారు. 2004 ,2009 ,2014 ఎన్నికల్లో కమ్యూనిస్టుల్లో గొప్పవాళ్ళు ,నిజాయితీ పరులు అని పొగిడిన కేసీఆర్ పొత్తు కోసం వెంపర్లాడాడని వివరించారు. నేడు కమ్యూనిస్ట్ లు ఎక్కడ ఉన్నారని ,దిగజారుతున్నారని కేసీఆర్ అహంభావం గా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. మీడియా పై అనుచిత వ్యాఖ్యలు చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు. సిరిసిల్ల ఘటనను కేసీఆర్ సమర్తిస్తున్నారని ఆయన తెలిపారు. దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి ,చిత్ర హింసలు పెట్టారని తెలిపారు. ప్రగతి భవన్ వద్ద మీడియా పై దాడిని ఖండిస్తున్నామన్నారు.

విలేజ్ ఆర్గనైజేషన్స్ అసిస్టెంట్లకు రూ.3 వేల గౌరవ వేతనం

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఏప్రిల్ నుండి గౌరవ వేతనం చెల్లింపు
- 18, 836 మందికి లబ్ధి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః విలేజ్ ఆర్గనైజేషన్స్ అసిస్టెంట్ల కు (వీఏఓ) రూ. 3 వేల గౌరవ వేతనం అందజేసేందుకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన మార్గదర్శకాలను సెర్ప్ సిద్ధం చేయగా...దీనికి అనుగుణంగా జీవో 58ని ప్రభుత్వం విడుదల చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుండి తెలంగాణ లోని 18 వేల 836 మంది లకు 3 వేల రూపాయల గౌరవ వేతనం అందనుంది. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృఎద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గ్రామాలలో మహిళా చైతన్యం తో పాటు ...సామాజిక రుగ్మతలు రూపుమాపడంలో, అక్షరాస్యత పెంచడంలో లు కృషి చేయాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. అలాగే ఉపాధి హామీ, హరిత హారం లాంటి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో వీఓఏ లు ముందుండలన్నారు. వీఓ ల మీటింగ్ లు ఏర్పాటు చేయడం, బుక్ కీపింగ్ చేయడంతో పాటు, రోజువారి కార్యక్రమాల్లో వీఓఏ లు ఇప్పటిదాకా క్రియాశీల పాత్ర పోషించారన్నారు. ఇకనుండి మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణకు పట్టినశని ముఖ్యమంత్రి కేసీఆర్

- చట్టాలపై కేసీఆర్‌కు అవగహనలేదు
- రాజ్యాంగానికి ఎవరేమి అతీతులు కాదు
- మాజీ మంత్రి జీవన్ రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణకు పట్టిన శని అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి జీవన్‌రెడ్డి విమర్శించారు. ఆయనకు చట్టాలపై అవగాహన ఉందో లేదో తెలియదన్నారు. న్యాయ వ్యవస్థను కించపరు స్తున్నారని ఆరోపించారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంలో అంతర్గత విభేదాలతో సింగరేణి వారసత్వ ఉద్యోగాలపై పలువురు కోర్టుకు వెళితే దానికి కాంగ్రెస్‌పార్టీకి అపాదించడం హాస్యా స్పదంగా ఉందన్నారు. ఆయనేమీ రాజ్యాం గానికి అతీతుడు కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం ఇప్పటి వరకు కేంద్రానికి డీపీఆర్ సమర్పించలేదని విమర్శించారు.

కేసీఆర్ అబద్ధాలతో ప్రజల్ని మోసం చేస్తున్నారని, చెప్పే అబద్ధాలకు, చేసే మోసాలకు ముక్కు నేలకు రాయాల్సి వస్తే కేసీఆర్‌కు ముక్కు కూడా మిగలదని ఎద్దేవా చేశారు. ప్రాణహిత–చేవెళ్లతో తెలంగాణ సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉన్నా, రీడిజైన్ పేరుతో కాలయాపన చేస్తున్నారని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రాజెక్టుల నిర్మాణ జాప్యానికి కేసీఆర్ కారణమని ఆరోపించారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ విధి లేని పరిస్థితుల్లోనే కరీంనగర్ మెడికల్ కాలేజ్ కోసం ఆమరణ దీక్షకు దిగుతున్నారని చెప్పారు. ఈ రాష్ట్రంలో పౌరహక్కులకు విలువ లేదన్నారు. కేసీఆర్‌ను ఆయన అహంకారమే గద్దె దించుతుందని జీవన్‌రెడ్డి అన్నారు.

టీడీపీలోకి నంద్యాల ఇంతియాజ్ అహ్మద్



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : నంద్యాల ఉప ఎన్నిక వేళ తెలుగు దేశం పార్టీలోకి కొత్త చేరికలు జరుగుతున్నాయి. గురువారం ఏపీ సీఎం చంద్రబాబు సమక్షంలో నంద్యాల విద్యా సంస్థల అధినేత ఇంతి యాజ్ అహ్మద్ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ కండువా కప్పి సీఎం సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఇంతియాజ్ ప్రిన్సిపాల్‌గా స్వచ్ఛందంగా రాజీనామా చేసి పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన నంద్యాలను అభివృద్ధి బాటలో నిలబెట్టడమే దివంగత నేత భూమా నాగిరెడ్డికి ఇచ్చే నివాళి అన్నారు. కుప్పం తరహాలో నంద్యాలను అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. ఇంతియాజ్ మాటాడుతూ నంద్యాల అభివృద్ధిని కాంక్షించే ప్రతిఒక్కరూ తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాల్సిన సమయం ఇదేనన్నారు.

విక్రంగౌడ్‌కు 14 రోజుల రిమాండ్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః కాల్పుల కేసుకు సంబంధించి విక్రమ్ గౌడ్‌ను అపోలో ఆస్పత్రి గురువారం డిశ్చార్జ్ చేసింది. వీల్‌చైర్‌పైనే ఉన్న విక్ర మ్‌గౌడ్‌ను వెంటనే బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి నాంపల్లి కోర్టుకు తరలించారు.నాంపల్లి కోర్టు ఆయనకు 14రోజుల రిమాండ్ విధించింది. గాంధీ లేదా ఉస్మానియా ఆసుపత్రిలో విక్రమ్‌గౌడ్కు చికిత్స అందించాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్‌ను పోలీసులు అరెస్టుచేశారు. నియోజకవర్గ ప్రజల సానుభూతి కోసం ఆయన కాల్పుల డ్రామా ఆడి అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందారు.

40 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు



హైదరాబాద్, మేజర్‌న్యూస్: నలభై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజల కనీస అవసరాలను కూడా తీర్చలేదని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ మండిపడ్డారు. జలయజ్ఞం పేరుతో కాంగ్రెస్ దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. టీఆర్‌ఎస్ శాసనసభా పక్ష కార్యాలయంలో మంత్రి ఈటల మాట్లాడుతూ కాంగ్రెస్ అడుగడుగునా అభివృద్ధికి అడ్డుపడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్ని కేసులు వేసినా మా కమిట్‌మెంట్‌ను ఆపలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మిడ్ మానేరు రెండేళ్లలో పూర్తిచేస్తామని చెప్పి, పదేళ్లయినా పూర్తి చేయలేదన్నారు. ఎవరు వేలెత్తి చూపించకుండా సీఎం కేసీఆర్ తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేలా ప్రగతి పథంలో నడిపిస్తున్నరన్నారు. ప్రజలే పరమావధిగా టీఆర్‌ఎస్ పాలన సాగుతున్నదని ఈటల అన్నారు. కాంగ్రెస్ నేతలు నిరాశ, నిస్పృహతో మాట్లాడుతున్నరని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వానికి దిశ, కర్తవ్యం ఉందని, కేంద్రంతోపాటు మిగతా రాష్ట్రాలు ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తున్నాయన్నారు.

ప్రభుత్వ భూములను కార్యకర్తలకు ధార దత్తం : కరణం తిరుపతి

హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ప్రభుత్వం చుక్కల భూమి పేరుతో కేవలం తెలుగు దేశం పార్టీ కార్యకర్తలకు దారాదత్తం చేస్తున్నది, ఇది రాజ్యాంగ విరుద్ధమని యునైటెడ్ బహుజన పోరాట సమితి జాతీయ కన్వీనర్ కరణం తిరుపతి నాయుడు ఆరోపించారు. నిజమైన లబ్ది దారులకు న్యాయం జరుగడం లేదని పేర్కొన్నారు.దీనితోపాటు చుక్కల భూమిపై అర్డిఓలకు సహితం అధికారాలు ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలు సూచించిన వారికి అధికారులు భూమి అప్పజెప్పుతున్నరన్నారని ఆరోపించారు. ప్రభుత్వ విధానంవల్ల పేదరైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్త్యం చేసారు. అభివృద్ధి పేరుతో రైతులనుని సేకరించిన భూములను కార్పోరేట్ సంస్థలకు,పార్టీ నాయకులకు కేటాయిస్తున్నరన్నారు.ప్రభుత్వం వేసిన జన్మ భూమి కమిటీల ద్వార కూడానిజమైన లబ్ది దారులకు న్యాయం జరుగటం లేదన్నారు.కమిటి సిఫార్సు చేసిన వారికే బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయని తిరుపతి నాయుడు ఆరోపించారు.దీనితో పేద రైతుల పరిస్థితి దారుణంగా మారిందని తెలిపారు.దిక్కు తోచని స్థితిలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇప్పటికైనా ముఖ్య మంత్రి స్పందించి నిజమైన లబ్ది దారులకు న్యాయం జరిగే లా చూడాలని కరణం తిరుపతి నాయుడు డిమాండ్ చేశారు.

హరితహారంలో విద్యార్థులంతా పాల్గొనాలి

- పచ్చనిచెట్లు ప్రగతికి మెట్లు
- గట్టు హైస్కూలు అభివృద్ధికి 20 వేలు విరాళం
- బీ. సి. కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆంజనేయ గౌడ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్ ః రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో విద్యార్థులంతా విధిగా పాల్గొనాలని బీసీ కమిషన్ సభ్యుడు డా. ఆంజనేయగౌడ్ పిలుపునిచ్చారు. .గట్టు హైస్కూలు లో ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమానికి స్థానిక మార్కెట్ చైర్మన్ బండ్ల లక్ష్మీదేవిలతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మట్లాడుతూ గట్టు పాఠశాల ను సందర్శించడం నాకు కన్నతల్లి దగ్గరకు వచ్చినంత ఆనందం ఉందన్నారు. దేశంలో ఎన్నో పాఠశాలలను సందర్శించిన కలుగని గట్టు పాఠశాల ను సందర్శించడం ద్వారా కలిగిందన్నారు. గట్టు మండలం గత పాలకుల కుట్రలో బలి అయిందన్నారు. ఎంతో అభివృద్ధి చెందాల్సిన గట్టు మండలం, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. గట్టు పాఠశాల అభివృద్ధికి కోసం తనవంతు గా 20 వేలు అందజేస్తున్నట్లు ప్రకటించారు. తాను పేదకుటుంబంనుండి వచ్చానని విద్యార్థుల కష్టాలు తనకు తెలుసునని ఆంజనేయగౌడ్ చెప్పారు. విద్యార్థులు పుస్తకాలను ప్రేమించాలని వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయబృందం ఆంజనేయగౌడ్‌ను ఘణంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిజాముద్దిన్, పిఎసిఎస్ రాముడు, ఉపాధ్యాయులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సంపాదకీయం

editpage@suryaa.com

"ఇది వరకు ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం రాజ్యసభ ఎన్నికలు ఒకింత అలజడికి కారణం అవుతున్నాయి. ముఖ్యంగా ఒక్క రాజ్య సభ స్థానం కోసం తీవ్రాతితీవ్రంగా పోటీ జరుగుతుండడం విశేషం. పార్లమెంట్ ఎగువ సభలో ఒక్క సీటు కోసం జరుగుతున్న పోటీ దేశ రాజకీయాల తీరుకు దర్పణం పడుతోంది. లోక్‌సభ ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో తన బలాన్ని నిలబెట్టుకోవడానికి నానా తంటాలు పడుతోంది. పార్టీ అధినేత్రి సోనియా గాంధి రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ రాజ్యసభకు మళ్లీ ఎన్నికయ్యేలా చూసేందుకు కాంగ్రెస్ సర్వ శక్తులూ ఒడ్డుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ)కు సారథ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ దూకుడుగా వ్యవహరిస్తుండడం, తనకు విజయం దక్కకుండా చేయాలని ఆ పార్టీ ఆకాంక్షిస్తుండడం నేపథ్యంలో రాజకీయ మనుగడ కోసం అహ్మద్ పటేల్ పడుతున్న ప్రయాస అధికార దౌర్బల్యాన్ని, అధికార కూటమి విస్తరణ కాంక్షను, ప్రతిపక్షం నానాటికీ కుంచించుకుపోతున్న తీరును, మన వ్యవస్థల స్థితిని తేటతెల్లం చేస్తోంది."

రాజ్యసభ సీటు అలజడి

ఇది వరకు ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం రాజ్యసభ ఎన్నికలు ఒకింత అలజడికి కారణం అవుతున్నాయి. ముఖ్యంగా ఒక్క రాజ్య సభ స్థానం కోసం తీవ్రాతితీవ్రంగా పోటీ జరుగుతుండడం విశేషం. పార్లమెంట్ ఎగువ సభలో ఒక్క సీటు కోసం జరుగుతున్న పోటీ దేశ రాజకీయాల తీరుకు దర్పణం పడుతోంది. లోక్‌సభ ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో తన బలాన్ని నిలబెట్టుకోవడానికి నానా తంటాలు పడుతోంది. పార్టీ అధినేత్రి సోనియా గాంధి రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ రాజ్యసభకు మళ్లీ ఎన్నికయ్యేలా చూసేందుకు కాంగ్రెస్ సర్వ శక్తులూ ఒడ్డుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ)కు సారథ్యం వహిస్తున్న భారతీయ జనతా పార్టీ దూకుడుగా వ్యవహరిస్తుండడం, తనకు విజయం దక్కకుండా చేయాలని ఆ పార్టీ ఆకాంక్షిస్తుండడం నేపథ్యంలో రాజకీయ మనుగడ కోసం అహ్మద్ పటేల్ పడుతున్న ప్రయాస అధికార దౌర్బల్యాన్ని, అధికార కూటమి విస్తరణ కాంక్షను, ప్రతిపక్షం నానాటికీ కుంచించుకుపోతున్న తీరును, మన వ్యవస్థల స్థితిని తేటతెల్లం చేస్తోంది. ఈ పోటీ గురించి సరైన అవగాహనకు రావాలంటే ఒకసారి 2004-14 కాలాన్ని పునరావలోకనం చేయవలసి ఉంటుంది. సోనియా గాంధి రాజకీయ కార్యదర్శిగా అహ్మద్ పటేల్ దాదాపు దేశాన్ని నడిపారు. మంత్రుల నియామకంలోను, పార్లమెంట్ సభ్యుల ఎంపికలోను, గూఢచారి సంస్థల అధినేతల నుంచి రాజ్యాంగ పదవులు నిర్వహించేవారి వరకు ప్రభుత్వ నియామకాలను ప్రభావితం చేయడంలోను ఆయన కీలక పాత్ర పోషించారు. ఇంకా, పార్టీ కోశాగారంపైన ఆయన అజమాయిషీ వహించడమే కాకుండా మిత్ర పక్షాలను సమన్వయం చేయడం, ప్రతిపక్షాన్ని బలహీనం చేసే వ్యూహాలను కూడా రూపొందించారు. సరిగ్గా అదే కారణంగా అహ్మద్ పటేల్ ఇప్పుడు తన జీవితంలో అత్యంత ముఖ్యమైన పోరాటం సాగిస్తున్నారు. అది తాను ఒకప్పుడు అనుభవించిన అధికారాన్ని తిరిగి కైవసం చేసుకోవడానికి గాని, కాంగ్రెస్‌ను తిరిగి మహోజ్వల దశకు చేర్చడానికి గాని కాదు. తన గుత్తగా భావిస్తున్న సీటును గెలవడానికి ఆయన ఆ పోరు సాగిస్తున్నారు. ప్రజాస్వామ్యం శక్తిమంతుని ఎంతగా దెబ్బ తీస్తుందో, అధికారం ఎంత క్షణభంగురమో కూడా ఈ ఉదంతం సూచిస్తోంది. ప్రస్తుతం అధికారాన్ని అనుభవిస్తున్నవారు సైతం నేర్చుకోవలసిన పాఠం ఇది. మరి అహ్మద్ పటేల్ తన పదవి కోసం ఎందుకు ఇంత ప్రయాస పడుతున్నారనే సందేహం కలగవచ్చు. ఇందుకు కొన్ని కారణాలు ఉన్నాయి. వాటిలో మొదటిది... నరేంద్ర మోడీ, అమిత్ షా రాజకీయాలను నడుపుతున్న విధం. ప్రతి ఎన్నిక ప్రధానమైనదే. ప్రతి ఎన్నికలో గెలవడమూ ప్రధానమే. పార్టీ ఏకైక లక్ష్యం అధికారాన్ని కైవసం చేసుకోవడం, తన బలాన్ని విస్తరించుకోవడం. 'పార్లమెంట్ నుంచి పంచాయతీ వరకు' ప్రతి ఎన్నికలో గెలవాలన్నది లక్ష్యం కావాలని అమిత్ షా ఒక సందర్భంలో ప్రకటించారు. పూర్వపు రోజుల్లో పార్టీల అగ్ర నేతల మధ్య ఒక విధమైన అవగాహన ఉంటుండేది. రాజకీయ అస్తిత్వం నిలుపుకోవడానికి లేదా కనీసం ఒక పార్లమెంటరీ సీటు గెలుచుకోవడానికి మినహాయింపులు ఇచ్చుకుంటుండేవారు. ఆ విధమైన సర్దుబాట్లు అన్నీ మోడీ-షా హయాంలో అంతరించాయి. సర్వమూ హస్తగతం చేసుకోవడమే ధ్యేయం. ఇక రెండవది... అమిత్ షా వ్యక్తిగత ఆగ్రహం. తనపై అభియోగాలు నమోదు చేయించడంలో అహ్మద్ పటేల్ కుట్రపూరితంగా వ్యవహరించారని అమిత్ షా భావిస్తున్నారు. అమిత్ షా గుజరాత్‌లో హోమ్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎన్‌కౌంటర్ హత్యలకు నిజంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా లేదా అన్నది ఇక్కడ అప్రస్తుతం. అహ్మద్ పటేల్, యుపిఎ ప్రభుత్వం తనను వెంటాడారన్న కోపం అమిత్ షాను ఇప్పటికీ ఆవహిస్తూనే ఉన్నదన్నది సత్యం. వారు తనను జైలు పాలుచేయడమే కాకుండా ఏకంగా గుజరాత్ నుంచే పంపించి వేశారన్నది ఆయన మరవలేకపోతున్నారు. ఇప్పుడు ప్రతీకారం తీర్చుకునే తరుణం వచ్చింది. ఇక మూడవది... రాజ్యసభలో బిజెపి ఎదుర్కొంటున్న చిక్కులను పరిగణనలోకి తీసుకుంటే ప్రతి సీటూ ముఖ్యమైనదే. రాజ్యసభలో మెజారిటీని లేకపోవడమే సర్వం సహాధిపత్యానికి బిజెపి చేస్తున్న ప్రయత్నానికి అవరోధంగా ఉంటున్నది. ఉత్తర ప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో విజయం రాజ్యసభలో బిజెపి సంఖ్యాబలాన్ని క్రమంగా పెంచుతుంది. బీహార్‌ను తమ అధికార పరిధిలోకి తెచ్చుకున్నందున ఆ రాష్ట్రానికి చెందిన రాజ్యసభ సభ్యులు కూడా బిజెపి బలాన్ని పెంచుతారు. పార్టీ వీర విధేయుడు ఎం వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడం, తద్వారా రాజ్యసభ అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించడం పార్టీకి మేలు చేస్తుంది. మరి కొన్ని నెలల్లో గుజరాత్‌లో ఎన్నికలు జరగనున్నాయి. అయితే, రాష్ట్రం లో బిజెపి సామాజిక సంకీర్ణం పాటిదార్ ఉద్యమంతో దెబ్బ తిన్నది. మోడీ ప్రధాని పదవిని అధిష్ఠించిన తరువాత పార్టీ ఇద్దరు ముఖ్యమంత్రులను చూసింది. ఆనందీబెన్ పటేల్ పని తీరు చెప్పుకోదగినదిగా లేకపోయింది. ఆమె వారసునిగా వచ్చిన విజయ్ రూపాని గాని మెరుగైన ప్రదర్శన ఇవ్వలేకపోతున్నారు. అయితే, ఈ లోపాన్ని కాంగ్రెస్ సద్వినియోగం చేసుకోలేకపోవడమే విచిత్రం. పార్టీలో ప్రముఖ నేత వాఘేలా ఇప్పటికే కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. ఆరుగురు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు కూడా రాజీనామా చేశారు. తక్కినవారు కర్నాటకలో రిసార్ట్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఢిల్లీలో అత్యంత శక్తిమంతునిగా మారిన అహ్మద్ పటేల్ ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. రాజ్యసభ ఎన్నికలో ఓడిపోయినట్లయితే పార్టీ శ్రేణుల్లో నైతిక స్థైర్యం దెబ్బ తింటుంది. కాంగ్రెస్ ఇక పట్టించుకోదగిన పార్టీ కాదనే సంకేతం వోటర్లకు చేరుతుంది. ఈ లక్ష్యాల సాధనకు బిజెపి తన అధికారాన్నంతా వినియోగించనారంభించింది. అహ్మద్ పటేల్ పరాజయం పొందేలా చూసేందుకు తన అజమాయిషీ కింద ఉన్న సంస్థలను పార్టీ ఉపయోగించుకుంటున్నది. గుజరాత్ ఎంఎల్‌ఎలకు ఆతిథ్యం ఇస్తున్న కర్నాటక మంత్రి ఇళ్లపై ఐటి దాడులు కాకతాళీయం అని భావించడం ఈ దృష్ట్యా కష్టం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇటువంటి సంస్థలను దుర్వినియోగం చేసింది కదా అని బిజెపి వాదిస్తోంది. అది నిజమే. అహ్మద్ పటేల్ ఎన్నిక కష్టమేనని భయపడుతున్న కాంగ్రెస్ మరొక అస్త్రాన్ని ప్రయోగిం చింది. ఎన్నికల్లో ఉపయోగిస్తున్న 'నోటా' విధానాన్ని ఇప్పుడు రాజ్య సభ ఎన్నికలలో వినియోగించరాదని వాదిస్తూ కాంగ్రెస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 'నోటా' స్టే ఉత్తర్వు జారీ చేయాలన్న కాంగ్రెస్ అభ్యర్థనను సుప్రీం కోర్టు తిరస్కరించింది. కాంగ్రెస్‌కు ఈ పరిణామం కూడా నిస్పృహ కలిగించేదే.

వర్తమానం


అన్ని పార్టీలదీ బడుగుల బాటే



కప్పర ప్రసాదరావు: 9676776622

- తాయిలాలు ప్రకటిస్తున్న ప్రభుత్వం
- అధికారం కావాలంటున్న బడుగులు
- బిసిల పార్టీగా ప్రచారం చేసుకుంటున్న బిజెపి
- బిసి ఫోరం పేరుతో కాంగ్రెస్ కసరత్తు
- ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాల ప్రయత్నం

ఓటర్ల మనసుగెలుచుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిఆర్‌ఎస్ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఇక కాంగ్రెస్ పార్టీ తెలంగాణాలో తన పంథాను పూర్తిగా మార్చుకుంటుంది. ఇప్పటి వరకు రెడ్డీ మార్క్ ఉన్న కాంగ్రెస్ బిసిలను అక్కున చేర్చుకునేందుకు వ్యూహాన్ని రచిస్తున్నది. బిసి ఫోరం పేరుతో సెమినార్లు, సదస్సులు నిర్వహిస్తూ వారికి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నది. దళితుల పాట పాడుతున్నది. మీరా కుమార్ లాంటి నేతలను సిరిసిల్ల కు తీసుకురావడం ద్వారా కాంగ్రెస్ దళితుల పక్షాన పోరాడుతుందన్న భావన కల్పించేందుకు కృషి చేస్తున్నది. అద్దంకి దయాకర్ లాంటి నాయకులు ప్రతిరోజు టివి చర్చల్లో టిఆర్‌ఎస్ దళిత వ్యతిరేకతను ఎండగడుతుంటే.. శ్రావణ్ లాంటి నేతలు బిసిల పక్షాన మాట్లాడుతున్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన లంబాడా హక్కుల నాయకుడు బెల్లయ్య నాయక్ కూడా గిరిజనులు, దళితుల పక్షాన మాట్లాడు తున్నారు. ఇలా కాంగ్రెస్ తన రూపును మార్చుకునేందుకు కృషి చేస్తున్నది. సమాజంలో కులాలు ప్రాతిపదికగనే ఎన్నికల యుద్ధం జరుగుతుంది కాబట్టి ఆ కులాలను అక్కున చేర్చుకునేందుకు ఈ మూడు పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఇంతవరకు కమల వికాసమే లేని అనేక ప్రాంతాల్లో ఈ శాన్య రాష్ట్రాల్లో కూడా కమలం వికసించడంతో బిజెపి తన దృష్టిని దక్షిణాదిపై పెట్టింది. కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లపై కమలం పార్టీ నేత అమిత్‌షా గురిపెట్టారు. తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి వెన్నుదన్నుగా ఉన్న అనేక కులాలు ఇప్పటికీ టిఆర్‌ఎస్ పక్షాన్నే ఉన్నాయి. టిఆర్‌ఎస్ వెలమల నాయకత్వంలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ రెడ్ల నాయకత్వంలో పనిచేస్తున్నది. పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సిఎల్‌పి నేత జానారెడ్డి ఇక ఎమ్మెల్యేలు కూడా రెడ్లే ఎక్కువగా ఉన్నారు. బిజెపి బిసిల నాయకత్వంలో ఉండగా, బిజెఎల్‌పికి మాత్రం కిషన్‌రెడ్డి సారధ్యం వహిస్తున్నారు. ఈ పార్టీలో ఒక బ్రాహ్మణ, ఇద్దరు బిసి, ఇద్దరు రెడ్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. బ్రాహ్మణ కులానికే చెందిన రామచంద్రరావు ఎమ్మెల్సీగాను, బిజెపి నగర అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. బిసి వర్గానికి చెందిన బండారు దత్తాత్రేయ కేంద్రమంత్రిగా ఉండటం, బిసిలలో అత్యధిక జనాభా ఉన్న మున్నూరు కాపు కులానికి చెందిన డాక్టర్ లక్ష్మణ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్నారు. ఒబిసి మోర్చాను కూడా బలోపేతం చేస్తూ ఇటీవల కులాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తూ బలహీనవర్గాలను తమవైపు తిప్పుకునేందుకు బిజెపి తీవ్రంగానే ప్రయత్నిస్తున్నది. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న మాదిగలను తమవైపు తిప్పుకోవడంలో బిజెపి సఫలీకృత మయ్యింది. యస్సీలను ఎబిసిడిలుగా వర్గీకరించడం ద్వారా మందకృష్ణ మాదిగను ఆకర్షిస్తారు. ఇప్పటికే దాదాపు బిజెపి బాహువుల్లో ఉన్న మందకృష్ణ సమయం దొరికినప్పుడల్లా తాము కృతజ్ఞతను చాటుకుంటామని చెపుతూనే ఉన్నాడు. ఇక మరో అంశం బిసిలకు చట్టబద్దమైన రిజర్వేషన్లు కల్పించడం ఇందుకోసం స్వతంత్రం వచ్చినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న బిసి కమిషన్ కు రాజ్యాంగ హోదా కల్పించే విషయంలో బిజెపి చురుగ్గా వ్యవహరించింది. బిసి కమిషన్ కు రాజ్యాంగ హోదా ఇవ్వడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బిసిలలో సానుభూతిని సంపాదించింది. ఇప్పుడు ఇదే అంశం తెలంగాణాలో బిసిలను తమ వైపు



తిప్పుకునేందుకు వాడుకుంటుంది. . ఇప్పుడిప్పుడే రాజకీయంగా ఎదుగుతున్న అనేక బిసి కులాల నేతలకు బిజెపి ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే రాష్ట్రంలో బిజెపి బిసి జపం చేస్తున్నది. రాష్ట్ర అధ్యక్షునిగా డాక్టర్ లక్ష్మణ్ నియామకం తరువాత బిసి కులాలు బిజెపి వైపు చూస్తున్నాయి. బిసిలలో కుర్మలు బిజెపి వైపు ఉంటే యాదవులు టిఆర్‌ఎస్ వైపు ఉన్నారు. ఇక బలమైన కులాలు గౌడ, మున్నూరు కాపు లు కూడా టిఆర్‌ఎస్ వైపే ఉన్నారు. ఇప్పుడు సబ్బండ వర్ణాల్లో రాజకీయంగా ఇప్పటివరకు సీటు అనుభవించని ఇతర కులాలను ఆకర్షించే పనిలో బిజెపి నేతలు నిమగ్నమయ్యారు. ఇది సఫలమైతే రాష్ట్రంలో బిజెపి బలం గణనీయంగా పెరుగుతుంది. ఇక అగ్రవర్ణాలను కూడా బిజెపి వదలడం లేదు. సామాజికంగా, ఆర్థికంగా బలంగా ఉన్న రెడ్లను ఇప్పుడు బిజెపి టార్గెట్ చేసింది. ఇప్పటికే కాంగ్రెస్‌లోని ఓ వర్గం బిజెపి నేతలకు టచ్ లో ఉన్నట్లు చెపుతున్నారు. ఇటు రెడ్డి, అటు బిసి, యస్సీల్లో మాదిగలను తమవైపు తిప్పుకోవడం ఎలా అన్నదానిపైనే బిజెపి అఖిలభారత అధ్యక్షుడు అమిత్‌షా వ్యూహాలకు పదును పెడుతున్నారు. రాష్ట్ర నాయకత్వాన్ని అన్ని విషయాలలో పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కనిపిస్తున్నా పావులన్నీ ఢిల్లీ నుంచే కదుపుతున్నారు.

ఉలిక్కిపడుతున్న కేసిఆర్...

ఇప్పుడు కేసిఆర్ కాంగ్రెస్ , బిజెపి లను చూసి ఉలిక్కిపడుతున్నారు. గతంలో అమిత్‌షా తెలంగాణ పర్యటన తరువాత ప్రెస్ మీట్ పెట్టి మరీ అమిత్‌షాను తూలనాడారు. అసలు బిజెపి ఎదగనే ఎదగదని, ఉత్తరాదిలో తప్ప దక్షిణాదిలో వాళ్ల ఆటలు సాగవని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ పై పడ్డారు. దిగ్విజయ్ సింగ్ మొదలు కొని కిందిస్థాయి వరకు కాంగ్రెస్ నేతలను , ఆ పార్టీని ఏకి పారేసారు. తాను పెడుతున్న పథకాలపై కోర్టుకు వెళ్ళి స్టేలు తెస్తున్నారని, అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆయన అంటున్నారు. అంటే ఆయన ఆటలు సాగకుండా కాంగ్రెస్ అడ్డుపడుతుందని ఆ పార్టీకి అంత శక్తి ఉందని ఆయన చెప్పకనే చెప్పినట్లయ్యింది. బిసిలను ప్రతిపక్షాలు ఎగరేసుకు పోకుండా ఆయన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకుంటూనే ఉన్నారు. ఆనేక పథకాలను ప్రవేశపెట్టారు. బిసిలను అక్కున చేర్చుకుంటున్నట్లు ఆయన ఎన్ని చెపుతున్నా బిసిల్లోని చైతన్యవంతమైన వర్గాల నుంచి మాత్రం దీనిపట్ల వ్యతిరేకతే వ్యక్తమవుతున్నది. గొల్లలు గొర్ల కాయాలా, మాదిగలు డప్పులు కొట్టాలా, మంగలి గడ్డం గీకాలా, గీత కార్మికుడు కల్లు గీయాలా , చాకలి బట్టలు ఉతకాలా మాకు రాజ్యాధికారం వద్దా అంటూ ఆయా కులాల్లోని యువకులు నినదిస్తూనే ఉన్నారు. ఇక కేసిఆర్ వ్యూహాత్మకంగా చేసిన మరో తప్పిదం ముస్లిం లకు రిజర్వేషన్లు కల్పించడం. సుప్రీం కోర్టు వ్యతిరేకించినా, కేంద్రం వద్దని వారించినా తాను ముస్లింల పక్షపాతినంటూ కేసిఆర్ వారికి 12 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తీర్మానం చేశారు. దీన్ని బిజెపి తనకు అనుకూలంగా వాడుకుంది. బిసిలను రెచ్చగొట్టింది. బిసిలకు జనాభా లెక్కల ప్రకారం 55 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందిపోయి ముస్లింలను ఓటుబ్యాంక్ గా మార్చుకునేందుకు కేసిఆర్ చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టింది. బిసి సంఘాలను ఏకం చేసి ఉద్యమం నడిపింది. ఈ పరిణామలన్నీ కేసిఆర్ గమనిస్తూనే ఉన్నారు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి వ్యూహం ఫలించడం ఇప్పుడు దేశమంతటా బిజెపి గాలి వీస్తుండటంతో ఈ ప్రభావం తెలంగాణపై కూడా ఉంటుందని కేసిఆర్ భావిస్తున్నారు. బిజెపి ఎదుగుదలకు గట్టిగా దెబ్బ కొట్టేందుకు వ్యూహాలను రచిస్తూనే ఉన్నారు. అందులో భాగమే ఎంబిసి కార్పోరేషన్, కులాలవారీగా బడ్జెట్ అలకేషన్, రైతులకు ఎకరాకు నాలుగువేల రూపాయల ఉచిత సహాయం. ఇలా అనేక పథకాలు ప్రకటించారు. మహిళల మనసుగెలుచుకునేందుకు ఒంటరి మహిళలకు పెన్షన్ ను ప్రవేశపెట్టారు. అయితే ఏం చేసినా కూడా ఇప్పుడు బిసి కులాలు తాయిలాలకోసం ఎదురు చూడటం లేదు. రాజ్యాధికార దిశగానే ఆలోచిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం చెపుతున్న లెక్కల ప్రకారమే 94 శాతమున్న బిసి,యస్సీ,యస్టీ, మైనార్టీలకు రాజకీయ వాటా ఎంతని అడుగుతున్నాయి.

చరిత్రలో ఈరోజు

ఆగస్టు 4

జననాలు

1912: జంధ్యాల పాపయ్య శాస్త్రి, జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరు, కరుణశ్రీ అని ప్రసిద్ధులైనారు.

1926: మండలి వెంకట కృష్ణారావు, గాంధేయవాది.

1948: శత్రుచర్ల విజయరామరాజు, విజయనగరం జిల్లాలోని చినమేరంగి సంస్థానాదిపతి, మాజీ ఎంపీ

1954: ఉండవల్లి అరుణ కుమార్, భారత పార్లమెంటు సభ్యుడు.

1955: ఛార్లెస్ డి సామ్ గెమర్ యాంక్టన్ ఎస్.డి, రోదసీ యాత్రికుడు

ఉండవల్లి అరుణ కుమార్


ఉండవల్లి అరుణ కుమార్ (జననం ఆగష్టు 4, 1954), భారత పార్లమెంటు సభ్యుడు. ఇతడు రాజమండ్రి లోకసభ నియోజకవర్గం నుండి 14 వ, 15 వ లోక్‌సభలకు భారత జాతీయ కాంగ్రెసు అభ్యర్థిగా ఎన్నికయ్యాడు. ఈనాడు సంస్థలకు చెందిన మార్గదర్శిని ఫైనాన్సియర్స్ మరియు దాని యజమాని రామోజీరావును విమర్శించి ఉండవల్లి 2008లో వార్తల కెక్కాడు. ఉండవల్లి అరుణ కుమార్ ఒక తెలివైన రాజకీయ నాయకుడు. రాజీవ్, సోనియాలకు ట్రాన్సిలేటర్ (అనువాదకుడు)గా ఉన్నాడు. ఉండవల్లి అరుణ కుమార్ బ్రాహ్మణ కులమునకు ఛెందినవాడు. రామోజీరావు నడుపుతున్న ఈనాడు దినపత్రికకు వ్యతిరేకంగా ఇతడు కొందరు కాంగ్రెస్ యువ రాజకీయనాయకులతో కలిసి ఈవారం అనే రాజకీయ వారపత్రికను ప్రారంభించాడు.

మండలి వెంకట కృష్ణారావు



మండలి వెంకట కృష్ణారావు (ఆగస్టు 4, 1926 - సెప్టెంబర్ 27, 1997) అవనిగడ్డ శాసనసభ నియోజకవర్గం నుంచి 1972లో ఏకగ్రీవంగా ఎన్నికైన శాసన సభ్యుడు మరియు గాంధేయవాది. మాజీ రాష్ట్రమంత్రి మండలి బుద్ధప్రసాద్ ఈయన కుమారుడు. 1938 ఆగస్టు 4న కైకలూరు మండలం పల్లెవాడలో జన్మించారు. వీరి స్వస్థలం నాగాయలంక మండలంలోని భావదేవరపల్లి గ్రామము. 1926 ఆగస్టు 4న కృష్ణా జిల్లా కైకలూరు తాలూకా, పల్లెవాడ గ్రామంలో మండలి వేంకట కృష్ణారావు దివిసీమ గాంధీగా ప్రజల మన్నన లనందుకున్నారు. 1997 సెప్టెంబర్ 27న తుదిశ్వాస విడిచారు. బాధలలో ఉన్న వారిని మనమే ముందు వెల్లి ఓదార్చాలని వారు ఆచరించి చెప్పిన మాటలు దివిసీమ ప్రజలకు భగవద్గీతలా వినిపిస్తూనే ఉంటాయి.

జంధ్యాల పాపయ్యశాస్త్రి



జంధ్యాల పాపయ్య శాస్త్రి (ఆగస్టు 4, 1912 - జూన్ 21, 1992) 20వ శతాబ్దములో బాగా జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరు. వీరి స్వస్థలం గుంటూరు జిల్లా. వీరి కవిత్వము సులభమైన శైలిలో, సమ కాలీన ధోరణిలో, చక్కని తెలుగు నుడికారముతో వినసొంపై యుం డును. ఖండకావ్యములు వీరి ప్రత్యేకత. అందునా కరుణ రస ప్రధానముగా చాలా కవితలు వ్రాసి, కరుణశ్రీ అని ప్రసిద్ధులైనారు. వీరి కలం పేరు కరుణశ్రీ. ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, ఉమర్ ఖయ్యూం వీరి రచనలు. కుంతి కుమారి, పుష్పవిలాపం (ఘంటసాల గానం చేశారు) మొదలైన కవితా ఖండికలు బహుళ జనాదరణ పొందాయి. 20వ శతాబ్దములో బాగా జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరు. వీరి కవిత్వము సులభమైన శైలిలో, సమకాలీన ధోరణిలో, చక్కని తెలుగు నుడికారముతో విన సొంపై యుండును. ఖండకావ్యములు వీరి ప్రత్యేకత. అందునా కరుణ రస ప్రధానముగా చాలా కవితలు వ్రాసి, కరుణశ్రీ అని ప్రసిద్ధులైనారు. మృదుమధురమైన పద్య రచనాశైలి వీరి ప్రత్యేకత. జూన్ 22, 1992లో పాపయ్యశాస్త్రి పరమపదించారు.


ఆసియాఖండం చుట్టే ప్రపంచ రాజకీయాలు

డాక్టర్ కె. ఆసయ్య ఐఐఎస్ : 8008359912

- తాలిబన్‌ల గెరిల్లా యుద్ధం
- బిన్ లాడెన్‌ను తయారుచేసిన అమెరికా
- గల్ఫ్ దేశాల ఆయిల్‌పై ఆధిపత్యం
- లాడెన్‌ను మట్టు పెట్టేందుకు దశాబ్ద కాలం
- భారత్‌తో సంబంధాలు పెంచుకున్న రష్యా

మిగతా తరువాయి

2014 ఎన్నికలలో ఏకైక పార్టీగా బిజెపి అధికారంకు నడిపించిన మోడీ ప్రధాని కావడం ఇండియా చైనా దగ్గరయ్యాయి. ప్రధాని మోడీ చైనాకు స్నేహితుడవ్వడం ఇండియా అమెరికాకు దూరంగా ఉంటుందని అనుమానంతో ఒబామా ఇండియాకు రాగా ఒప్పందాలు కుదుర్చుకొన్నారు. అమెరికా ద్వంద వైఖరి వలన పాకిస్తాన్‌కు 2 బిలియన్ డాలర్స్ మిలటరీ ఎయిడ్ ఇచ్చింది. అమెరికాకు అతి ముఖ్యమైన హోదానిచ్చింది. ఇటు అమెరికా అటు చైనాలు పాకిస్తాన్ ఇండియాపై చెక్ పెడుతున్నాయి. ప్రధాని మోడీ బిజెపిలు కాశ్మీర్‌లో పాక్ చొరబాటులు చూపి దేశభక్తిని పెంపొందించాలని నినాదంతో కాశ్మీర్ ముఫ్తి మహ్మద్ సయ్యద్ పొత్తు ప్రభుత్వం నడుపుతుంది. మోడీ ప్రధాని అయ్యాక పశ్చిమ దేశాలు అయనకు వీసా నిరాకరించారనే కారణంతో మస్తిష్కంలో ఉంచుకొని ఇప్పటికీ 67 విదేశ పర్యటనలు చేశాడు. ఉగ్రవాద దేశమైన ఇజ్రాయెలుతో మైత్రి బంధం, హిట్లర్ జర్మనీతో బంధాలు గట్టి చేసుకొనుటకు ఆదేశాలను సందర్శించిన మొదటి ప్రధానిగా దేశ ప్రజాస్వామ్య పార్లమెంట్‌ను నిర్లక్ష్యం చేస్తూ విదేశాలలో రెడ్ కార్పెట్ ఆహ్వానాలకు అలవాటు పడి దేశ పాలనను నిర్లక్ష్యం చేస్తున్నారు. అంతర్గత సంస్కరణలతో ప్రధాని మోడీ సాగుతుంటే ఇండియా సరిహద్దులలో బీజింగ్ ఐరోపాకు రోడ్డు మార్గం నిర్మాణం తలపెట్టి ఇండియా భూభాగంలో చైనా అడుగు పెట్టి కయ్యానికి దిగుతుంది. ఈనేపథ్యంలో ఇండియా ప్రధాని దౌత్యం ఫలించుతుందా? లేదా చూడాలి. ఆసియా రాజకీయాలను శాసించేం దుకు చైనా తొంగి చూస్తుంటే మోడీ ప్రధాని మాత్రం కనీసం ఏ స్టేట్‌మెంట్ లేకుండా రక్షణమంత్రి జైట్లీ మీద వదిలి దేశాలు తిరుగుతున్నాడు. ఇంట గెలిచి రచ్చ గెలవాలి కాని మోడీ దానికి విరుద్ధంగా నడుస్తున్నాడు. చైనాలో అధిక జనాభ వలన వారి ప్రజల నీళ్లలో కూడ ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నారు. 2000 నుండి ఇండియాలోని అరుణాచల్ ప్రదేశ్‌పై కన్నేసింది. ఇంత భూమి ఉంది. కిలోమీటర్‌కు 12 మందే ఉంటారు. అటు వైపు చైనా కిలోమీటర్‌కు 540 మంది జీవించుతున్నారు. అందుకే అరుణాచల్ మాకు కావాలంటుంది. కాని బిజెపి వాజ్‌పాయ్ కాలంలో అరుణాచల్‌లో ప్రభుత్వం ఏర్పరచింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వమే ఉంది. సరిహద్దులలో రామకృష్ణ మిషన్, వివేకానంద స్వచ్ఛంద సంస్థలు విద్యా పాఠశాలలు పెట్టి ప్రజలను ఇండియా వైపు తిప్పుతున్నాయి. ఇటీవల అరుణాచల్‌లో "యురేనియం" గనులు లభ్యమైనాయి. 2009 లో అణువిద్యుత్ సంస్థ తవ్వకాలు జరుపుతుంది. అవి గనుక విజయవంతమైన మన అణువిద్యుత్ కార్యక్రమాలకు ధోకా ఉండదు. చైనా ఆకాంక్షను ఆసియాలో త్రిప్పికొట్టి దౌత్యపరంగా ఇండియా దక్షిణాసియా దేశాలలో తన సార్క్ సంబంధాలు పెంచుకోవాలి. చైనాను ఆసియా రాజకీయాలలో ఏకాకిని చేసి అమెరికా-రష్యాలతో మంతనాలు జరుపుతూ పాకిస్తాన్‌ను అదుపులో ఉంచేందుకు ఒకే జలక్/ యుద్ధం చేసి అణిచివేయాలి. అప్పుడు ఇండియా అంటే ఆసియా దేశాలకు తెలియజేయాలి. ఆక్రమిత కాశ్మీర్ అని, చొరబాటుదారులు, ఉగ్రవాదదాడులు ఇవి 1947 నుండి సాగుతూనే ఉన్నాయి. వీటిని అధిక ప్రచారం చేసి మన బలహీనతలను ప్రదర్శించకుండ దౌత్యపరంగా చైనా, పాకిస్తాన్‌లను అదుపుచేయాలి. అందుకు అమెరికా సహకారం, పుతిన్‌ను దగ్గరగా చేసుకొని దౌత్యం నెరపాలి. చైనా విస్తరణ విధానంను ఇండియా ఆదిలోనే అడ్డుకోవాలే కాని తలొగ్గరాదు. ఎన్‌డిఎ ప్రభుత్వం చైనాతో తన లోపాయికారీతనం విడనాడి ఇండియా మార్కెట్ల నుండి చైనాను వెళ్లగొట్టాలి. మన ఆర్థిక స్థితిని మెరుగుపర్చుకుంటూ ఉగ్రవాదంను అణ చివేయాలి. అందుకు అంతర్జాతీయ దౌత్య పోకడలను ఉపయోగించి ఇండియా సత్తా ప్రపంచానికి చాటాలి. రక్షణమంత్రి హెచ్చరికలు ఇండియా 1962 స్థితిలో లేదు. తన సత్తా చూపిస్తుందన్నారు. మనకున్న స్నేమ సంబంధాలుపయోగించుకొని చైనా కవ్వింపు చర్యలను అదుపులో నొక్కి పెట్టాలి. చైనా కవ్వింపుకు పాక్ కారణం కనుక దానికి గట్టిగా బుద్ధి చెప్పాలి. చైనా ఇండియా చుట్టూ ఏర్పరచిన వలయంను ఛేదించి సార్క్ దేశాలలో తనకు తిరుగులేదని చాటుతుందని ఆశిద్దాం.



సూర్యలేఖ : సర్వం కల్తీ... సకలం కల్తీ

'కల్తీలకు కళ్ళెం వేయలేమా?' - సమాజంలో ప్రతి మనిషికి ఆరోగ్యంగా జీవించే హక్కు ఉంది. నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకొనే హక్కు ప్రతి ఒక్కరికి ఉంది. కానీ, ఈ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంది. సమాజమంతా సర్వం కల్తీ.. సకలం కల్తీ అన్న మాదిరిగా మారి పోయింది. మనం ఉదయం లేచింది మొదలు , పడుకునే వరకు మనం తీసుకునే ఆహారం మొత్తం కూడా కల్తీ మయం! రోజు మనం ఉదయాన్నే తీసుకునే పాలు, కాఫీ, టీ లాంటి వాటిలో కూడా కల్తీ జరుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే వాటిలో పురుగుల మందులైన యూరియా, బోరిక్ యాసిడ్ లాంటి ఇతర్రత రసాయనాలను పాలల్లో కలుపుతున్నారు. హోటళ్ళలోత యారయ్యే ఆహార పదార్థాల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇటీవల కాలంలో అధికారుల దాడులతో బయటపడిన దారుణాలు మనందరికి తెలిసిందే. చనిపోయిన జంతు కళేబరాల అవశేషాలు, పంది కొవ్వులతో వంట నూనెలు చేస్తున్న సంఘటనలు హైదరాబాదు, వరంగల్ లాంటి ప్రాంతాలలో వెలుగులోకి వచ్చాయి. చివరకు ప్రకృతి ప్రసాదమైన పండ్లను కూడా వదలడం లేదు. వీటిని అత్యంతప్రమాదకరమైన కార్బైడ్ రసాయనాల ద్వార పండ్లను మాగబెట్టి పక్వానికి తీసుకువచ్చి, జనాలకు విక్రయించడం జరుగుతుంది.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ (2006), ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రూల్స్ అండ్ రెగ్యూలేషన్ (2011) వంటి చట్టాలు మన దేశంలో ఉన్నాయి. కఠినమైన ఆహార బద్రతా ప్రమాణాలను వాటిలో పొందుపరి చారు. కానీ, మన దేశం మొత్తంలో కేవలం 145 ఆహార పరీక్షా కేంద్రాలు న్నాయి. ఏ విధంగా చూసినా మన లెక్కలకు చాలా తక్కువే. ఫలితంగా ఆహార నమూనాలు ప్రయోగశాలల్లో గుట్టలు గుట్టలుగా పేరుకుపో యాయి. భారత్ కంటే చైనా ఈ విషయంలో ఎంతో ముందుందని చెప్పవచ్చు. చైనా దేశంలో ప్రతి రెండు లక్షల మందికి ఒక ప్రయోగ శాల ఉంటుంది. 2013 నాటికే సుమారు 6,800 గుర్తింపు పొందిన పరీక్షా కేంద్రాలున్నాయి. మన దేశంలో మాత్రం కేవలం 65 పరీక్షా కేంద్రాలు గుర్తింపు పొందినవి ఉన్నాయి. ప్రమాణాల విషయంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధానం ఉండడం వలన సమస్యలు జటిలమవుతున్నాయి. మ్యాగీపై ఎందుకు నిషేదం విధించారో, ఆ వస్తువులో ఏ మార్పు రాకుండా ఎందుకు తొలగించారో ఎవ్వరికి అంతు చిక్కని ప్రశ్న. కల్తీ జరిగినపుడు అక్కడికి వెళ్ళిన అధికారులు ఆయా పదార్థాల నుండి శాంపిల్స్ సేకరిస్తున్నారా! లేదా, లేదంటే.. సంబధిత ఏజెన్సీలతో కుమ్మక్కై వాటాల మోజులో మునిగిపోతున్నారా? అని అనుక్షణం గమనించే సమర్ధవంతమైన ప్రజావేగు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కల్తీ చేసిన వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వాలు చూడాలి. తద్వారా పాలన యంత్రాంగం సామర్థ్యం పెరుగుతుంది. అప్పుడు గానీ ఈ కల్తీల మహమ్మారిని పాతరేసినవారమవుతాం...! -

శ్రీనివాస్ చిరిపోతుల : 96034 71199



ఇండియన్ టెక్కీలకు మేలు కలిగించే నిర్ణయం తీసుకున్న డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ: చట్ట బద్ధంగా వీసాలను పొంది అమెరికాలోకి ప్రవేశిస్తున్న వారి సంఖ్యను సగానికి తగ్గించాలని నిర్ణయించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, నైపుణ్యవంతులైన ఇండియన్ టెక్కీలకు మేలు చేకూర్చే నిర్ణయాలు ప్రకటించారు. మెరిట్ ఆధారిత విధానం ద్వారా ఆంగ్ల భాషను అనర్గళంగా మాట్లాడే ఉద్యోగులకు రెసిడెన్సీ కార్డులు అధికంగా ఇవ్వాలన్న బిల్లుకు ఆయన మద్దతు పలికారు. ఇది భారత నిపుణులకు ఓ వరం వంటిదేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రైజ్ (రిఫార్మింగ్ అమెరికన్ ఇమిగ్రేషన్ ఫర్ స్ట్రాంగ్ ఎంప్లాయిమెంట్) పేరిట తయారైన ఈ బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదిస్తే, చట్ట రూపంలోకి రానుంది. యూఎస్ వీసాలకు అమలు చేస్తున్న ప్రస్తుత లాటరీ విధానం స్థానంలో మెరిట్ ఆధారిత కొత్త సిస్టమ్ అమలులోకి వస్తుంది. ఇక గ్రీన్ కార్డును పొందే విధానం కూడా మారిపోనుంది. పాయింట్ల ఆధారిత నూతన విధానంలో గ్రీన్ కార్డుల జారీ మొదలవుతుంది. చదివిన విద్య, వేతనం, పని చేస్తున్న కంపెనీ, ఆంగ్ల పరిజ్ఞానం, వయసు వంటి విషయాలపై పాయింట్లను ఇచ్చి అందుకు అనుగుణంగా గ్రీన్ కార్డులను జారీ చేసే విధానాన్ని కూడా రైజ్ లో పొందుపరిచారు. ఇక ఈ చట్టానికి మద్దతు పలుకుతూ, వైట్ హౌస్‌లో మాట్లాడిన ట్రంప్, రైజ్ చట్టం అమల్లోకి వస్తే పేదరికం తగ్గుతుంది. వేతనాలు పెరుగుతాయి. పన్ను చెల్లింపుదారులకు బిలియన్ డాలర్ల కొద్దీ డబ్బు మిగులుతుంది. ఇతర దేశాల నుంచి వచ్చే వారికి ఇచ్చే అనుమతులు మరింత పారదర్శకంగా ఉండాలన్నదే మా అభిమతం. ఈ విధానంలో మరింత వేగంగా యూఎస్ పౌరసత్వం లభిస్తుంది అన్నారు.




3-8-2017 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	32,187.25
గరిష్ఠం	32,494.61
కనిష్ఠం	32,121.63
ముగింపు	**32,237.88**
మార్పు (పా)	-238.86
మార్పు (శా)	-0.63

నిఫ్టీ	
ఆరంభం	10,081.15
గరిష్ఠం	10,081.15
కనిష్ఠం	9,998.25
ముగింపు	**10,013.65**
మార్పు (పా)	-67.85
మార్పు (శా)	-0.67

ఎన్ఎస్ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	10,393.11	-59.22	-0.57
S&P BSE SENSEX Next 50	33,666.08	-77.53	-0.23
S&P BSE 100	10,380.33	-53.53	-0.51
S&P BSE MidCap	15,335.12	-76.84	-0.50

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
FORTIS	163.70	+10.70	+6.99
BATAINDIA	622.05	+38.55	+6.61
EDELWEISS	226.00	+11.10	+5.17
VIDEOIND	23.70	+1.10	+4.87
GODREJCP	969.75	+44.75	+4.84

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
JINDALSTEL	142.20	-15.95	-10.09
UNITECH	7.49	-0.73	-8.88
RCOM	23.10	-1.95	-7.78
PNB	149.40	-9.50	-5.98
SYNDIBANK	69.65	-3.20	-4.39

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
LUPIN	994.90	136.72	1356349
FORTIS	163.70	119.47	7479860
TCS	2489.55	112.82	453594
INDUSINDBK	1645.25	108.38	658734
BAJAJFINSV	5120.60	89.97	177549

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	64.0683	యూరో	75.7415
యన్	58.1200	పౌండ్	84.6214

జీఎస్టీ దెబ్బకు తగ్గిన కొనుగోలు శక్తి

నాలుగేళ్ల కనిష్ఠానికి పీఎంఐ

- వెల్లడించిన తాజా గణాంకాలు
- జూలై పీఎంఐ 45.9 పాయింట్లే
- సెప్టెంబర్ 2013 తరువాత అత్యంత కనిష్ఠ స్థాయికి



న్యూఢిల్లీ: గడచిన నెల రోజులుగా దేశవ్యాప్తంగా వస్తు సేవల పన్ను అమలు అవుతుండగా, ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిందని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జూలై నెల సర్వీసెస్ పీఎంఐ (పర్చేజ్ మేనేజింగ్ ఇండెక్స్) 50 పాయింట్ల మార్క్ కన్నా కిందకు జారింది. తాజా సర్వేలో సెప్టెంబర్ 2013 తరువాత అత్యంత కనిష్ఠ స్థాయిలో 45.9 పాయింట్లకు చేరింది. గడచిన జూన్ నెలలో ఎనిమిది నెలల గరిష్ఠస్థాయిలో 52.7గా ఉన్న పీఎంఐ, సమీప భవిష్యత్తులో మార్చి 2009 స్థాయికి పడిపోయి 46 వరకూ చేరవచ్చని నిక్కీ/ఐహెచ్ఎస్ మార్కిట్ కాంపోజిట్ పీఎంఐ అంచనా వేసింది. నోట్ల రద్దు తరువాత పీఎంఐ ఇండెక్స్ తగ్గుతూ వచ్చినప్పటికీ, జీఎస్టీ అమలుకు ముందు పలు రకాల ప్రొడక్టుల్లో వచ్చిన ఆఫర్ల కారణంగా అమ్మకాలు సంతృప్తికరంగా సాగిన మీదటే జూన్ పీఎంఐ సంతృప్తిగా కనిపించిందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేశారు. జీఎస్టీ అమలు తరువాత నిర్మాణ రంగం ఎంతో అయోమయంలో పడిపోయిందని ఐహెచ్ఎస్ మార్కిట్ ప్రిన్సిపల్ ఎకానమిస్ట్ పల్లీయానా డీ లిమా వెల్లడించారు. ఎన్నో వస్తువులపై పన్నులు పెరిగాయని ఆయన అన్నారు. ఉత్పత్తిరంగంతో పాటు పలు కీలక రంగాల్లో జీఎస్టీ అమలుపై కన్ఫ్యూజన్ నెలకొని ఉందని వెల్లడించారు.

జీఎస్టీ కౌన్సిల్ సూపరింటెండెంట్ అరెస్ట్: దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమల్లోకి తీసుకువచ్చేందుకు ఏర్పాటైన జీఎస్టీ కౌన్సిల్‌కు చెందిన సూపరింటెండెంట్ అరెస్ట్ అయ్యారు. తన సన్నిహిత సహాయకుని నుంచి లంచం తీసుకున్నాడనే ఆరోపణల నేపథ్యంలో సీబీఐ ఆయన్ని అరెస్టు చేసింది. జీఎస్టీ కౌన్సిల్ సూపరింటెండెంట్ మోనిష్ మల్హోత్రాను, మధ్యవర్తి మానస్ పాత్రను గత సాయంత్రం సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు చెప్పారు. సీబీఐ ద్వారా అరెస్టు చేయబడ్డ తొలి జీఎస్టీ కౌన్సిల్ అధికారి ఈయనే కావడం గమనార్హం. మల్హోత్రా అంతకముందు సెంట్రల్ ఎక్సైజ్‌లో పనిచేసేవారు. మల్హోత్రా సూచనలతో టాక్స్ కన్సల్టెంట్ అయిన మానస్ పాత్ర గత కొన్ని రోజులుగా కొన్ని ప్రైవేట్ కంపెనీల నుంచి అక్రమంగా గ్రాటిఫికేషన్‌ను త్రైమాసికం, నెలవారీ బేసిస్‌లో సేకరిస్తున్నట్టు వెల్లడైంది. తర్వాత వాటిని మల్హోత్రాకు పంపిస్తున్నట్టు వెల్లడైంది. తొలుత ఈ ఫండ్స్‌ను పాత్ర తన అకౌంట్‌లోకి వేసుకుని, అనంతరం వీటిని మల్హోత్రా భార్య శోభనా బ్యాంకు అకౌంట్ హెచ్‌డీఎఫ్‌సీలోకి, కూతురి ఐసీఐసీఐ బ్యాంకు అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్టు సీబీఐ అధికారులు గుర్తించారు. మల్హోత్రాకు, పాత్రకు సంబంధమున్న ఆధారాలను ఏజెన్సీ అధికారులు బుధవారం మల్హోత్రా నివాసంలో సేకరించారు. వాటితోపాటు లంచం తీసుకున్న పత్రాలను వారు స్వాధీనం తీసుకున్నారు. మల్హోత్రా, పాత్ర నివాసాల్లో సెర్చ్ చేసిన సీబీఐ అధికారులు, పలు డాక్యుమెంట్లతో పాటు ఆ ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు.

బ్యాంకులను ఇరకాటంలోకి నెట్టిన ఆర్బీఐ: నవంబర్ 2010 తరువాత అత్యంత తక్కువ స్థాయికి వడ్డీ రేటును చేర్చిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దేశంలోని బ్యాంకులు ఇక రుణాలపై వడ్డీ రేటును తగ్గించక తప్పని పరిస్థితిని తెచ్చింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడం ద్వారా రుణ లభ్యత సులభతరం కానుందన్న సంకేతాలను ఆర్బీఐ పంపింది. ఇటీవలి కాలంలో తగ్గుతూ వచ్చిన ద్రవ్యోల్బణానికి తోడు, జీఎస్టీ అమలు కారణంగా మార్కెట్ విలువ పెరగడం, కొత్త కంపెనీల రాక తదితర కారణాలతో వడ్డీ రేట్లు తగ్గితే, జీడీపీ మరింత వేగంగా వృద్ధి చెందుతుందని కూడా ఆర్బీఐ ఆలోచించింది.

ఇక ఇంతకాలమూ, ఆర్బీఐ వడ్డీని తగ్గిస్తే, ఆ ప్రయోజనాలను కస్టమర్లకు అందిస్తామని చెబుతూ వచ్చిన బ్యాంకుల ముందు ఇప్పుడు మరో ఆప్షన్ లేదు. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలపై కనీసం పావు శాతం వరకూ వడ్డీ రేట్లను తగ్గించే దిశగా బ్యాంకులు నిర్ణయాలను ప్రకటించాల్సి వుంది. కాగా, అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తామిచ్చే రుణాలపై వడ్డీ రేటును తగ్గించకుండా, ప్రజల పొదుపు సేవింగ్స్ ఖాతాలపై తాను ఇవ్వాల్సిన వడ్డీని భారీగా... అంటే ఏకంగా అరశాతం తగ్గిస్తూ గత వారంలో నిర్ణయం తీసుకుంది. దీనిపై బ్యాంకు ఖాతాదారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొనగా, రుణాలపై వడ్డీని తగ్గించడం ద్వారా వారిలోని అసంతృప్తిని తగ్గించాలని ఎస్బీఐ భావిస్తోంది. ఈ మేరకు నేడో, రేపో నిర్ణయం వెలువడవచ్చని సమాచారం. దేశ బ్యాంకింగ్ రంగానికి పెద్దన్నగా ఉన్న ఎస్బీఐ వడ్డీ రేట్లను తగ్గిస్తే, మిగతా అన్ని బ్యాంకులు కూడా అదే దారిలో నడవాల్సి వస్తుంది.

ఇన్ఫీలో మళ్లీ చెలరేగిన వివాదం

పనయా నివేదిక బహిర్గతం చేయాలన్న మూర్తి - కుదరదన్న బోర్డు



బెంగళూరు: మరోసారి సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ బోర్డు సభ్యులకు, దాని వ్యవస్థాపకులకు లుకలుకలు ప్రారంభమయ్యాయి. పనాయా కొనుగోలుకు సంబంధించిన విచారణ రిపోర్టును బహిర్గతం చేయాలంటూ ఎన్ఆర్ నారాయణమూర్తి ఇటీవల బోర్డు సభ్యులకు రాసిన లేఖతో మళ్లీ వివాదాలు చెలరేగాయని సంబంధిత వర్గాలు చెప్పాయి. 200 మిలియన్ డాలర్లతో కొనుగోలు చేసిన పనాయా విషయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని మార్కెట్ రెగ్యులేటరీ సెబీ ఆరోపించింది. సెబీ ఆరోపణలపైనా, మాజీ సీఎఫ్ఓ రాజీవ్ బన్సాల్ సెవరెన్స్ ప్యాకేజీ విషయంలో తలెత్తిన వివాదం విషయంలోనూ, ప్రస్తుత సీఈవో అత్యధికమైన వ్యయాల ఆరోపణల విషయంలోనూ కంపెనీ అంతర్గతంగా విచారణ చేపట్టింది. జూన్‌లోనే వీటిపై కంక్లూజిన్ అండ్ సమ్మరీ ఫైండింగ్ స్టేట్‌మెంట్‌ను ప్రచురించింది. పనాయా కేసు, సీఈఓ వ్యయాలు వంటి విషయంలో వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిర్ధారణ లేదని గిబ్సన్ డన్ అండ్ క్రుచర్ అనే న్యాయ సంస్థ కూడా పేర్కొంది. కానీ మొత్తం రిపోర్టులను బహిర్గతం చేయాలని నారాయణమూర్తి డిమాండ్ చేస్తున్నారు. కంపెనీ పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఈ రిపోర్టును అందించాలని ఆయన కోరుతున్నారని సంబంధిత వర్గాలు చెప్పాయి. అయితే ఈ రిపోర్టును ప్రజల ముందుకు తీసుకొచ్చేందుకు కంపెనీ ఏ మాత్రం అంగీకరించడం లేదు. ఈ రిపోర్టును బహిర్గతం చేస్తే, పనాయా ఇన్వెస్టర్లకు, దాని లిమిటెడ్ పార్టనర్లకు మధ్యనున్న క్లయింట్ రహస్యమైన ఒప్పందాలను ఉల్లంఘించినట్టు అవుతుందని కంపెనీ పేర్కొంటోంది. ఇప్పటివరకు ఇన్ఫోసిస్ కొనుగోలుచేసిన వాటిలో పనాయా అతిపెద్ద డీల్. దీంతో మరోసారి కార్పొరేట్ గవర్నెన్స్ విషయంలో ఇన్ఫోసిస్ బోర్డు సభ్యులకు, వ్యవస్థాపకులకు వివాదం తలెత్తినట్టు తెలిసింది.

కుమిన్స్ అమ్మకాల విలువ రూ. 1,388 కోట్లు



పుణె: జూన్‌తో ముగిసిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కుమిన్స్ ఇండియా రూ. 1,388 కోట్ల అమ్మాలను నమోదు చేసింది. గత సంవత్సరంతో పోలిస్తే, ఇది 5 శాతం అధికమని సంస్థ చైర్మన్ అనంత్ జె తలౌలికర్ వెల్లడించారు. సంస్థ దేశవాళీ అమ్మకాల్లో సైతం 10 శాతం వృద్ధి నమోదైందని, ఎగుమతులు మాత్రం గత సంవత్సరంతో పోలిస్తే 5 శాతం తగ్గాయని అన్నారు. పన్ను చెల్లింపులకు పూర్వం నికర లాభం రూ. 229 కోట్లు కాగా, గత సంవత్సరంతో పోలిస్తే 2 శాతం అధికమని అన్నారు.

ఎంఎస్ఎంఈలకు జీఎస్టీ శిక్షా హబ్



హైదరాబాద్: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ విభాగం టీసీఎస్ ఐయాన్, దేశంలోని చిన్న, మధ్యతరహా కంపెనీలకు జీఎస్టీపై అవగాహన కల్పించే దిశగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా లఘు ఉద్యోగ భారతితో ఒప్పందం కుదుర్చుకున్నామని ఎంఎస్ఎంఈలకు రియల్ టైమ్ సహాయ సహకారాలను అందించడమే తమ ఉద్దేశమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యాన్ని గురించి లఘు ఉద్యోగ భారతి జాతీయ అధ్యక్షుడు ఓం ప్రకాష్ మిట్టల్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క కంపెనీ జీఎస్టీకి అనుకూలమేనని, వారిలో ఉన్న అనుమానాలను తీర్చేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ శిక్షణ వారికి ఉపకరిస్తుందన్న నమ్మకం ఉందని తెలిపారు.

తెలంగాణలో మార్గ్ కేర్ సెంటర్

హైదరాబాద్: ఇంటిగ్రేటెడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సేవలందిస్తున్న మార్గ్ ఈఆర్‌పీ, తన సేవల విస్తరణలో భాగంగా తెలంగాణలో అధీకృత మార్గ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించింది. వస్తు సేవల పన్ను అమలు క్లిష్టతరమైన నేపథ్యంలో ఈ కేర్ సెంటర్ పరిశ్రమలకు, వ్యాపారులకు సహకరించనున్నదని మార్గ్ ఈఆర్‌పీ ఎండీ సుధీర్ సింగ్ వెల్లడించారు. క్లయింట్లకు సులభపూర్వక సేవలను దగ్గర చేయడమే లక్ష్యంగా ఈ సెంటర్‌ను ప్రారంభించినట్టు ఆయన అన్నారు. తమకు దేశవ్యాప్తంగా 7 లక్షలకు పైగా కస్టమర్లు ఉన్నారని, వారికి సేవలను అందిస్తామని తెలిపారు.

రిలయన్స్ జ్యుయెల్స్ 10వ వార్షికోత్సవ వేడుకలు



హైదరాబాద్: రిలయన్స్ జ్యుయెల్స్ 10వ వార్షికోత్సవ వేడుకలను సంస్థ ప్రకటించింది. ఈ సంవత్సరం షష్టిపూర్తి ఉత్సవాలు జరుపుకునే వారికి ప్రత్యేక ఆఫర్లను అందించనున్నామని తెలిపింది. తమకు ఆజన్మాంతం జీవిత భాగస్వామిగా ఉన్న వారికి మధురమైన కానుకలను అందించే అవకాశాన్ని కల్పించనున్నట్టు తెలిపింది. బంగారం ఆభరణాలపై 50 శాతం వరకూ, వజ్రాభరణాలపై 100 శాతం వరకూ తయారీ చార్జీలను తొలగించనున్నామని తెలిపింది. ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులను వాడితే అదనంగా 5 శాతం క్యాష్ బ్యాక్ సదుపాయం కల్పిస్తున్నట్టు సంస్థ సీఈఓ సునీల్ మాలిక్ వెల్లడించారు.

4 ఏళ్లలో 5 కోట్ల ట్రిప్‌లు: ఉబెర్



న్యూఢిల్లీ: ఇండియాలో క్యాబ్ సేవలందిస్తున్న ఉబెర్, సేవలు ప్రారంభించిన నాలుగేళ్లలో 5 కోట్ల ట్రిప్పులను పూర్తి చేసుకుంది. ఇండియాలో తాము రెండంకెల వృద్ధితో ముందుకు సాగుతున్నామని సంస్థ దక్షిణాసియా అధ్యక్షుడు అమిత్ జైన్ వెల్లడించారు. ఇండియాలో ఉబెర్‌కు ఇదో మైలురాయని, నాలుగేళ్లనాడు బెంగళూరులో ముగ్గురు ఉద్యోగులతో ప్రారంభమైన సంస్థ నేడు ఇండియాలో నంబర్‌వన్ క్యాబ్ సేవల సంస్థగా ఉందని, 1000 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రయాణికుల, డ్రైవర్ భాగస్వాముల జీవితాలను తీర్చిదిద్దుతున్నట్టు పేర్కొన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధం చేసే మ్యాడ్‌గై

హైదరాబాద్: వివిధ రకాల పోటీ పరీక్షలకు అభ్యర్థులను సిద్ధం చేసేలా పరిష్కారాలను అందించేందుకు మ్యాడ్ గై ల్యాబ్స్ కొత్త యాప్‌ను విడుదల చేసింది. రూర్కీ ఐఐటీ పూర్వ విద్యార్థులు అలోక్ కతియార్, సంజయ్ జగర్‌వాల్, విశాల్ మీనాల కలల ప్రాజెక్టుగా ఇది తయారైంది. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉద్యోగ పరీక్షలు రాసే ప్రతి ఒక్కరికీ సహాయంగా ఉండేలా దీన్ని తయారు చేసినట్టు మ్యాడ్‌గై ల్యాబ్స్ సహ వ్యవస్థాపకుడు అలోక్ వెల్లడించారు. అభ్యర్థులు పరీక్షలకు తయారవడంలో తగినంత సహాయ మెటీరియల్‌ను తాము అందించనున్నామని అన్నారు.

ఎల్ అండ్ టీకి భారీ ఆర్డర్: ఇంజనీరింగ్ మేజర్ లార్సన్ అండ్ టర్బో భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. విదేశీ ప్రభుత్వంనుంచి వేలకోట్ల విలువైన ప్రాజెక్టును సాధించింది. మారిషస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోని మెట్రోఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ నుంచి ఈ భారీ ఆఫర్ కొట్టేసింది. రెలు ఆధారిత పట్టణ రవాణా వ్యవస్థ రూపకల్పన,మరియు నిర్మాణానికిగాను రూ. 3,375 కోట్ల రూపాయల కాంట్రాక్టును గెలుచుకుంది. ఇది తమకు చాలా కీలకమైన ఆర్డర్‌ని ఎల్ అండ్ టీ బిఎస్ఇ ఫైలింగ్ లో తెలిపింది. ఆఫ్రికన్ ద్వీప దేశంలో సమీకృఎత లైట్ రెలు ఆధారిత రవాణా వ్యవస్థకు ప్రధాన పురోగతి ఈ ఒప్పందమని పేర్కొంది. 26 కిలోమీటర్ల మార్గం క్యూరీపైప్ తో పోర్ట్ లూయిస్లోని ఇమ్మిగ్రేషన్ స్క్వేర్ కు అనుసంధానిస్తుందని, 19 స్టేషన్లను కలిగి ఉంటుందని తెలిపింది.

విస్తరణ ప్రణాళికల్లో మోటరోలా



హైదరాబాద్: రిటైల్ వ్యాపారాన్ని బలోపేతం చేసుకునే లక్ష్యంలో భాగంగా, ఇండియాలో ప్రత్యేకమైన మోటరోలా స్టోర్స్ మోటో హబ్ ప్రారంభమైంది. వినియోగదారులకు మరింత కొనుగోలు అనుభూతిని ఇచ్చేలా ప్రయోగాత్మకంగా రిటెయిల్ స్టోర్లను ప్రారంభించామని సంస్థ ఎండీ సుధిన్ మాథుర్ వెల్లడించారు. ప్రారంభ ఆఫర్లలో భాగంగా మోటరోలా ఈ, సీ, జీ కొనుగోళ్లపై వివిధ రకాల యాక్సెసరీస్‌ను ఉచితంగా ఇవ్వనున్నామని, ఎంఓడీఎస్‌పై 50 శాతం తగ్గింపు లభిస్తుందని తెలిపారు. నోయిడాలోని మాల్స్‌తో పాటు ముంబైలోని మాల్స్‌లో ఈ స్టోర్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు.

గ్లోబల్ టాప్ 20లో స్కూళ్లలో స్థానం పొందని ఇండియా

న్యూఢిల్లీ: వివిధ అంతర్జాతీయ నివేదికల ప్రకారం అంతర్జాతీయ ప్రమాణాలను పాటించే గ్లోబల్ టాప్ 20 జాబితాలో భారతదేశానికి చెందిన ఒక్క విద్యా సంస్థ కూడా లేదని మానవ వనరుల శాఖ ప్రకటించింది. ఈ విషయాన్ని రాజ్యసభలో మానవ వనరుల శాఖ సహాయ మంత్రి మహేంద్ర నాథ్ పాండే లిఖిత పూర్వకంగా సమర్పించారు. దేశంలో ఉన్నత విద్యలో ప్రభుత్వం పాటిస్తున్న నాణ్యత గురించి సభలో అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. విద్యా నాణ్యతను పెంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన ప్రకటించారు. సాంకేతిక విద్యాభివృద్ధి మీద ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. అందుకు తగిన విధంగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారికి నియమావళి పంపించినట్లు ఆయన వివరించారు. అలాగే ఉన్నత విద్యలో సంస్కరణలు చేయడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కూడా మార్గదర్శకాలు జారీ చేసినట్లు మహేంద్ర నాథ్ పాండే తెలియజేశారు. ఇందుకోసం రూ. 300 కోట్లు కేటాయించిందని సహాయ మంత్రి పేర్కొన్నారు.

ఎయిర్‌టెల్‌లో టెలినార్ విలీనానికి అనుమతి


న్యూఢిల్లీ: ప్రముఖ టెలికాం కంపెనీ ఎయిర్‌టెల్‌లో టెలినార్ విలీనం అయ్యేందుకు మరో కీలక అడుగు పడింది. ఈ విలీన ప్రక్రియకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ నుంచి అనుమతి లభించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెండు కంపెనీలు తమ సంస్థల వాటాదారులు, రుణదాతలతో సమావేశం నిర్వహించాలని ట్రిబ్యునల్ ఆదేశించినట్లు తెలుస్తోంది. జూన్‌లో భారతి ఎయిర్‌టెల్ సెబీ, బీఎస్ఈ, ఎన్ఎస్ఈ, సీసీఐ వద్ద నుంచి అనుమతి పొందింది. టెలినార్ విలీనంతో ఎయిర్‌టెల్ 4జీ స్పెక్ట్రమ్‌కు మరింత వూతం లభించడంతోపాటు మార్కెట్‌లో సంస్థ వాటా కూడా పెరుగుతుందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఐటీ నిపుణుల కోసం టాస్క్, రెడ్ హ్యాట్ ప్లాన్స్



హైదరాబాద్: తెలంగాణలో నిపుణులైన ఐటీ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఓపెన్ సోర్స్ సొల్యూషన్స్ సేవలందిస్తున్న రెడ్ హ్యాట్ చేతులు కలిపాయి. ఇందులో భాగంగా ఇరు కంపెనీలూ కలిసి రెడ్ హ్యాట్ అకాడమీని ప్రారంభించాయి. ఇందులో శిక్షణ పొందిన వారికి శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్టు రెడ్ హ్యాట్ ఇండియా, సార్క్ దేశాల ఎండీ రాజేష్ రేగె తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం తమకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని ఆయన వెల్లడించారు. టాస్క్ సీఈఓ సుజీవ్ నాయర్ మాట్లాడుతూ, వచ్చే రెండేళ్లలో 1500 మందికి తాము శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు తెలిపారు.

సిగరెట్లపై అదనపు పన్నులను వెనక్కి తీసుకోవాల్సిందన్న ఫైఫా



హైదరాబాద్: సిగరెట్ల అమ్మకం విషయంలో రెవెన్యూ తటస్థతను పెంచాలని, అదనపు పన్నులను వెనక్కు తీసుకోకుంటే అక్రమ సిగరెట్లు పెరుగుతాయని, దాంతో పొగాకును నమ్ముకున్న రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఫైఫా పేర్కొంది. 2013 నుంచి రైతులు ఆదాయపరంగా రూ. 3 వేల కోట్లు నష్టపోయారని పేర్కొన్న ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ఫార్మర్స్ అసోసియేషన్, జీఎస్టీ కౌనిల్, 17, జులైన ప్రకటించిన కాంపెన్‌సేషన్ పన్ను రేట్లను సవరించాలని కోరింది. ఈ చర్యల ద్వారా వ్యవసాయ ధరలలో స్థిరత్వం రావడంతో పాటుగా రైతు ఆదాయం కూడా వృద్ధి చెందడం సాధ్యమవుతుందని, ఫైపా అధ్యక్షుడు జవార్ గౌద వెల్లడించారు. కౌన్సిల్ పన్ను రేట్లను సవరించడం ద్వారా నూతన పన్నువిధానంతో సిగిరెట్లపై విధించిన పన్ను లోపాన్ని పూరిస్తున్నట్లుగా కేంద్రం తెలిపిన విషయాన్ని గుర్తు చేసిన ఆయన, ఇది జీఎస్టీ వ్యవస్థకు మునుపు ఉనికిలో ఉన్న ఎక్సైజ్ డ్యూటీపై కాస్కేడింగ్ ప్రభావానికి కారణం కాదని అన్నారు. ఇదిలావుండగా కొన్ని కంపెనీలు, ముఖ్యంగా, ఫిలిప్ మోరిస్ వంటివి యువతను సిగరెట్లకు మరింత బానిసలను చేసేలా కొన్ని చోట్ల ఉచితంగా సిగరెట్లను అందించనున్నట్టు ప్రకటనలు గుప్పిస్తుండటం, మరికొన్ని ప్రాంతాల్లో వాటిని ఉచితంగా ఇస్తుండటంపై ఢిల్లీ చీఫ్ టుబాకో కంట్రోల్ ఆఫీసర్ ఎస్‌కే అరోరా తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

సిగరెట్ కంపెనీల నిర్వాకంతో మరింత మంది ధూమపానానికి అలవాటు పడుతున్నారని ఆరోపిస్తూ, ఆయన కఠిన చర్యలకు ఉద్రుక్తులవుతున్నారు. ఈ తరహా వ్యాపార ప్రకటనలకు, ఉచిత సిగరెట్లకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించినట్టు కేంద్రం వెల్లడించింది.

8 నెలల్లో పెట్టుబడిని ఏడు రెట్లకు పైగా పెంచిన సూపర్ స్టార్ కృష్ణ కంపెనీ



న్యూఢిల్లీ: ఈ కంపెనీల పేర్లు ఎవరికీ పెద్దగా పరిచయం ఉండదు. అసలు ఇవి స్టాక్ మార్కెట్లో లిస్టయిన సంగతి కూడా పెద్దగా గుర్తుండదు. వీటి ఈక్విటీ విలువ ఎంతైనా, మార్కెట్లో ధర రూ. 10 కన్నా తక్కువే. ఈ కంపెనీలు గత ఏడు నెలల కాలంలో తమను నమ్మి పెట్టుబడి పెట్టిన వారికి మాత్రం ఏడు రెట్లకు పైగా... ఇంకా చెప్పాలంటే 730 శాతం రాబడిని అందించాయి. ఉదాహరణకు పద్మాలయా టెలీఫిల్మ్స్ హైదరాబాద్ కేంద్రంగా చిత్ర, టెలివిజన్ సీరియల్స్ నిర్మాణ సంస్థ. సూపర్ స్టార్ కృష్ణ కుటుంబంలోని ఘట్టమనేని రమేష్ బాబు, దుర్గాంబ, పార్వతి, గల్లా జయదేవ్, కృష్ణా ప్రొడక్షన్స్ తదితరులు ప్రమోటర్లుగా ఉన్న సంస్థ. జనవరి 2న ఈ కంపెనీ ఈక్విటీ ధర రూ. 1.20 మాత్రమే. అదే ఆగస్టు 2కు వచ్చేవరకు రూ. 9.96కు పెరిగి 730 శాతం లాభాన్ని అందించింది. అంటే, జనవరి తొలి వారంలో ఈ కంపెనీలో రూ. 10 వేలు పెట్టి వుంటే, ఇప్పుడు దాని విలువ రూ. 83 వేల రూపాయలన్నట్టు. ఇక మరో సంస్థ ఈస్ట్రన్ సిల్క్ ఇండస్ట్రీస్... దీని ఈక్విటీ విలువ సంవత్సరం ఆరంభంలో రూ. 2.38 కాగా, ఇప్పుడది రూ. 7.96కు పెరిగి 234 శాతం లాభాన్ని అందించింది. అలాగే సాన్వారియా ఆగ్రో ఈక్విటీ రూ. 2.55 నుంచి రూ. 7.36కు పెరిగి 190 శాతం లాభాలను అందించింది. వీటితో పాటు పారామౌంట్ కమ్యూనికేషన్స్, ఎస్ఏఎల్ స్టీల్, రతన్ ఇండియా ఇన్ ఫ్రా, టెక్ నిర్మాణ్, తజారియా పాలీ పైప్స్ వంటి కంపెనీలు కూడా మార్కెట్ లాభాలను మించి సత్తా చాటాయి.

భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై: స్టాక్ మార్కెట్లు ఇవాళ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఆసియా మార్కెట్లు ప్రతికూల ప్రభావం చూపడంతో దేశీయ సూచీలు నష్టాలను చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 239 పాయింట్లు పతనమై 32,238కు పడిపోయింది. నిఫ్టీ 68 పాయింట్లు నష్టపోయి 10,014కు జారుకుంది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో గురువారం నాటి టాప్ గెయినర్స్‌లో ఫోర్టిస్ హెల్త్ కేర్ (6.99%), బాటా ఇండియా (6.61%), ఎడిల్‌వీస్ ఫిన్ సర్వ్ (5.17%), వీడియోకాన్ (4.87%), గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (4.84%) తదితర కంపెనీలుండగా, టాప్ లూజర్స్... జిందాల్ స్టీల్ అండ్ పవర్ (-10.09%), యూనిటెక్ (-8.88%), రిలయన్స్ కమ్యూనికేషన్స్ (-7.78%), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (-5.98%), కమిన్స్ ఇండియా లిమిటెడ్ (-5.33%) తదితర కంపెనీలు నష్టపోయాయి.

పార్టీలో క్రమశిక్షణ అవసరం

మాకు పనుల్లేవా అంటూ చంద్రబాబు సీరియస్

వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ నూతన సచివాలయంలో గురువారం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నంద్యాల ఉపఎన్నికలు, జన్మభూమి కమిటీల ప్రక్షాళనతో సహా పలు విషయాలపై నిశితంగా చర్చించి.. కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. అయితే ఈ సమావేశానికి కొందరు టీడీపీ జిల్లా అధ్యక్షులు రాకపోవడంతో సీఎం బాబు సీరియస్ అయ్యారు. సమావేశానికి రాకుండా తమకు పనులున్నాయని కొందరు నేతలు సాకులు చెబుతున్నారని, అందరికీ పనులుంటాయని, పనులేమీ లేకుండా కూర్చుంది మేమేనా, మాకు పనుల్లేవా అంటూ చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ఉన్న అందరికీ క్రమశిక్షణ అవసరమని సీఎం మరోసారి గట్టిగా క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది. ఇందుకు స్పందించిన జిల్లా అధ్యక్షులు ఇక ముందు జరిగే ప్రతి సమావేశానికి తప్పకుండా హాజరవుతామని సీఎంకు చెప్పి మొరపెట్టుకున్నట్లు సమాచారం. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు నంద్యాల ఉపఎన్నికలో టీడీపీ గెలుపు ఖాయమైందని తెలిపారు. నంద్యాలలో భారీ మెజారిటీపై దృష్టిసారించాలని ఆయన పేర్కొన్నారు. జన్మభూమి కమిటీలను ప్రక్షాళన చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఈనెలాఖరులోగా జన్మభూమి కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. బెల్ట్ దుకాణాల రద్దుపై 95 శాతం మంది సంతృప్తితో ఉన్నారని, బెల్ట్ దుకాణాల రద్దుపై వంద శాతం సంతృప్తి చెందాలన్నారు. ఇసుకపై ప్రజలు ఇంకా అసంతృప్తిగా ఉన్నారని చంద్రబాబు చెప్పారు. ఇసుక విధానంపై 48 శాతం మాత్రమే బాగుందన్నారని, ఇసుక విధానంపై 52 శాతం బాగాలేదన్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇసుక విధానంలో మార్పులు చాలా అవసరమని, ఇసుకపై జిల్లాకు నలుగురు సభ్యులతో కమిటీ వేశామని, కమిటీ నివేదిక ఆధారంగా మార్పులు చేర్పులు చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అన్న అమృతహస్తంపై సర్వే వివరాలను చంద్రబాబు వెల్లడించారు. 67 శాతంమంది సరకులిస్తే ఇంటికెళ్లి వండుకుంటామన్నారని, ఒకచోటకు వెళ్లి తినాలంటే ఇబ్బందని గర్భిణీలు చెబుతున్నారని, అన్న అమృతహస్తంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సీఎం వివరించారు. ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని, కిడ్నీ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకుందామని సీఎం అన్నారు. కాపు రిజర్వేషన్లపై త్వరలోనే నివేదిక వస్తుందని చంద్రబాబు చెప్పారు.

100 గజాలలోపు ఉచిత క్రమబద్ధీకరణ



చంద్రబాబు అధ్యక్షతన భేటీ అయిన ఈ మంత్రివర్గ భేటీలో ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లింపు, ఇసుక ధరల నియంత్రణ సహా పలు కీలక అంశాలపై చర్చించారు. అలాగే పలు జిల్లాల్లో ఏపీఐఐసీకి భూకేటాయింపులు, ఒంగోలులో అవినీతి నిరోధక శాఖ కార్యాలయానికి భూకేటాయింపులతోపాటు ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరణ చేసే అంశాలపైనా చర్చించారు. అలాగే రాజధానిలో వీఐపీలకు గృహ నిర్మాణంపై కూడా చర్చించారు.

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు : గురువారం మంత్రి మండలి సమావేశంలో అజెండాలో వున్న అన్ని అంశాలపైచర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. వీటితో పాటు మరికొన్ని ఇతర ముఖ్య అంశాల గురించి సమీక్షించారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణ : అభ్యంతరాలు లేని ఆక్రమణలను క్రమబద్ధీకరించాలని మంత్రిమండలి నిర్ణయించింది. మంత్రుల బృందం సిఫారసుల ఆధారంగా రాష్ట్రంలో ఆక్రమణ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న బీపీఎల్, ఏపీఎల్ కుటుంబాల వారి ఇళ్ల క్రమబద్ధీకరిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది. అభ్యంతరాలు లేని ఆక్రమణల క్రమబద్ధీకరణతోపాటు 100 చదరపుగజాలు బీపీఎల్ కుటుంబాలకు ఉచితంగా, ఏ పీ ఎ ల్ కుటుంబాలకు 1-100 చదరపుగజాల వరకు 7.5శాతం , 101-250 చదరపు గజాలవరకు 15శాతం 500 చదరపు గజాలవరకు 30శాతం, 500 గజాలు మించితే ఆక్రమణ తొలగింపు, 2013 సంవత్సరంలో ఉన్న బేసిక్ రేట్ ఆధారంగా క్రమబద్ధీకరిస్తారు. టెలిస్కోపిక్ మెథడ్‌లో క్రమబద్ధీకరణ చేస్తారు.

పత్తికి బదులు ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు : తేలికపాటి భూముల్లో పత్తికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే రైతాంగానికి రూ.53.5 కోట్ల స్పెషల్ ప్యాకేజికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్రత్యామ్నాయ వేసే పంటల విత్తనాలకు 75 శాతం సబ్సిడీ ఇస్తారు. కలుపు తీయడానికి హెక్టారుకు రూ.500 రాయితీ ఇస్తారు. పంటలను రక్షించుకునేందుకు వేసే స్ప్రే నిమిత్తం హెక్టారుకు రూ.500 చొప్పున రెండుసార్లు రాయితీ ఇస్తారు. పత్తికి బదులుగా పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే వారికి కనీస మద్ధతుధరగా క్వింటాలుకు రూ.200 బోనస్ అందిస్తారు.

బైరెటీస్ విక్రయాల నూతన విధానం : శాస్త్రీయ విధానంలో విక్రయ ధరను నిర్ణయించేలా ఏపీఎండీసీ రూపొందించిన బైరెటీస్ నూతన సమగ్ర విక్రయ విధానాన్ని ఆమోదిస్తూ మంత్రిమండలి నిర్ణయించింది. ఈ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న అత్యుత్తమ పద్ధతులను పరిశీలించి ఈ కొత్త విధానాన్ని తీసుకువచ్చారు. 2014లో జరిగిన మొదటి విడత ఎర్ర చందనం వేలంలో ఇ టెండర్, ఇ ఆక్షన్ ద్వారా పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ సంస్థ కొనుగోలు చేసిన సరుకును తీసుకువెళ్లేందుకు కాలవ్యవధిని పొడిగిస్తూ మంత్రిమండలి నిర్ణయం. దీనికి పెనాల్టీని మినహాయించారు. భూమి అద్దెను వసూలు చేయాల్సి ఉంటుంది.

ఏపీ హెచ్‌ఆర్డీఐ పోస్టులు : తిరుపతిలోని ఏపీ హెచ్‌ఆర్‌డీఐ రీజనల్ సెంటర్ పరిధిలోని శ్రీకాళహస్తి ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ కోసం కొత్తగా 6 పోస్టులను మంజూరు చేస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నారు. టీచింగ్ పోస్టుల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాలలో మత్స్యకారుల కుటుంబాల్లోని చిన్నారుల కోసం కొత్తగా ఏర్పాటుచేసిన బీసీ గురుకుల పాఠశాలల్లో 13 టీచింగ్ పోస్టులను మంజూరు చేస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. సబ్ ట్రెజరీ ఆఫీసుల స్థాయి పెంచారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 10 రెవిన్యూ డివిజన్లలో ఉన్న సబ్ ట్రెజరీ ఆఫీసులను అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఏపీ ల్యాండ్ అక్విజిషన్, రీహ్యాబిటేషన్ అండ్ రీసెటిల్మెంట్ అథారిటీ పోస్టుల్లో విశాఖ, తిరుపతి, విజయవాడలలోని ఆంధ్రప్రదేశ్ భూసేకరణ, పునరావాసం, రీసెటిల్‌మెంట్ అథారిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ కార్యాలయాలలో ఒక్కొక్క యూనిట్‌లో 13 పోస్టుల చొప్పున 39 పోస్టుల మంజూరును ర్యాటిఫై చేస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

గుంతకల్లు మునిసిపాలిటీ : గుంతకల్లు మునిసిపాలిటీ చేపట్టిన 3800 ఎంఎల్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి పని పెరిగి పెద్దమొత్తంలో ఇసుక అవసరమై ఖర్చు పెరిగినందున, మెస్సర్స్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స (ఇండియా) లిమిటెడ్ సంస్థకు 2007-08 ఎస్ఎస్ఆర్ రేటుకు బదులు 2008-09 ఎస్ఎస్ఆర్ రేటును అనుమతించాలని గుంటూరు పబ్లిక్ హెల్త్ ఛీఫ్ ఇంజనీర్ చేసిన సిఫారసులను ఆమోదిస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

తిరుపతి సైన్స్ మ్యూజియం : కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న సైన్స్ మ్యూజియం కోసం టీటీడీకి చెందిన సర్వే నెంబర్ 589లోని 19.15 ఎకరాలు, సర్వే నెంబర్ 588/లోని 50.96 ఎకరాల భూమిని టీటీడీ నిబంధనలు, షరతుల మేరకు లీజుకు ఇవ్వాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

స్టాంప్ డ్యూటీ మినహాయింపు : శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం పైడిభీమవరం ఐడీఏలోని మెస్సర్స్ అనూస్ ల్యాబోరేటరీ లిమిటెడ్‌ను కొనుగోలు చేసిన హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన ఆంధ్ర ఆర్గానిక్స్ లిమిటెడ్‌కు రూ.1,22,45,360 మేర ఉన్న స్టాంప్ డ్యూటీ బకాయికి మినహాయింపు ఇస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు ముందుకొచ్చిన విజయవాడ మౌంట్ డియోస్ ఎడ్యుకేషనల్ సొసైటీకి, సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంతో జరిగే లీజు డీడ్ నిమిత్తం రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇవ్వాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

జల వనరులశాఖ : ఆంధ్రప్రదేశ్ ఫార్మర్స్ మేనేజ్మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ (ఏపీఎఫ్ఎంఐఎస్) చట్టం, 1997కు తెచ్చిన అమెండ్‌మెంట్ ఆర్డినెన్స్, 2017 స్థానంలో బిల్లు ప్రవేశపెట్టడానికి మంత్రిమండలి ఆమోదం. వాటర్ యూజర్స్ అసోసియేషన్లను బలోపేతం చేయడమే ఈ బిల్లు ఉద్దేశం.

భూకేటాయింపులు ఇలా : విశాఖ జిల్లా రాంబిల్లి మండలం వూడి గ్రామంలోని 248,266, 293 సర్వే నెంబర్ల భూమిలో 21.89 ఎకరాలను సెజ్ విస్తరణకు గాను ఏపీఐఐసీకి ఉచితంగా బదలాయించాలన్న ప్రతిపాదనను మంత్రి వర్గం ఆమోదించింది. విశాఖ జిల్లా పద్మనాభం మండలం పెంట గ్రామంలో సర్వే నెంబర్ 201లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకోసం ఏపీఐఐసీకి ఉచితంగా 200 ఎకరాల భూమిని బదలాయించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. జీవో ఎంఎస్ (16.3.2017) నెంబర్ 106 ప్రకారం కొన్ని షరతులతో ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించారు. కృష్ణా జిల్లా జి.కొండూరు మండలం జి. కొండూరు గ్రామంలో గా పరిగణిస్తున్న 47/లోని 43.50 ఎకరాల భూమిని ఏపీఐఐసికి షరతులతో ఉచితంగా బదలాయిస్తూ రాష్ట్రమంత్రి మండలి నిర్ణయించింది. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం మామిడిపాలెం గ్రామంలోని సర్వే నెంబర్ 82/1 లో ఏసీబీ కార్యాలయ భవన నిర్మాణానికి 14 సెంట్ల భూమి కేటాయిస్తూ రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కృష్ణా జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో ఆర్.ఎస్ నెంబర్ 273/1, 273/2, 275 లలో 10 ఎకరాల భూమి ఇండస్ట్రియల్ పార్కు కోసం ఏపీఐఐసీకి ఉచితంగా కేటాయించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. కృష్ణా జిల్లా చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామం ఆర్.ఎస్ నెంబర్ 286/350/1 లో కొండ పోరంబోకును గా వర్గీకరించిన 50 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఏపీఐఐసీకి ఉచితంగా కేటాయించారు. ప్రకాశం జిల్లా సి.ఎస్ పురం మండలం కోవిలంపాడు సర్వే నెంబర్ 131/3లో 5 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీకి షరతులతో ఉచితంగా బదలాయించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం టౌన్ ఆర్.ఎస్ నెంబర్ 395లో 41 సెంట్ల భూమి ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ భవన నిర్మాణానికి షరతులతో ఉచితంగా బదలాయించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం పెళ్లూరు గ్రామంలో సర్వే నెం.69, 74, 75/4లో గిరిజనభవన్, ఏటీడబ్ల్యుఓ ఆఫీసు/గోదాము నిర్మాణానికి 50 సెంట్ల భూమి ముందస్తు స్వాధీనానికి కలెక్టరుకు అనుమతిస్తూ మంత్రిమండలి తీర్మానించింది. ప్రకాశం జిల్లా దర్శి మండలం, దర్శి గ్రామంలో సర్వే నెం. 331/2 లో 1.03 ఎకరాలు (సర్వే నెం. 331/2లో 50 సెంట్లు, సర్వే.నెం 331/2లో 53 సెంట్లు) పి.డబ్ల్యు.డి పోరంబోకు భూమి సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కార్యాలయ భవన నిర్మాణానికి బదలాయించారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నాయుడుపేట మండలం ఎల్.ఎ సాగరం గ్రామంలో కంప్యూటర్ ట్రెయినింగ్ సెంటర్ నెలకొల్పుకునేందుకు నెలవల రాజేష్ అనే యువకునికి 15 సెంట్ల భూమి కేటాయింపు. చ.గజానికి రూ.1000 వంతున ఖరీదుగట్టి కొన్ని షరతులతో ఈ భూమిని కేటాయిస్తూ మంత్రిమండలి నిర్ణయించింది. చిత్తూరు జిల్లా చిత్తూరు మండలం వెంకటాపురం గ్రామం సర్వే నెం.423లో 98.37 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్కు కోసం ఏపీఐఐసీకి బదలాయించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది.

పసుపు బోర్డును ఏర్పాటు చేయండి

ప్రధానిని కోరిన ఎంపీ కవిత బృందం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో టీఆర్ఎస్ ఎంపీలు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసి వినతి చేశారు. న్యూఢిల్లీలో గురువారంనాడు ఉదయం ప్రధాని మోడీని కలిశారు. నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటుకు పలు రాష్ట్రాలు ఆమోదం తెలిపిన విషయాన్ని సైతం కవిత ప్రధానికి వివరించారు. పసుపు బోర్డు ఏర్పాటు ప్రధానిని కోరారు. పది నెలల పాటు సాగు చేసే పసుపు పంటలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని మోడీకి ఎంపీ కవిత వివరించారు. విత్తనాల దగ్గర నుంచి దిగుబడి, మద్దతు ధర వరకు వారికి ఏ సహాయం లేదని తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే తప్ప ప్రీ-హార్వెస్టింగ్, పోస్ట్ హార్వెస్టింగ్ సహాయం అందేలా లేదని స్పష్టం చేశారు. దేశంలో 13 రాష్ట్రాల్లో పసుపు సాగవుతున్నందని, పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే మేలు జరుగుతుందన్నారు. సాగు, ప్రాసెసింగ్, మద్ధతు ధర విషయాల్లో పసుపు బోర్డు ఉంటే రైతులకు మేలు జరుగుతుందని.. పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేసినా తమకు అభ్యంతరం లేదని కవిత ప్రధాని మోడీని కోరారు. అనంతరం మీడియాతో కవిత మాట్లాడుతూ పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రధాని సానుకూలంగా స్పందించారని తెలిపారు. జీఎస్టీ నుంచి బీడీలను మినహాయించాలని ప్రధానిని కోరామన్నారు. బీడీ పరిశ్రమపై జీఎస్టీ ప్రభావంతో మహిళలు ఉపాధి కోల్పోతారని ఆమె వివరించానన్నారు.గల్ఫ్ బాధితుల సమస్యలపై శుక్రవారంనాడు విదేశాంగ మంత్రిని కలుస్తానని ఆమె తెలిపారు.

వెంకయ్యను కలిసిన తెలుగు రాష్ట్రాల ఎంపీలు : ఎన్డీయే ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలుగురువారంనాడు భేటీ అయ్యారు. టీడీపీ, టీఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్, ఎంపీలు ఢిల్లీలోని వెంకయ్య నివాసంలో ఆయన్ని కలిసి అభినందనలు తెలిపి సత్కరించారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక ఆగస్టు 5న జరగనుంది. రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు మూడు పార్టీలు పూర్తిస్థాయి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లోనూ మూడు పార్టీలు ఎన్డీయే అభ్యర్థికి పూర్తి మద్దతు ప్రకటించాయి.

ప్రఖ్యాత టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోసియల్ సైన్సెస్‌లో ఏపీకి 6సీట్లు

మంత్రిగంటా శ్రీనివాసరావు

అమరావతి,సూర్యప్రతినిధి:సామాజిక,ఆర్థిక, మానవ అభివృద్ధి రంగాల్లో ప్రఖ్యాతి పొందిన టాటా ఇన్‌స్టిట్యూట్ ఆప్ సోషియల్ సైన్సెస్ లో రాష్ట్రానికి 6 సీట్లు అభించనున్నాయి.ఏపీ ప్రభుత్వం స్పాన్సర్ చేసే ఈబిఏ కోర్సు సీట్లకు విధి విధానాలు ఖరారు చేసి ఈఏడాది నుంచే ఏపికి కేటాయింయనున్నారు. ప్రస్తుతం 60 సీట్లతో నడుస్తున్న హైదరాబాద్ క్యాంపస్ లో మరో 6 సూపర్ న్యూమెరరీ సీట్లను సృష్టిస్తూ టిస ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సమక్షంలో టిస్ డైరెక్టర్ ఎస్ పరుశురామ్ ఏపి సాంఏతిక,కళాశాల,కళాశాల విద్యా కమిషనర్ పాండాదాస్ ఎంఓయూ పై సంతకాలు చేశారు. 1936లో ప్రారంభమైన టిస్ దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థలలో ఒక్కటిగా పేరుపొందింది. టిఎస్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఫౌండేషన్ కోర్సులు, సూపర్ న్యూమెరరీ సీట్లు అంశంపై టిఎస్ డైరెక్టర్ ఎస్ పరుశురాం,డిప్యూటీ డైరెక్టర్ శివరాజు,ప్రొఫెసర్ లక్ష్మీ లింగంతో చర్చించారు. ఏపీ ప్రభుత్వానికి ఇకనుంచి తాము 6 సీట్లు కేటాయిస్తామని టిఎస్ అధికారులు మంత్రికి స్పష్టం చేశారు.

మావంతు సహకారం అందిస్తాం

ఏపీ అధికార ప్రతినిధి కోమటి జయరాం

గుంటూరు,సూర్యప్రతినిధి: ప్రభుత్వాలు డిజిటలైజేషన్‌కు అధిక ప్రాధాన్యమిస్తున్నా యని, ఎన్ఆర్ఐలుగా తమ వంతు సహకారం అందిస్తామని అమెరికాలో ఏపీ ప్రభుత్వ అధికార ప్రతినిధి కోమటి జయరాం అన్నారు. గురువారం కిట్స్ కాలేజీలో నిర్వహించిన డిజిటలైజేషన్‌పై అవగాహన సదస్సులో కోమటి జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ డిజిటల్ ఇండియాలో కిట్స్ భాగస్వామ్యం సంతోషకరమన్నారు. విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని కోమటి జయరాం తెలిపారు. ఈ కార్యక్రమంలో కోమటి జయరాంతో పాటు ఎన్ఆర్ఐ జేపీ ప్రసాద్, కిట్స్ చైర్మన్ సుబ్బారావు పాల్గొన్నారు. డిజిటలైజేషన్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుపతి,సూర్యప్రతినిధి: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. 22 కంపార్టుమెంట్లలో భక్తులు వేచివున్నట్లు అధికారులు తెలిపారు. సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతుందని అధికారులు వెల్లడించారు. నడకదారి భక్తుల దర్శనానికి 3 గంటల సమయం పడుతుందని వివరించారు. సాయంత్రం 6గంటల వరకు 50,376 మంది భక్తులు శ్రీవారినిదర్శించుకున్నట్లు తెలిపారు. గురువారం శ్రీవారి హుండీ ఆదాయం రూ 3.31 కోట్లని అధికారులు తెలిపారు.

నేడు డయల్ టీటీడీ ఈవో కార్యక్రమం

తిరుమల,సూర్యప్రతినిధి: తిరుమలలో శుక్రవారం డయల్ టీటీడీ ఈవో కార్యక్రమం జరగనుంది. అన్నమయ్య భవన సమావేశ మందిరంలో ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య దేవస్థానం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఫోన్‌లో సమాధానాలు ఇవ్వనున్నారు. భక్తులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు సూచనలు ఇవ్వడానికి ఈవోతో మాట్లాడే అవకాశం ఉంటుంది. 0877- 2263261 ద్వారా ఫోన్ చేయొచ్చు. అలాగే శుక్రవారం ఉదయం 10 గంటలకు నవంబరు కోటాకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లను టీటీడీ విడుదల చేయనుంది. కొన్నింటిని ఆన్‌లైన్‌లో వెంటనే కొనుగోలు చేసే అవకాశం ఉండగా విశేషమైన సేవా టిక్కెట్లను మాత్రం ఎలక్ట్రానిక్ లాటరీ ద్వారా కేటాయిస్తుంది. ఇందుకోసం నమోదు అవకాశం టీటీడీ కల్పిస్తుంది.

మీరు కన్యా? కాదా?

వివాదాస్పదమవుతున్న ఉద్యోగ దరఖాస్తు కాలమ్

పాట్నా : ఇందిరా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజీఐఎంఎస్)లో ఉద్యోగంలో చేరేందుకు చేసే దరఖాస్తులో ఒక కాలమ్ వివాదం రేపుతోంది. బీహార్ రాజధాని పాట్నాలోని షేక్ పురాలో గల ఐజీఐఎంఎస్‌లో ఉద్యోగావకాశ ప్రకటన వెలువడింది. దీని దరఖాస్తు ఫారంలో 'వివాహ స్థితి' అనే కాలమ్‌లో 'నేను బ్రహ్మచారి/వితంతువు/కన్య' అని ఉంది. అలాగే 'నాకు ప్రస్తుతం జీవించి ఉన్న ఒకే భార్య ఉంది, నాకు పెళ్లైంది, ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యలు ఉన్నారు' అనే మరో కాలం కూడా ఉంది, ఇక మహిళలైతే 'నేను పెళ్లి చేసుకున్న అతనికి జీవించి ఉన్న మరో భార్య లేదు, నేను పెళ్లి చేసుకున్న అతనికి జీవించి ఉన్న మరో భార్య కూడా ఉంది' వంటి వింత ఆప్షన్‌లతో కూడిన కాలమ్‌లు ఉన్నాయి.





చంద్రబాబును కాల్చి చంపండి

కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కేబినెట్ మొత్తం కూడా నడి నంద్యాలలో ఉందన్నారు. చంద్రబాబు ఎంపీలు, పెద్ద పెద్ద నాయకులు ఇక్కడే తిష్ట వేశారని, చివరకు చంద్రబాబు, ఆయన కొడుకు నంద్యాల రోడ్ల మీద తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. నంద్యాల ఉప ఎన్నిక సమరం నేపథ్యంలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎస్పీజీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ ప్రచార సభలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడారు. అబద్ధాలు చెబుతూ మోసపూరిత జీవోలు ఇస్తూ అబద్ధపు వాగ్దానాలు చంద్రబాబు నాయుడు చేస్తున్నారు. కారణం ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోటీలోకి అభ్యర్థిని దింపింది కాబట్టి ఇలా చేస్తున్నారు. కుట్రలు, కుయుక్తులు ఎక్కువయ్యాయి. మనం పోటీలో ఉన్నాం కాబట్టే ఇవాళ చంద్రబాబు వారి కేబినెట్, ఆయన కొడుకు నడి రోడ్డుపై కనిపిస్తున్నారు. "ఒక వేళ మనం (వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ) నంద్యాల ఎన్నిక ఏకగ్రీవం అని ఉంటే చంద్రబాబు నంద్యాలకు ఒక్క రూపాయి అయినా విదిల్చేవాడా నంద్యాలకు ఒక్క పథకం ఇచ్చేవాడా? ఇంతమంది మంత్రులు నంద్యాల నడిరోడ్డుపై కనిపించేవారా? అందరికీ తెలుసు ఇవన్నీ కూడా ఎందుకు జరుగుతున్నాయో? నంద్యాల ప్రజలకే కాదు.. ఈ జిల్లాలో ఉన్న పక్క నియోజకవర్గాల ప్రజలకు తెలుసు? ఎవరు అమ్ముడుపోయారో వారి నియోజవర్గ ప్రజలకు కూడా తెలుసు. ఉప ఎన్నికల్లో ఎప్పుడు వైఎస్ఆర్‌సీపీ పోటీ పెడితే అప్పుడు చంద్రబాబు నిద్రలేస్తారు, మూడున్నర సంవత్సరాలుగా చంద్రబాబు చేసిన మోసాలపై, కుట్రలు, అవినీతి, అసమర్థ పాలనపై ప్రజలు ఇచ్చే తీర్పుగా ఈ ఎన్నికలు జరగబోతున్నాయి. చంద్రబాబు దోచుకున్న మూడున్నర లక్షలకోట్లలో కొంత డబ్బు వెదజల్లి పోలీసులను నమ్ముకొని, అధికారాన్ని నమ్ముకొని అధికారం దుర్వినయోగం చేస్తూ మనుషుల్ని కొనుగోలు చేస్తూ చంద్రబాబు చేస్తున్న పాలన మీద చేస్తున్న యుద్ధం ఈ ఉపఎన్నికలు, ఏ మతాన్ని చూసుకున్నా భగవద్గీత, బైబిల్, ఖురాన్ చదివినా అవి చెప్పేది ఒకటే. ధర్మం న్యాయం గొప్పవని చెబుతాయి. ఖురాన్ తెలిపే మహ్మద్ ప్రవక్త గురించి మీకు ఓ కథ చెబుతున్నాను. మహ్మద్ ప్రవక్తను హత్య చేసేందుకు కుట్ర దారులంతా కూడా ఒక చోట ఏకమవుతారు. సత్య సందేశాన్ని సహించలేని వీరంతా దారుల్ నాదువాలో సమావేశం అయ్యి హత్య గురించి చర్చిస్తారు. అక్కడ రెండు మూడు ప్రతిపాదనలు పెడతారు. చివరగా అబూ జహన్ అనే కుట్రదారుడు చేసిన ప్రతిపాదన అందరికీ నచ్చుతుంది, అదేమిటంటే అన్ని తెగల నుంచి పలుకుబడి ఉన్న కుటుంబాల్లోని యువకులను ఎంపిక చేసి వారికి కత్తులు ఇచ్చి వారంతా కూడా మహ్మద్ ప్రవక్త మీద దాడి చేస్తే నేరం అందరిపై పడుతుంది. అలా జరిగితే అందరిపై పోరాడలేరు. పరిహారం ఇవ్వాలని మాత్రమే అడుగుతారు. అని చెప్పగా ఇది అందరికి నచ్చుతుంది. దీంతో అలాగే యువకులను ఎంపిక చేసి మహ్మద్ ప్రవక్తను హత్య చేసేందుకు ప్రవక్త ఇంటిని చుట్టు ముడతారు. ఆ విషయం జబ్రీల్ అనే దైవదూత ద్వారా తెలుసుకొని చిరునవ్వు నవ్వుతూ ఇసుక తీసుకొని హత్య చేసేందుకు వచ్చినవారి తలలపై జల్లుతూ నవ్వుతూ వెళ్లిపోతారు. ఆ సమయంలో వారు ఏం చేయలేక తలలు వంచుతారు. దీనర్థం ఏమిటంటే దొంగదెబ్బతీసేవారు వెన్నుపోటు పొడిచేవారు ధర్మం ముందు తల వంచాల్సిందే. ఇదే విషయాన్ని ఖురాన్ చెబుతోంది, అబాండాలతో తాత్కాలిక విజయం రావొచ్చు కానీ, సత్యవంతులదే విజయం అని ఖురాన్ అని చెబుతుంది. అన్ని మతాలు కూడా ఇదే చెబుతాయి. ఏ మతమైనా తప్పును తప్పంటుంది దొంగను దొంగేనని, మోసాన్ని మోసమేనని చెబుతుంది. సీతమ్మను దొంగతనంగా ఎత్తుకుపోయిన రావణుడిని రాక్షసుడు అంటాం, మన పొలంపంటను, మన ఆస్తిని ఎత్తుకుపోయినవారిని దొంగ అంటాం. మన పిల్లల్ని ఎత్తుకొని పోయేవాడిని బూచాడని అంటాం. మరీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో గెలిచి వేరే పార్టీలోకి వెళ్లిన వారిని ఏమనాలి? వారిని ఎత్తుకుపోయిన చంద్రబాబునాయుడిని ఏమనాలి? దొంగ అంటామా సీఎం అంటామా.. ఇది దొంగల పాలన అంటామా ప్రజల పాలన అంటామా? సొంతమామనే వెన్నుపోటు పొడిచి ఆయన కష్టం ఆయన పదవి, ఆయన పార్టీ గుర్తును లాగేసుకున్న వ్యక్తిని ఏమంటాంఞ? మిగితా పార్టీల్లో చిచ్చుపెట్టే వ్యక్తిని ఏమంటాం? ప్రజలను వెన్నుపోటు పొడిచే వ్యక్తిని ఏమంటాం? అప్పట్లో చంద్రబాబును ఉదహరిస్తూ నాన్నగారు వైఎస్ఆర్ ఓ కథ చెప్పేవారు. అనగనగా ఓ ముద్దాయి ఉండేవాడు. అతడు కోర్టుబోనులో ఉన్నాడు. జడ్జి రాగానే బోరున ఏడ్వడం మొదులపెట్టాడు. తల్లిదండ్రి లేని ఆనాథను వదిలేయండి అన్నాడు మరింత బిగ్గరగా ఏడ్వడం మొదలుపెట్టాడు. జడ్జికి బాధ కలిగి లాయర్లను అతడు చేసిన నేరం ఏమిటని అడగ్గా.. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ఏమన్నారో తెలుసా తల్లితండ్రిని చంపిన వ్యక్తి అని చెప్తాడు. ఇది చంద్రబాబు నైజం. చంద్రబాబే తన మామ ఎన్టీఆర్‌ను చంపి ఆయనే ఫొటోలు తెచ్చి ఎన్నికలకు వెళతాడు. మొన్నటి వరకు మైనార్టీలను దెబ్బ కొట్టాడు. ఎన్నికలు రాగానే మళ్లీ అదే మైనార్టీలపై లేని ప్రేమను చూపిస్తున్నాడు. రైతులను, డ్వాక్రా అక్కా చెల్లెమ్మలనున మోసం చేశాడు

నంద్యాలను మోడ్రన్ టౌన్ గా తీర్చిదిద్దుతాం

ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే నంద్యాలను మోడ్రన్ టౌన్ గా తీర్చిదిద్దుతామని వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే 13 జిల్లాల ఏపీనీ 25 జిల్లాల రాష్ట్రంగా మారుస్తామని, నంద్యాలను జిల్లాగా చేస్తామని, ఆ జిల్లాకు హెడ్ క్వార్టర్ గా నంద్యాలనే ఉంచుతామని, నంద్యాలలో వ్యవసాయ యూనివర్శిటీ నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. నంద్యాల ప్రజల ఆశీస్సులు రేపటి తమ విజయానికి పునాదులు కావాలని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితులందరికీ న్యాయం చేస్తామని, ఆర్యవైశ్య సోదరులకు వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని 2018లో వైసీపీకి వచ్చే ఒకే ఒక్క ఎమ్మెల్సీ సీటును నంద్యాలకు కేటాయిస్తానని అక్కడి ప్రజలకు జగన్ హామీ ఇచ్చారు

కర్నూలు జిల్లాకే ఇచ్చిన హామీలకు దిక్కులేదు...ఇక నంద్యాల హామీలు నెరవేర్చుతారా...?

సీఎం హోదాలో కర్నూలులో ఇచ్చిన హామీలకే దిక్కులేని పక్షంలో నేడు నంద్యాల ఉప ఎన్నికల్లో మీరిచ్చే హామీలకు గ్యారంటీ లేదని ప్రజలు ఎప్పుడో గుర్తించారు. కర్నూలు స్మార్ట్ సిటీ, ఆధోనిలో టెక్స్ టైల్ పార్కులు, ట్రిపుల్ ఐటీ, న్యూక్లియర్ ఫ్యుయల్ కాంప్లెక్స్, స్విమ్స్ తరహాలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మైనింగ్ స్కూలు, ఫుడ్ పార్క్ సహా ఎన్నో హామీలిచ్చారే తప్ప ఇందులో ఏ ఒక్కటైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. మాట మీద నిలబడాలని అడిగితే కేసుల మీద కేసులు పెట్టి భయభ్రాంతుకు గురిచేస్తారని ధ్వజమెత్తారు. కాపులు రిజర్వేషన్లు అడుగుతూ కంచాలు మోగించినా కేసులు పెడతారని కానీ ఆయన లంచాలు మింగినా కేసులు ఉండవు.

ఎన్నికలుంటేనే ముస్లింలు గుర్తొస్తారు

ఎన్నికలుంటేనే చంద్రబాబుకు ముస్లింలు గుర్తుకొస్తారని పేర్కొన్నారు. ఆయన కేబినెట్ లో ఒక్క ముస్లిం మైనార్టీ వ్యక్తికి చోటివ్వని సీఎం చంద్రబాబు 2014 లో ముస్లింలకు కేవలం ఒకే ఒక్క సీటు ముస్లింకు ఇచ్చారని గుర్తుచేశారు. గెలవడని తెలిసిన ప్రాంతంలో సీటిచ్చి ఓ నేతను బలి పశువును చేశారని ధ్వజమెత్తారు. మైనార్టీ నేత అబ్దుల్ గని సేవలందించిన హిందూపురం సీటును తన బావమరిది బాలకృష్ణకు అప్పగించారని విమర్శించారు. తన కొడుకును ఎమ్మెల్సీగా గెలిపించుకొని కేవలం మూడు రోజుల్లోనే మంత్రివర్గంలో చోటిస్తారు, కానీ ఏ ఒక్క ముస్లింకు మంత్రివర్గంలో చోటివ్వకపోవడం ముస్లింలపై చంద్రబాబుకున్న విలువలేంటో కనిపిస్తోందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన వ్యక్తి వైఎస్సార్ అని పేర్కొన్నారు.

చంద్రబాబు చొక్కా, ఆదినారాయణ రెడ్డి నిక్కర్ ఊడుద్ది

కేశవ్ రెడ్డి బాధితులకు, అగ్రి గోల్డ్ బాధితులకు వారికి ఇవ్వాల్సిన డబ్బు మూడు నెలల్లోఇచ్చేస్తామని జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు చొక్కా వదిలిస్తాం ఆది నారాయణరెడ్డి నిక్కర్ ఊడదీస్తామని పేర్కొన్నారు. కేసులన్నీ తిరగతోడతామని వారి నుంచి ఎలా వసూలు చేయాలో ప్రభుత్వం చూసుకుంటుందన్నారు.

సింహంలా రాజీనామా చేశారు

శిల్పా చక్రపాణి రెడ్డి నా దగ్గరకొచ్చినపుడు చంద్రబాబు మాదిరిగా రాజకీయాలు చేయలేనని చెప్పి, న్యాయం, ధర్మం బద్ధంగా ఉండి రాజీనామా చేసే రావాలని చెప్పానని తొలుత కొంత ఇబ్బంది పడినా తర్వాత ఆయన స్పీకర్ ఫార్మాట్‌లో కౌన్సిల్ చైర్మన్‌కు రాజీనామా లేఖ రాసిచ్చారని జగన్ పేర్కొన్నారు. ఒక సింహంలాగా ఆయన ఈ పనిచేశారు. ఇలాంటి రాజీనామాలు ఆహ్వానించాలన్నారు.

శ్రీవారి ఆలయంలో ఘనంగా పవిత్రోత్సవాలు ప్రారంభం

తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల పవిత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు.

ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందు లో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 4 గంటలకు స్వామి అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆభరణాలతో సల్లింపు నిర్వహించారు. పవిత్రోత్సవాల కారణంగా తిరుప్పావడసేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలు రద్దయ్యాయి. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఓ అనిల్‌కుమార్ సింఘాల్, జెఇఓ శ్రీనివాసరాజు, శ్రీవారి ఆలయ డెప్యూటి ఇఓ కోదండ రామారావు, పేష్కార్ రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మిస్టరీగా మారిన వైద్యురాలి అదృశ్యం

విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : కృష్ణా జిల్లా విస్సన్నపేట క్లస్టర్ పరిధిలోని తెల్లదేవరపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా పనిచేస్తున్న డాక్టర్ సూర్యకుమారి అపహరణకు గురైందంటూ జరిగిన ప్రచారం చర్చాంశనీయంగా మారింది. జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన సూర్యకుమారి కటుంబం కర్ణాటకలో స్థిరపడింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన సూర్యకుమారి ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో సేవలందించేందుకు ఆరునెలల నుంచి విసన్నపేట క్లస్టర్ పరిధిలో తెల్లదేవరపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఐతే సోమవారం నుంచి కుమార్తె కనబడట్లేదంటూ సూర్యకుమారి కుటుంబం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూర్యకుమారి సోమవారం నుంచి విధులకు రావడం లేదని పోలీసుల విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఆమె ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్న కెసిఆర్



- అబద్ధాలపై ముక్కు రాస్తే కెసిఆర్‌కు ముక్కు మిగలదు
- తెలంగాణకు పట్టిన శని కెసిఆర్
- విద్యార్థుల బలిదానాలు గౌరవించే పార్టీ కాంగ్రెస్
- కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రానికి డిపిఒ సమర్పించలేదు
- ప్రజల ఆకాంక్ష మేరకు పొన్నం దీక్ష
- మెడికల్ కాలేజీపై మంత్రి, ఎంపికి బాధ్యత లేదా
- కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత జీవన్‌రెడ్డి

మేజర్‌న్యూస్– కరీంనగర్:దేశాన్ని 60 సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ పిశాచి అంటూ కెసిఆర్ పిచ్చి పట్టినట్లు మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత టి. జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీలోని కాంట్రాక్ట్, ప్రైవేట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తీసుకున్న నిర్ణయంపై కోర్టుస్టే ఇవ్వడం ముఖ్యమంత్రి తప్పిదమేనని అన్నారు. విద్యార్థుల ఆత్మ బలిదానాలను గౌరవిస్తూ కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోయిన పర్వాలేదని ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తూ తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అనే విషయాన్ని మరిచిపోకూడదన్నారు. సమస్యలను ఏలా అధిగమించాలో తెలియకుండా ప్రతిపక్షాలను బాధ్యులను చేస్తూ మాట్లాడడం ప్రజాస్వామ్యంలో సరైనా విధానం కాదన్నారు. తెలంగాణ అభివృద్ధికోసం నిర్మాణాత్మకమైన ప్రక్రియ లేకుండా పాలిస్తే ఏలా బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ప్రశ్నించారు. దళితులు, బిసిలు, మైనార్టీల అభివృద్ధికోసం రిజర్వేషన్ ప్రక్రియను అమలు చేయకుండా పేదలను పేదవారిగానే ఉంచుతున్నాడని దుయ్యబట్టారు. 51శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2013 భూ సేకరణ చట్టం రూపకల్పనలో అప్పటి ప్రభుత్వంలో ఉన్న కెసిఆర్ భాగస్వామి కాదా అని ప్రశ్నించారు. కోర్టు మొట్టికాయలు వేస్తే 2017లో నూతన చట్టం తీసుకువచ్చారని వివరించారు. ప్రాణ హిత– చేవేళ్లతో తెలంగాణ సస్యశ్యామలమయ్యేదని, రీడిజైనింగ్ పేరుతో జాప్యం చేసేది మీరు కాదా నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు జాతీయ హోదా కోసం కనీసం కేంద్రానికి డిపివో కూడ పంపించలేని స్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. అబద్దాలు, మోసాలపై ముక్కు రాస్తే కెసిఆర్‌కు ముక్కు మిగలదని ఎద్దేవా చేశారు. వాస్తవాలను వక్రీకరించడం, నేరేళ్ల ఘటన బాధితులపై ముఖ్యమంత్రి స్థాయిని మరిచి మాట్లాడడం చూస్తుంటే టిఆర్ఎస్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని అర్థమవుతుందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు, పేద ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ ఈ నెల 5నుండి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ హాయంలో స్మితాసబర్వాల్ జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు మెడికల్ కాలేజీకోసం 20 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు ఆరోగ్యశాఖకు లేఖ రాయడం జరిగిందన్నారు. టిఆర్ఎస్ ఎన్నికలో మెనిఫెస్టోలో జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేస్తామని పెట్టడం జరిగిందని, మూడు సంవత్సరాలు గడిచిన ఇప్పటి వరకు ఏలాంటి నిర్ణయం తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. దీనిపై స్థానిక మంత్రి ఈటల రాజేందర్, ఎంపి వినోద్‌కుమార్‌కు బాధ్యత లేదా అని ప్రశ్నించారు. వారసత్వ ఉద్యోగాల ప్రక్రియ కోర్టు తీర్పకంటే ముందే ప్రారంభించినట్లయితే సమస్య వచ్చేది కాదని, దానికి బాధ్యులు కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం, సింగరేణి అంతర్గత విభేదాలపై ప్రతిపక్ష పార్టీ అయినా కాంగ్రెస్‌కు ఏమి బాధ్యత అని ప్రశ్నించారు. కెసిఆర్ న్యాయ వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడుతున్నాడని, చట్టాల అమలును సమీక్షించేది న్యాయ వ్యవస్థ అని, ఉద్యోగ నియామకాల రిజర్వేషన్‌ల ప్రక్రియను పాటించాలని కోరారు. 150 పడకల సామార్థ్యం ఉన్న సిద్దిపేటకు కాలేజీని మంజూరు చేసి, 500 పడకల సామార్థ్యం ఉన్న కరీంనగర్‌కు ఎందుకు మంజూరు చేయడం లేదని, ఎవరు మోసం చేస్తున్నారో ప్రజలు గ్రహించాలన్నారు. మెగా పవర్‌లూం క్లస్టర్, సైనిక్ స్కూల్, లెదర్ పార్క్ పరిశ్రమల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కెసిఆర్ అహంకారమే అతన్ని గద్దె దించుతుందని, ఎవరు మోసగాళ్లు, ఎవరు పిశాచి, ఎవరు శని అనేది 2019లో ప్రజలు తేలుస్తారని పేర్కొన్నారు. ఒక బాధ్యతగల మాజీ ఎంపి ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటే ఆ సమస్య ఏంటని కనీసం ప్రకటన చేసే పరిస్థితిలో లేని ఈ ప్రభుత్వం మనకెందుకని ప్రజలను ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్, మాజీ మేయర్ డి. శంకర్, కరీంనగర్ నగర అధ్యక్షుడు కర్ర రాజశేఖర్, కార్పోరేటర్ గందె మాధవి– మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి



మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధిః రాష్ట్రంలోని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మించి ఇవ్వడానికి కెసిఆర్ సర్కార్ సుముఖంగా ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఇప్పగూడెంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, ఎంపి పసునూరి దయాకర్‌లతో కలసి ఆయన డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. వచ్చే ఏడాది నుండి రైతుల పెట్టుబడి కోసం ఎకరాకు ఎనిమిది వేల రూపాయలను ఇస్తున్నామన్నారు. కుల వృత్తుల సంక్షేమం కోసం సర్కార్ కట్టుబడి ఉందన్న ఆయన యాదవుల కోసం గొర్రెలను అందిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే రాజయ్య ఆహ్వానం మేరకు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలోని మల్కాపూర్‌లో త్వరలో రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రారంభిస్తమని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్‌పిటిసి భూక్యా స్వామి నాయక్, ఎంపిపి సుధాకర్‌రెడ్డి, నేతలు సోమిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హరితహారంలో అందరు పాల్గొనాలి'



మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధిః చారిత్రక ఓరుగల్లు నగరంలో హరిత హారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి చందులాల్ గురువారం అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగర శివార్లలోని మడికొండ నుండి రాంపూర్ వరకు వరంగల్, హైదరాబాద్ ప్రధాన రహదారిపై రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి చందులాల్ మాట్లాడుతూ తెలంగాణ ను ఆకుపచ్చ రాష్ట్రంగా మార్చడానికి సిఎం కెసిఆర్ తాపత్రయపడుతున్నారని ఆయన ఆలోచనలకనుగుణంగా ప్రజలంతా స్వచ్ఛందంగా హరిత హారంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువకులు ముందుండి ప్రజలతో చెట్లను నాటించాలన్నారు. ప్రతి గ్రామంలో కూడ గ్రామస్తులకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచామన్నారు. గత ఏడాది హరిత హారంలో వరంగల్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని... ఈ ఏడాది కూడ అధికార యంత్రాంగం కష్టపడి మంచి ఫలితాలు సాదించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మాట్టాడుతూ ఉద్యమ స్ఫూర్తితో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని హరిత హారంను కూడ అదే స్పూర్తితో ముందకు తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ నన్నపునేని నరేందర్, ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, ఆరూరి రమేశ్, స్థానిక కార్పోరేటర్ జోరిక రమేశ్, జిల్లా కలెక్టర్ వాకాటి కరుణ తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి పాదయాత్రకు బ్రేకులు పడ్డట్టేనా ?

- డిగ్గీరాజాను తప్పించడంతో డీలాపడ్డ బ్రదర్స్
- సార్వత్రిక ఎన్నికలకు ముందు పిసిసి కోసం తపన
- ఆదిలోనే అడ్డుకున్న ఉత్తమ్ వర్గీయులు
- టిఆర్ఎస్ నేతలతో సన్నిహితంగా ఉంటున్న కోమటిరెడ్డి
- ఉత్తమ్ నాయకత్వంపై కోమటిరెడ్డి ఆగ్రహం
- తెలంగాణలో కాంగ్రెస్‌ను ఖతం పట్టిస్తున్నారని విమర్శ
- పొన్నాల కంటే బలహీనమైన అధ్యక్షుడంటున్న బ్రదర్స్



మేజర్‌న్యూస్ తెలంగాణ ప్రతినిధిః రాబయే సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టాలని తద్వారా రాష్ట్రంలో తమ నాయకత్వాన్ని బలపరుచుకోవాలని నల్గొండ జిల్లకు చెందిన కోమటిరెడ్డి బ్రదర్స్ ఎత్తుగడలు వేశారు. అందులో బాగంగా ఇప్పటికే ఓ సొంత న్యూస్ ఛానల్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇన్నాళ్లు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్‌గా ఉన్న డిగ్గీరాజా ద్వారా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీతో పాటు రాహుల్ గాంధీలను కలసి తమ ప్రణాళికలు వారి ముందు ఉంచారు. తె ర వెనుక కెవిపితో పాటు పలువురు ఏఐసిసి అగ్రనేతల అండదండలు ఉన్నాయని భావించి బారీ స్కెచ్ గీశారు. కానీ కోమటిరెడ్డి సోదరుల వెనకాల సిఎం కెసిఆర్ ఉన్నారని అనుమానిస్తున్న కొంతమంది తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పక్కా ఆధారాలతో మేడమ్ ముందు ఉంచినట్లు తెలుస్తోంది. దీంతో ఇతర రాష్ట్రాలకు చెందిన నేతలతో విచారణ జరిపించిన సోనియా దిగ్విజయ్‌సింగ్‌తో పాటు కోమటిరెడ్డి సోదరుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. ఇందులో బాగంగా డిగ్గీరాజాను రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ బాధ్యతల నుండి తప్పించారని ఢిల్లీ వర్గాలలో ప్రచారం జరగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న జిల్లాలలో అవిభక్త నల్గొండ జిల్లా అగ్రస్థానంలో ఉంది. గడిచిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలోను ఆ పార్టీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంచి మెజారిటీతో విజయం సాదించారు. జిల్లాకు చెందిన ఇద్దరు సీనియర్ ఎమ్మెల్యేలు కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డిలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహిస్తున్నారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కోమటిరెడ్డివ సోదరుల హవా కొనసాగేది. తెలంగాణ ఉద్యమ సమయంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన మంత్రి పదవిని త్యాగం చేసి కాంగ్రెస్ అధిషానానికి తన నిరసననను తెలిపారు. పార్టీ బలంగా ఉంది. ఇక్కడి నేతలే కాంగ్రెస్ పార్టీకి సారథ్యం వహిస్తున్నారు. అయినా అధికార పార్టీ లోకి వలస వెళ్లే నేతలను మాత్రం వారు ఆపలేకపోవడం కాంగ్రెస్ పార్టీకి మైనస్‌గా మారింది. నల్గొండ ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డితో పాటు మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఇటీవలే కాంగ్రెస్‌ను వీడి టిఆర్ఎస్‌లోకి జంప్ చేవారు. మరో సీనియర్ ఎమ్మెల్యే శ్కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతుంది. అయితే ఆయన ఈ ప్రచారాన్ని ఖండిస్తూ తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. రెడ్ల రాజకీయాలకు కేంద్రంగా ఉండే నల్గొండలో పార్టీని కాపాడుకోకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని ఆ పార్టీ నాయకులు హెచ్చరిస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మొత్తం మూడు వర్గాలుగా విడిపోయింది. ఓ గ్రూపుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. మరో గ్రూపుకు కోమటిరెడ్డి సోదరులు నేతృత్వం వహిస్తుండగా అన్ని వర్గాలను సముదాయించే పనిని సిఎల్‌పి నేత జానారెడ్డి తన భుజాన వేసుకున్నారు. ప్రతి నియోజకవర్గంలోను గ్రూపు రాజకీయాలు కొనసాగుతుండడంతతో పార్టీ అధిష్ఠానం చాలా సీరియస్‌గా ఉంది. రాష్ట్ర పార్టీని నడిపించాల్సిన నాయకులు జిల్లాలో గ్రూపులు ప్రోత్సహిస్తుండడాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. వెంటనే ఈ పరిణామాలకు ఫుల్ స్టాప్ పెట్టాలనే యోచనలో ఉన్నారు.

టిఆర్ఎస్ నేతలతో కోమటిరెడ్డి సోదరులకు సంబంధాలున్నాయా...?

టిఆర్ఎస్ అగ్రనేతలతో కోమటిరెడ్డి సోదరులు టచ్‌లో ఉంటున్నారని కాంగ్రెస్‌లోని ఓ వర్గం ఆరోపిస్తుంది. గతంలో హరీష్‌రావుతో సమావేశమయిన వెంటనే విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసిన వెంకట్‌రెడ్డి పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు. పొన్నాల కంటే బలహీనమయిన నాయకుడంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆయన వైఖరి వల్లే కాంగ్రెస్ పార్టీ నారాయణ ఖేడ్, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటమి పాలయిందని మండిపడ్డారు. మంత్రులు సవాల్ చేసిన పిసిసి చీఫ్‌గా పారిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వ మార్పు పై స్పష్టమైన ప్రకటన చేయకుంటే పార్టీ మునిగిపోక తప్పదన్నారు. కాంగ్రెస్ క్యాడర్‌ను నడిపే శక్తి ప్రస్తుత నాయకత్వానికి లేదని, ప్రతి కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ రోజు రోజుకు బలహీనంగా తయారవుతుందన్న ఉత్తమ్ రాబోయే ఎన్నికల నాటికి కార్యకర్తలు ఎవ్వరు పార్టిలో మిగిలే పరిస్థితులు లేవన్నారు. పార్టీ నాయకత్వంపై దిక్కార స్వరం వినిపించిన ఆయన సిఎం కెసిఆర్ పాలనను పొగడ్తలతో ముంచెత్తారు. ఓ వైపు కాంగ్రెస్ నేతలపై విమర్శల వర్షాన్ని కురిపిస్తూనే తాను మాత్రం నల్గొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై చర్చించేందుకు హరీశ్‌రావుతో సమావేశమయ్యానని చెప్పడం కొసమెరుపు.

ఉత్తమ్‌కు మద్దతు ప్రకటించిన ఏఐసిసి..


రాబోయే సార్వత్రిక ఎన్నికలను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలోనే ఎదుర్కొంటామని ఏఐసిసి కి చెందిన సీనియర్ నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు పార్టీ అధినాయకత్వం నుండి ఆయనకు సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మేడమ్ సోనియా ఉత్తమ్‌ను ఆదేశించారని సమాచారం. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరులు పిసిసి చీఫ్ ఉత్తమ్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండడంతో డిల్లీ కాంగ్రెస్ అప్రమత్తమయింది. ఉత్తమ్ నాయకత్వాన్ని బలపరుస్తున్న నేతలు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా సమావేశమయిన వీరు కోమటిరెడ్డి సోదరుల తీరును తప్పు పడుతూ ఫిర్యాదుల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాల్సిన అవసరం లేదన్న వీళ్లు రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ఉత్తమ్ నేతృత్వంలోనే వెళ్లలనే సలహను ఇచ్చినట్లు సమాచారం. వీరికి రాష్ట్రంలోని మరికొందరు నేతలు కూడ మద్దతు పలికారని తెలుస్తోంది. సిఎల్‌పి నేత జానారెడ్డి మాత్రం రాజకీయాలకు రిటైర్మంట్ ప్రకటిస్తతూ వచ్చే ఎన్నికలలో తన కుమారున్ని రంగంలోకి దింపేందుకు ప్రయత్నిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ పరిస్థితులలలో టిఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొంటూ పార్టీ శ్రేణులకు ధైర్యం నింపే బాధ్యతను ఉత్తమ్ తన భుజస్కందాలపై వేసుకున్నారు. ఈ నేపథ్యంలో కోమటిరెడ్డి బ్రదర్స్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న పాదయాత్రకు ఆదిలోనే బ్రేకులు పడ్డాయన్న ప్రచారం గాంధీభవన్ పరిసరాలలో జోరుగా నడుస్తోంది.

'కల్తీల నివారణ కోసం కఠిన చట్టాలు'



సంగారెడ్డి: గుడుంబా నిర్మూలన పునరావాస పథకం కింద ఉమ్మడి మెదక్ జిల్లాలోని 162 మందికి రూ.3.30 లక్షల చెక్కులను మంత్రి హరీశ్‌రావు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీపాటిల్, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...గత ప్రభుత్వాలు డ్రగ్స్ సంస్కృతిని పెంచి పోషించాయి. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ లేకుండా తుంచి వేస్తుంది. కల్తీల నివారణ కోసం కఠిన చట్టాలు చేశారు. కల్తీ వస్తువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం. రాష్ట్రవ్యాప్తంగా గుడుంబా లేకుండా చేశాం. కల్లుగీత కార్మికులకు ఈత వనాల పెంపు కోసం 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

'కేసీఆర్‌లో ఆ భయం కనబడుతోంది'



హైదరాబాద్, సూర్యప్రధాన ప్రతినిధి: నిన్న ప్రగతి భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యల్లో బెదిరింపు ధోరణి, అహంకారం కన్పించిందని తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. సీఎం తన స్థాయికి తగినట్టు మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. గురువారం ఉత్తమ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారం పోతుందేమోనన్న భయం ముఖ్యమంత్రిలో కనిపిస్తోందని, అందుకే ఆయన అడ్డగోలుగా, అర్థరహితంగా పూర్తిగా అవాస్తవాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సింగరేణి వారసత్వ ఉద్యోగాలపై కేసు వేసింది తెలంగాణ జాగృతి సభ్యులేనన్నారు. అస్పష్టమైన జీవోలతో టీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు ఇస్తోందని ఆరోపించారు. ఉద్యోగ ప్రకటనలు, జీవోల్లో తప్పిదాల వల్లే వివాదాలు నడుస్తున్నాయని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు.


రాష్ట్రానికి ధనపిశాచిగా మారిన కేసిఆర్



- తెలంగాణకు మొదటి విలన్ కేసిఆర్
- దగాకోరు, దగుల్బాజి కేసిఆర్
- చిల్లరమల్లరగా మారిన సిఎం కేసిఆర్
- సిఎం కేసిఆర్‌పై నిప్పులు చెరిగిన డికెఅరుణ

జోగులాంబ గద్వాల బ్యూరో, మేజర్‌న్యూస్. తెలంగాణముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు తోపాటు ఆయన కుటుంబ సభ్యులు రాష్ట్రానికి ధనపిశాచాలుగా మారారని ధనదాహంతొ రాష్ట్ర ప్రజలను పట్టించుకొవడం లేనది చిల్లరమల్లర రాజకీయాలు చేస్తు దగుల్బాజి, దగాకొరులుగా మారారని పిసిసి ఉపాధ్యక్షురాలు, మాజ మంత్రి, గద్వాల ఎమ్మెల్యే డికె అరుణ కేసిఆర్ పై నిప్పులు చెరిగారు. గురువారం ఎమ్మెల్యే డికె అరుణ ధరూరు మండలం గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లను పరిశీలించిన అనంతరం విలేకర్లతొ మాట్లాడుతు ముఖ్యమంత్రి కేసిఆర్ కాంగ్రెస్ పార్టీని విమర్శించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు కేసిఆర్ వ్యాఖ్యలపై ఖండించారు. ముఖ్యమంత్రి కేసిఆర్ తన వ్యాఖ్యలను వాపస్ తీసుకుని క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో కాంగ్రెస్ శ్రేణులు, రైతులు ఎక్కడికక్కడ అడ్డుకుని నిర్బందిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీతొనే ఆయన జీవితం ప్రారంభమైందని కన్నతల్లిలాంటి పార్టీని దేశం కొసం ప్రాణత్యాగం చేసిన ఇందిరాగాంధీని ,భారతదేశప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పిన నెహ్రూ కుటుంబంలొని సొనియాగాంధీ లపై ముఖ్యమంత్రి తిట్టడం పట్ల ఆమె బాధపడ్డారు. ముఖ్యమంత్రి జీవితాన్ని ప్రసాదించింది కాంగ్రెస్ పార్టీయేనని ఈరొజు ముఖ్యమంత్రి అయ్యాడంటే ఆ విలువ కాంగ్రెస్ కే దక్కుతుందన్నారు. చంద్రబాబునాయుడు మంత్రి పదవి ఇవ్వలేదని కొపంతొ తెలంగాణ ఉద్యమ జెండా పట్టిన కేసిఆర్ తన రాజకీయ పబ్బం కోసం తెలంగాణ పాటపాడి విద్యావంతులు, విద్యార్థులు, మేధావులు, కాంగ్రెస్ నాయకుల మద్దతుతొ నేడు ఈ స్థాయికి ఎదిగారన్నారు. 2004 లొ తెలంగాణ కాంగ్రెస్ నాయకులందరు రాజశేఖర్ రెడ్డిని ఒప్పించామని మేము ఒప్పించడం వల్లే తేరాసతొ పొత్తు తొ కేంద్రమంత్రిగా ఉండి పది సంవత్సరాలు ధనాన్ని దొచుకుని గట్టిగయ్యాక కాంగ్రెస్‌ను విమర్సిస్తున్నాడన్నారు. తెలంగాణ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతొ సమన్వయం పరిచి రెండు రాష్ట్రాలలొ అదికారం కొల్పొతామని సర్వేలు చెప్పినా దైర్యంగా తెలంగాణ ఇచ్చి సోనియా తెలంగాణ ప్రజల ప్రజల ఆకాంక్ష తీర్చారన్నారు. కాంగ్రెస్ నాయకులను విమర్శించడం సరిగాదన్నారు.కేసిఆర్ కే వక్రబుద్ది ఉందని తెలంగాణ ఇస్తే కాంగెస్ లొ కలుపుతానని నమ్మించి మోసం చేసిన దగాకొరు అన్నారు. ఇంటికి ఉద్యొగం, డబుల్ బడ్‌రూంలు అంటు అదికారంలొకి వచ్చి ప్రజలను నట్టేట ముంచుతున్నారన్నారు. ఒక్కరొజు కూడా నేరుగా ప్రజలను కలుసుకొని ముఖ్యమంత్రి దేశంలోనే నంబర్ వన్ గా పేరు తెచ్చుకుని ముఖ్యమంత్రి పదవికే మాయని మచ్చలా మిగిలారని విమర్శించారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకొవాల్సిన కేసిఆర్ నడుచుకొవడం లేదని ఇందుకు ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని త్వరలొ ప్రజలు బయటకు వచ్చే సమయం ఆసన్నమైందన్నారు. ముఖ్యమంత్రి పాంహౌజ్, ప్రగతి భవన్ కే పరిమితమయ్యారన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రాష్ట్రపతి ఒయుకు వచ్చినప్పుడు కేసిఆర్ ఎందుకు ప్రసంగించలేదన్నారు. చెప్పులు విసురుతారనే భయపడి ప్రసంగించలేదన్నారు. 2019 లొ అటు దేశంలొ, ఇటు రాష్ట్రంలొ అదికారంలొకి రావడం ఖాయమని ఆమెధీమా వ్యక్తం చేశారు.

విజయవాడలో నకిలీ గ్లూకోజ్ స్వాధీనం



విజయవాడ, సూర్య క్రైమ్ ప్రతినిధి : విజయవాడ వన్‌టౌన్‌లో నకిలీ గ్లూకోజ్ తయారీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేసి 27 బస్తాల నకిలీ గ్లూకోజ్ పొడిని స్వాధీనం చేసుకున్నారు. ప్రఖ్యాత గ్లూకోజ్ సంస్థల లేబుళ్లను పోలిన రీతిలో నకిలీ ప్యాకెట్లు తయారుచేసి వాటిలో నాసిరకం పొడిని నింపి మెడికల్ షాపులు, కిరాణా దుకాణాల్లో తక్కువ ధరకే విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. అనుమతి లేకుండా తయారు చేస్తున్న మందులు, కాలం చెల్లిన తేదీతో ఉన్న మందుల్ని పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఆముదం, గ్లూకోజ్‌వంటి ఉత్పత్తులను కూడా అనుమతి లేకుండా ప్యాక్ చేస్తుండటాన్ని గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ అధికారులతో పాటు ఆహార భద్రత అధికారులు కూడా ఈ దాడుల్లో పాల్గొన్నారు. కొంత కాలంగా ఈ కేంద్రాల్లో మందులు, శక్తినిచ్చే పౌడర్లను తయారుచేసి మార్కెట్ చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తయారీదారుడిపై కేసు నమోదుచేసిన పోలీసులు అతడిని అరెస్టుచేశారు.

నేరేళ్ల బాధ్యులను వదిలిపెట్టం



మేజర్‌న్యూస్– కరీంనగర్:రాజన్న సిరిసిల్ల జిల్లా నేరేళ్ల ఘటనలో అమాయకులను చిత్రహింసలకు గురి చేసిన బాధ్యులను వదిలిపెట్టమని బిజేపి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు హెచ్చరించారు. గురువారం స్థానిక శ్రీనివాస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం పేదలకు అండగా నిలవాల్సిందిపోయి నిర్లక్ష్యంగా మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక మాఫియా గుప్పిట్లో ఉందని, బయటకు రాలేకపోతుందని విమర్శించారు. లారీలపై దాడి జరిగిన సంఘటనలో కెసిఆర్ ఒకేవైపు ఉండి మాట్లాడడం శోచనీమన్నారు. పోలీసులు కిరాతంగా చిత్రహింసలు పెట్టినవారిని బిజేపి వదిలిపెట్టబోదని ప్రతిణబూనారు. రెండు సంవత్సరాల తరువాత అయినా బిజెపినుండి తప్పించుకోలేరని తీవ్ర స్వరంతో ఉద్ఘాటించారు. ఇసుక మాఫియాకోసం ప్రభుత్వం పని చేస్తుందని, ఇప్పటికైనా తమ తప్పును తెలుసుకొని ప్రభుత్వం ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మంలో రైతులకు బేడీలు వేస్తూ, సిరిసిల్లలో బడుగులకు థర్డ్ డిగ్రీలు ప్రయోగిస్తూ ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తుందని దుయ్యబట్టారు. ఐదు సంవ త్సరాలపాటు 'సంకల్ప పర్వం' ను ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా తీసుకొని నవ భారత నిర్మాణానికి కంకణబద్ధులై కృషి చేయాలని భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారని ఆయన తెలిపారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా 1942 ఆగస్టు 9నుండి క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించి నేటి వరకు 75 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతుందని, 2017 నుండి 2022 వరకు ఐదు సంవత్సరాలపాటు దేశవ్యాప్తంగా సంకల్ప పర్వానికి పౌరులు సన్నద్ధం కావాలని ఆయన కోరారు. నూతన భారత్, పేదరికం, టెర్రరిజం, నక్సలిజం, కమ్యూనిజంలను అంతం చేయడంకోసం సవాళ్లను, బలహీనతలను రూపుమాపడంకోసం సంకల్పపర్వంలో ప్రతి ఒక్క యువకుడు సంకల్పం తీసుకొని నవభారత్‌ను నిర్మించాలని సూచించారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాముఖ్యతను కెసిఆర్ తెలుసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. రజాకార్ల వ్యతిరేక ఉద్యమాన్ని, స్వాతంత్ర్య ఉద్యమంలో అసువులు బాసిన అమరులను కెసిఆర్ గౌరవించాలని తెలిపారు. ఆగస్టు 9నుండి సెప్టెంబర్ 17వరకు తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాలను దిగ్విజయంగా జరుపుతామన్నారు. గ్రామస్థాయినుండి జిల్లాస్థాయి వరకు బిజేపిని బలోపేతం చేస్తూ అధికారాన్ని చేజిక్కుచ్చుకుంటామన్నారు. ఈ సమావేశంలో జాతీయ కిసాన్‌మోర్చ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

సిరిసిల్లలో కాంగ్రెస్-టీఆర్ఎస్ నేతల వాగ్వాదం

రాజన్న సిరిసిల్ల: తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. మండలంలో ఇసుక లారీల రాకపోకలను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు కాంగ్రెస్ నేతల యత్నించారు. వారిని టీఆర్ఎస్ నేతలు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వారిని చెదరగొట్టారు.

నంద్యాల సభ చారిత్రక సాక్ష్యం

నంద్యాల, మేజర్‌న్యూస్:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాలలో నిర్వహిస్తున్న బహిరంగ సభ చరిత్రకు సాక్ష్యంగా నిలవబోతుందని వైసీపీ గుంటూరు జిల్లా అర్బన్ అధ్యక్షుడు లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. భవిష్యత్తులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి నంద్యాల ఉప ఎన్నికలు పునాది కానున్నాయని అన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో గెలిచేందుకు టీడీపీ నేతలు ప్రజలను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అనేక ప్రలోభాలకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు.



భట్రాజుల ఫెడరేషన్ పాలకవర్గ కమిటీ ఏర్పాటు చేయాలి

వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర భట్రాజుల ఫెడరెషన్ పాలకవర్గ కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బట్రాజుసంఘం అధక్షులు కూరపాటి కోటం రాజు, ఇతర నాయకులు సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 లక్షల మంది బట్రాజులు ఉన్నారని, ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటి వరకు పాలకవర్గం కమిటీ ఏర్పాటు చేయకపోవడం బాధాకారంగా ఉందని మంత్రికి విన్నవించారు. పాలకవర్గం ఏర్పాటు చేయని కారణంగా ఈ కులంలోని పేదవారు బ్యాంకుల నుండి రుణాలు పొందలేకపోతున్నారని, ప్రభుత్వం ఫెడరేషన్‌కు 15 కోట్లు రూపాయలు బడ్జెట్ కేటాయించినప్పటికీ పాలకవర్గం వల్ల రుణాలు అందడంలేదని వారు మంత్రికి వివరించారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే జైలుకే

- ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా అందుబాటులో ఇసుక
- జిల్లాలో 11 ప్రాంతాల్లో ఇసుక త్రవ్వకాలకు అనుమతులు
- అక్రమ ఇసుక త్రవ్వకాలపై గట్టి నిఘా
- జిల్లా కలెక్టర్ వి వినయ్ చంద్

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరికి ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి వినయ్‌చంద్ అధికారులను ఆదేశించారు.

ఇసుక పై ఏర్పాటు చేసిన జిల్లా స్ధాయి కమిటీ సమావేశం గురువారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 11 ప్రాంతాల్లో ఇసుక త్రవ్వకాలకు అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. మద్దిపాడు, మద్దిరాలపాడు, నందిపాడు, అద్దంకి మండలం చక్రాయిపాలెం 1, 2 గుడ్లూరు మండలం దొరకాని పాడు ఉలవపాడు మండలం కె రాజుపాలెం, కె బిటగుంట, నాగులుప్పలపాడు మండలం చదలవాడ, ఒంగోలు మండలం కరవదిలో ఇసుక త్రవ్వకాలకు అధికారికంగా అనుమతించినట్లు చెప్పారు. క్రమబద్దకరించుకుంటనే మరొక ఐదు కొత్త రీచ్‌లు గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుక త్రవ్వకాలకు ఎక్కడా మంత్రులు ఉపయోగించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఇసుక త్రవ్వకానికి మరియు ట్రాక్టరులో నింపేందుకు కలిసి ట్రాక్టరుకు రూ 300 ధర నిర్ణయించినట్లు తెలిపారు. అదే విధంగా ఇసుక రవాణాకు ఐదు



కిలో మీటర్ల వరకు రూ 400 ఐదు కిలో మీటర్ల నుంచి 10 కి మీ వరకు రూ 600 మాత్రమే వసూలు చేయాలని చెప్పారు. పది కిలోల మీటర్లు దాటితే కిమీ 35 వంతునర చెల్లించేందుకు అంగీకరించారు. మద్దిపాడు మండలం నుంచి ఒంగోలులకు అని ఖర్చులు కలసి రూ 1000 లుగా నిర్ణయించారు.

ప్రభుత్వం నిర్ణయించిన రేటుతోపాటు విధి విధానాలకు సంబంధించిన సమాచారంలో అన్నీ రీచ్‌ల్లో బోర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నోటిఫైడ్ ప్రాంతాల్లో తప్ప మరెక్కడా ఇసుక త్రవ్వకాకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ అవసరాలకు మాత్రం స్ధానిక తహాశీల్ధారు అనుమతిలో ఇసుక తెచ్చుకోవచ్చన్నారు. ఇసుక ధరలను అదనపు ఉంచడానికి మండల స్ధాయి ధరల నియంత్రణ టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు. అదే విధంగా గనుల శాఖ ఏడీ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎక్కడైనా ఇసుక అక్రమ త్రవ్వకాలు జరుగుతున్నట్లు కాని, అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు గాని ప్రజలు నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలని ఆదేశించారు.

ఇసుక అక్రమ త్రవ్వకాలు,రవాణాక అరికట్టడానికి పోలీసు, రెవెన్యూ అధికారులు సహకారం తీసుకోవాలని, అక్రమ ఇసుక త్రవ్వే ప్రాంతాలన్నింటిలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలన్నారు. అక్రమ రవాణాకు సహకరిస్తున్న వాహనాలను ఎక్కడిక్కడ స్వాధీనం చేసుకోవచ్చునని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులకు 2 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు 2 లక్షలు జరిమానా విధంచడం అవకాశం ఉందన్నారు.

– పట్టా భూముల్లో ఇసుక త్రవ్వకాలకు అనుమతి

పట్టాభూమి కల్గిన రైతులు ఇసుక త్రవ్వకాలకు ముందుకు వస్తే అనుమతిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి కల్గినర రైతులు సంబంధిత ఆర్డీవోలను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు.

ఈ సమావేశంలో ఒంగోలు, కందుకూరు, మార్కాపురం ఆర్డీవోలు శ్రీనివాస రావు, మల్లిఖార్జునరావు, పెంచల కిషోర్, వివిధ శాఖాధికారులు ఉన్నారు.

వెంకయ్య నాయుడును కలసిన ఎమ్మెల్యే బండారు



నరసాపురం,మేజర్‌న్యూస్ః ఉప రాష్ట్రపతి బిజెపి అభ్యర్ధి ఎమ్. వెంకయ్య నాయుడును నరసాపురం ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, ఎంపిలు గోకరాజు గంగరాజు, తోట నరసింహం, తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావులు గురు వారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలందించి అభినందనలు తెలిపా రు. ఈ సందర్బముగా ఎమ్మెల్యే మాట్లాడు తూ తెలుగురాష్ట్రల వ్యక్తి వెంకయ్య నాయుడును మర్యాదపూర్వకంగా కలిసామ ని , భవిష్యత్‌లో మరెన్ని శిఖరాల నధిరోహించాలన్ని కోరినట్లు తెలిపారు.

స్వర్ణాంధ్రలో ఎం.బి.ఎ , ఎం.సి.ఏ మొదటి తరగతులు ప్రారంభం



నరసాపురం,మేజర్‌న్యూస్ః మండలంలోని సీతారామపురంలో గల స్వర్ణాంధ్ర గ్రూఫ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబిఎ , ఎంసిఎ మొదటి సంవత్సరం తరగతులు గురువారం నాటి నుండి ప్రారంభమయ్యాయి. ఈ సందర్బముగా ఏర్పాటు చేసిన విద్యార్ధుల తల్లితండ్రుల అవగాహన సదస్సులో స్వర్ణాంధ్ర కళాశాలల కార్యదర్శి డాక్టర్ సత్రసాల రమేష్‌బాబు ముఖ్య అతిగా పాల్గొన్ని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విధ్యార్ధులు వారికంటూ ఒక ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకుని వారి భవిష్యత్‌ను బంగారు బాటగా తీర్చి దిద్దకోవాలన్నారు. విధ్యార్ధులకు స్వర్ణాంధ్రలో అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేసామని వాటిని సద్వినీయోగపరచుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర కళాశాల ప్రిన్సిపాల్స్ ఎమ్. శ్రీనివాస కుమార్, డా॥ తేన్నేటి మధులు విధ్యార్ధులకు మంచి సూచనలు , సలహాలందించారు. ఈ అవగాహన సదస్సులో కె రీర్ గైడెన్స్ వైస్ ప్రెసిడెంట్ సత్రసాల కీర్తికుమార్, ఛైర్మన్ కెవి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి , వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టితో పెరుగుతున్న అవినీతి



- దొంగ మార్గాలు వెతుక్కోవడానికి దారి చూపిన మోడీ
- మోడీకి దాసోహమంటున్న టిడిపి, వైసిపి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి

తిరుపతి : పెద్ద నోట్లు రద్దు చేసి అవినీతిని కడిగేస్తామన్న మోడీ కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టుకోలేక పోయారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి విమర్శించారు. జీఎస్‌టితో ఒకే పన్ను విధానమని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వం అక్రమార్కులకు దొంగదారులు వెతుక్కొని ఎలా వ్యాపారం చేసుకోవాలని నేర్పించారు తప్ప ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఈ రెండు కార్యక్రమాలు అమలు చేసి దేశానికి ఏదో చేసేశామని చంకలు దుగ్గుకుంటున్న బిజెపికి తగిన గుణపాఠం తప్పదన్నారు. గురువారం స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో పిఎల్ నరసింహులు అధ్యక్షతన సిపిఐ చిత్తూరు జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హరినాథరెడ్డి మాట్లాడుతూ జిఎస్‌టి కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసింది, కానీ మధ్యతరగతి ప్రజానీకం నడ్డి విరిగిందన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మేలు చేకూరే డీజిల్, పెట్రోల్‌ను ఎందుకు జిఎస్‌టి పరిధిలోకి తీసుకురాలేదని ప్రశ్నించారు. జిఎస్‌టి వల్ల నల్లధనం మరింత పెరిగే మార్గాలు మ్రాం సులభమైందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని చెప్పారని, అయితే గత మూడేళ్లలో ప్రతి వస్తువు ధర రెట్టింపు అయిందన్నారు. గ్యాస్ సబ్సిడిని ఎత్తివేస్తామని, నెలకు నాలుగు రూపాయలు చొపన పెంచుతూ పోతూ, సంవత్సరానికి పూర్తిగా వినియోగదారుడే భరించాలని చెప్పడం శోచనీయమన్నారు. కార్పొరేట్ ఆయిల్, గ్యాస్ కంపెనీలకు ఊడిగం చేసేందుకు ఎన్‌డిఏ సర్కారు సిద్ధంగా ఉందన్నారు. ఉత్తర భారతదేశంలో కుల, మత, రాజకీయాలు చేసి అధికారం సంపాదించిన బిజెపి దక్షిణ భారత దేశంలో ఎలాగైనా పాగా వేయాలని నీచరాజకీయాలకు ఒడికడుతోందన్నారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ దాడులు పెరిగాయని, వాటిని లౌకిక, వామపక్షాలు ప్రతిఘటిస్తే సోసల్ మీడియాలో ఆబద్దపు ప్రచారాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాల్లో తిష్ట వేసేందుకు స్థానిక పార్టీల మధ్య ఒకే పార్టీలో నాయకుల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందాలని మోడీ వ్యూహరచన చేస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వారిని విసిలుగా, కీలక విభాగమైన ఎన్‌సిఆర్‌టి వంటి వాటిలో ఆర్‌ఎస్‌ఎస్ బావజాలం ఉన్న వ్యక్తులను నియమించి విద్యా వ్యవస్థను తన కనుసన్నల్లోకి తీసుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. యూనివర్శిటిల్లో దాడులకు తెగబడుతూ ఘర్షణ వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులు, మేథావులు దీనిని తిప్పికొట్టాలన్నారు. గోరక్షణ పేరుతో దేశంలో దళితులను ఊచకోత కోస్తున్నారన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ మోడీకి దాసోహమవడం హాస్యాస్పదమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించేందుకు సిద్ధం కావాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు మాట్లాడుతూ ఫిబ్రవరిలో రాష్ట్ర మహాసభలు కడప జిల్లాలో, తిరుపూర్‌లో జాతీయ మహాసభలు జరగనున్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని శాఖ, మండల, పట్టణ మహాసభలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సభ్యత్వం పునరుద్ధరణతో పాటు నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సి ఉంటుందన్నారు. మహాసభల్లో దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై క్షుణ్ణంగా చర్చించాలన్నారు. ఈ నెల 20 నుంచి మూడు రోజులపాటు సిపిఐ సమితి సభ్యులు, హోల్‌టైమర్ల శిక్షణా తరగతులు తిరుపతిలో నిర్వహిస్తున్నామన్నారు. గ్యాస్ సబ్సిడి ఎత్తివేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

తిరుమలలో భారీ ఎల్ఇడి స్క్రీన్‌ను ప్రారంభించిన ఇఓ



తిరుమల, సూర్య ప్రత్యేకప్రతినిధి : తిరుమల శ్రీవారి సహస్రదీపాలంకరణ మండపం పక్కన భారీ ఎల్ఇడి స్క్రీన్‌ను టిటిడి ఇఓ అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జెఇఓ కె.ఎస్.శ్రీనివాసరాజుతో కలిసి గురువారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన ఎ.సి.టి సంస్థ రూ.1.70 కోట్లతో ఏర్పాటు చేసిన స్క్రీన్‌కు ఇఓ, తిరుమల జెఇఓ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఇఓ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సేవలు, ఉత్సవాలను భక్తులు భారీ స్క్రీన్‌లలో వీక్షించవచ్చని తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఎస్వీబీసీ ద్వారా మరింత నాణ్యమైన కార్యక్రమాలు అందిస్తామన్నారు. రానున్న బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి వాహనసేవలను ఈ భారీ స్క్రీన్‌లలో ప్రదర్శించనునట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్ధం తిరుమలో మరిన్ని ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఇఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి సివిఎస్ఓ రవికృష్ణ, ఎసిటి సంస్థ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ విద్యార్థులకు స్వర్ణ పతకాలు



నరసాపురం,మేజర్‌న్యూస్ః మండలంలోని సీతారామపురం లో గల స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్‌సిఇటి) కళాశాల , మరియు (ఎస్ఐఇటి) బి.టెక్ ఫైనల్ ఇయర్ విధ్యార్ధులు మహేష్‌బాబు, గౌతమ్, నవీన్ రాజులకు స్వర్ణపతకాలు లభించాయి. గత నెల 29 నుండి 30 వ తేది వరకు కొలంబోలో జరిగిన ఒలంపిక్ ఇంటర్ నేషనల్ క్రీడలు అధ్లెటిక్స్, జావిలిన్,డిస్క్ త్రో లలో వీరు స్వర్ణపతకాలు సాధించారు.పతకాలు సాధించిన స్వర్ణాంధ్ర విధ్యార్ధులును క ళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.రమేష్‌బాబు, ట్రెజరర్ కె. వెంకటేశ్వరస్వామి, ప్రిన్సిపాల్స్ టి. మధు, ఎమ్. శ్రీనివాస కుమార్, ఫిజికల్ డైరక్టర్ కెవివిఎస్ఎన్ మూర్తి, తోటి విధ్యార్ధులు అభినందన లు తెలిపారు.


సీమకు న్యాయం చేయకుంటే బాబుకు ముప్పే



తిరుపతి : సిఎం చంద్రబాబు వుట్టిన గడ్డకి న్యాయం చేయలేదని, ఇప్పటికైనా మేలుకొని సీమాభివృద్ధికి తోడ్పడకుంటే చంద్రబాబుని ఆ భగవంతుడు కూడా క్షమించడని సిపిఎం మాజీ కర్నూల్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గఫూర్ విమర్శలు కురిపించారు. గురువారం యశోధనగర్‌లోని కమ్యూనిస్టు కార్యాలయం నందు గఫూర్ మాట్లాడుతూ చంద్రబాబు ఎంతసేవు అమరావతి జపం చేస్తున్నాడని దుయ్యబట్టారు. స్టేట్‌లో మిగతా ప్రాంతాల గతి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమలో వర్షాలు పడక పంటలు ఎండి రైతన్నలు దిగులుతో కృంగిపోతున్నారన్నారు. సీమలో హంద్రీనీవా, గాలేరునగరి, మన్నవరం లాంటివి ప్రారంభిచారు కానీ అవి శంఖుస్థాపనలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. చిత్తూరు జిల్లాలో పది వేల మంది గ్రాడ్యుయేట్స్ పని లేక హోంగార్డ్‌గా కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీమ నాలుగు జిల్లాల్లో భారీ పరిశ్రమల్ని స్థాపించాలన్నారు. దీని వలన నిరుద్యోగులకు ఉపాధి వస్తుందన్నారు. ఖాళీ ఉద్యోగాల్ని భర్తీ చేసి, టిటిడిలోని వాటర్ స్కీమ్‌కి నిధులు ఇవ్వక పోవడం దారుణమన్నారు. రైన్‌గన్స్‌తో పంటల్ని కాపాడుతామని అధికారులు పైరును చంపేస్తున్నారన్నారు. స్కూల్ ఫీజుల భారాన్ని తగ్గించలేని ప్రభుత్వం దోపిడి గాళ్లను ప్రోత్సహిస్తుందన్నారు. పసుపుపార్టీ ప్రభుత్వం తీరు మారుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నేతలు కందారపు మురళి, కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా తండ్రిని పొట్టనపెట్టుకున్న పార్టీ టీడీపీ

వంగవీటి రాధా



నంద్యాల, మేజర్‌న్యూస్: చంద్రబాబు నాయుడు పాలనలో నంద్యాల ప్రజలు ఎంతో నష్టపోయారని, ఆ నష్టాన్ని పూడ్చటం చాలా కష్టమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వంగవీటి రాధాకృష్ణ అన్నారు. నంద్యాలలోని ఎస్పీజీ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే ప్రతినిధి వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నంద్యాలకు రావడం ఇక్కడి ప్రజల్లో ఆశలు చిగురిం చాయన్నారు. ఎక్కడ చూసినా ఫ్యాన్ గుర్తుకు ఫాలోయింగ్ పెరిగిపోతుంటే చంద్రబాబు గుండెల్లో రైల్లు పరిగెడుతున్నాయని చెప్పారు. వైఎస్ఆర్ ఫ్యామిలీపై, జగనన్నపై అభిమానంతో శిల్పామోహన్ రెడ్డి వెంట మేమున్నా మంటూ ఏపీలోని ఇతర ప్రాంతాల నుంచి సైతం భారీ సంఖ్యలో అభిమానులు తరలిరావడంతో ఇక్కడ పండుగ వాతావరణం కనిపిస్తుందన్నారు. '1988లో నా తండ్రి వంగవీటి మోహనరంగా గారిని పొట్టనపెట్టుకున్న పార్టీ టీడీపీ అని ఆరోపించారు. చేతగాని దద్దమ్మ అయితే చంద్రబాబు ఇంట్లో కూర్చోవాలి. చంద్రబాబు డబ్బు ఆశ చూపినా జనం లెక్కచేయలేదు. ఇవాళ రిజర్వేషన్ల పేరు తో మళ్లీ కాపులను మోసం చేస్తున్నారు. ప్రజల కోసం ఉద్యమాలు చేసే ముద్ర గడ లాంటి నేతలను అడ్డుకోవడం దారుణం. మరోవైపు అన్న వస్తున్నాడన్న నినాదంతోనే మీరు చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని' రాధాకృష్ణ నంద్యాల ప్రజలకు పిలుపునిచ్చారు.

పిల్లల ఆహారం-జరభద్రం

కడప,సూర్యప్రతినిధి: ఇతల్లిదండ్రులు తమ పిల్లలను ప్రాణాల కంటే మిన్నగా చూసుకుంటారు. ఆశలన్నీ వారిపైనే పెట్టుకొని కంటికి రెప్పలా కాపాడుకుంటారు. సమయానికి భోజనం వేళకు బడికి దిగబెట్టడం ఇంటికి తీసురావడం అవసరమైనవి అడిగినవన్నీ కొనిస్తారు. అక్కడితో బాధ్యత తీరిపోయిందని భావిస్తారు. చేతిఖర్చులను ఇచ్చిన డబ్బుతో ఏం చేస్తున్నారు. బడి బయట, పక్కన ఉన్న దుకాణాల్లో ఎలాంటి పదార్థాలు కొనుక్కుని తింటున్నారు.. ఇంటి సమీపంలో దుకాణాల్లో విక్రయిస్తున్న తినుబండారాలు నాణ్యత ఎలా ఉంది.. వాటి రంగు, రుచి, పిల్లల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతాయి. ఈ అంశాలపై ఎంత మంది తల్లిదండ్రులు దృష్టి పెడుతున్నారు. ఈ నిర్లక్ష్యమే పిల్లల ఆరోగ్యం పాలిట శాపమవుతోంది. ఈనేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వెద్యుల సూచనలు, ఇతర్రతా అంశాలతో సూర్య ప్రత్యేక కథనం.ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లెకు చెందిన హుస్సేన్‌బాషా కుమారుడు సమీర్ విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. డాక్టరు వద్దకు తీసుకెళితే ఎండోస్కోపీ చేయించమన్నారు. నివేదిక వచ్చాక చూస్తే పెద్దపేగుల్లో చిన్న చిన్న పుళ్లు పడ్డాయని తేలింది. మూడు నెలల పాటు నివారణ మందులు వాడుతూ కారం, నూనె, ఉప్పు తక్కువున్న ఆహారం తీసుకునేలా వెద్యుడు జాగ్రత్తలు చెప్పారు. చిరుతిళ్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు పాణ్యంకు చెందిన ఓబులేసు కుమారుడు నరహరి ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజులుగా భోజనం సరిగా చేయడం లేదు. ఒకవేళ తిన్నా అరగించుకోలేక తేన్పులతో ఇబ్బంది పడుతున్నారు. ఓబులేసు తండ్రి నంద్యాలలో ఓ వైద్యుడి వద్దకు వెళ్లగా తరచూ కలుషిత ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ దెబ్బతిన్నట్లు పరీక్షల ద్వారా గుర్తించారు. నివారణ కోసం నాలుగు నెలలపాటు క్రమం తప్పక వాడాలని మందులు రాసిచ్చారు.

మన నిర్లిప్తతే పిల్లలకు శాపం

బడికెళ్లే పిల్లలు మారాం చేయడం, వారిని లాలించేందుకు తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వడమో సర్వసాధారణం. కొందరు తల్లిదండ్రులు పిల్లలకు బయట దుకాణాల్లో లభించే తినుబండారాలు కొనిస్తుంటారు. బయట లభించే ఈ వస్తువులు ఎంతవరకు సురక్షితం అన్న ప్రశ్నకు నిపుణుల నుంచి వచ్చే సమాధానం ఎంతమాత్రం మంచిది కాదనే వస్తుంది. దీన్ని తల్లిదండ్రులు తప్పనిసరిగా గుర్తించాలి.

ఇక్కడ జాగ్రత్త సుమా


పాఠశాలల సమీపంలోని చిన్న చిన్న దుకాణాల్లో విక్రయించే ప్యాకేజీ చిరుతిళ్లు అసలుకు పోలిన నకిలీ బ్రాండవె ఉంటున్నాయి. ఉదాహరణకు ప్రస్తుతం ఎంతో ప్రాచుర్యం పొందిన పదం జియో. ఈ పేరుమీద ఎలాంటి ప్యాకింగ్ ఆహార పదార్థాలు ఉండకూడదు. అయితే ఆళ్లగడ్డ పరిధిలో వేల కొద్దీ ప్యాకింగ్ చిరుతిళ్లు ఈ పేరుమీద విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. బేకరీలు, టీబంకులు, హోటళ్లలో విక్రయించే సమోసాలు ఏ రోజు చేసినవి ఆరోజే విక్రయించాలి. అలాకాక కొన్ని రోజుల క్రితం చేసిన సమోసాలున్నా వాటిని ఓవెన్‌లో ఉంచి వేడివేడిగా పిల్లలకు అమ్ముతున్నారు. ఇవి తిని పిల్లలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పానీపూరీ చూస్తేనే లొట్టలేయని పిల్లలుండదు. పానీపూరి బండి నిర్వాహకుడి వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గమనించాలి. ఈ వ్యక్తి అపరిశభ్రమైన చేతిని ఎన్నిసార్లు కుండలో ముంచి పానీని అందిస్తుంటాడో చూడవచ్చు.గోబీ, నూడుల్స్‌లో వినియోగించే సాస్‌లు (టమోటా, చిల్లీ) అనారోగ్యదాయకాలు. తోపుడు బండ్లలో లభించే బజ్జీలు, బోండాలు, వడలు ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతాయి. వేయించేందుకు ఉపయోగించే నూనె నాణ్యత ఉండకపోగా దీన్ని పలుమార్లు వేడి చేస్తుంటారు. ఇలా వేడి చేసిన నూనె క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.చాక్లెట్లు, క్రీమ్ బిస్కట్లు, కేక్‌లు శరీరంలో కొవ్వు పదార్థాల నిల్వలను పెంచుతాయి. ఇవి గుండె సంబంధిత వ్యాధులకు దారి తీస్తాయి.

వూబకాయం.. జీర్ణకోశ వ్యాధులు ఖాయం

పిల్లలు ఎక్కువగా బయటి ఆహారం తీసుకోవడం ద్వారా వూబకాయం వస్తుంది. 60% రోగాలకు వూబకాయం కారణమని ఇప్పటికే పరిశోధనల ద్వారా వెల్లడైంది. మరోవైపు ప్రమాకరమైన ప్రిజర్వేటివ్స్ ఉన్న జంక్‌ఫుడ్ తీసుకోవడం ద్వారా జీర్ణకోశ వ్యాధులు వస్తాయి. దీని ద్వారా దీర్ఘకాలంలో పలు వ్యాధులు వచ్చే అవకాశాలు అధికమవుతాయి. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు చదువులోనూ, ఆటల్లోనూ చురుగ్గా ఉంటారు. చిరుతిళ్లు, సమోసాలు, జంక్‌ఫుడ్‌కు అలవాటు పడిన పిల్లల్లో చురుకుదనం మందలిస్తుంది. ఇది చదువుపై కూడా ప్రభావం చూపుతుంది. అటు సక్రమంగా చదువుకోక ,ఇటు అనారోగ్యంతో ఉంటూ రెండు విధాలా నష్టపోతారు.

తల్లిదండ్రులూ జాగ్రత్త

పిల్లల కోసం వేల రూపాయలు వెచ్చించి అనుక్షణం వారి ఉన్నతి కోసం



పరితపించే తల్లిదండ్రులు వారి ఆరోగ్యం విషయంలోనూ కొంత మేర కష్టపడాలి. ఇంట్లో వండిన ఆహారాన్నే వారికి ఇవ్వాలి. చిరుతిళ్లు కూడా ఇంటిపట్టున తయారు చేసినవే ఇవ్వాలి. రోజుకు ఒక పండు ఇవ్వాలి.

పాలు సంపూర్ణ ఆహారం .. కనీసం 200 మి.లీ పిల్లలకు ఇవ్వాలి.

ఉదయం ఉపాహారం హోటళ్ల నుంచి తెచ్చుకోవడం బాగా తగ్గించాలి.

వారాంతపు పార్టీలకు వెళ్తే నాణ్యమైన హోటళ్లను ఎంచుకోవాలిపాఠశాలకు పంపించే క్యారియర్లో పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి. బిస్కట్లు, చాక్లెట్ల బదులుగా ఇంట్లోనే తయారు చేసిన కారం చుట్టలో, మరమరాలో, తీపి పదార్థాల్లో ఇవ్వాలి. పాఠశాల నుంచి వచ్చిన తర్వాత నాణ్యమైన ప్రమాదకరం కాని చిరుతిళ్లు ఇవ్వాలి. ఇవి కూడా ఇంట్లోనే చేసినవి అయితే మరీ మంచిది. మన జాగ్రత్తే శ్రీరామరక్ష

అమ్మచేతి వంటకే ప్రాధాన్యం ఇవ్వాలి

అమ్మచేతి వంటలో ఎన్నో పోషక విలువలు ఉంటాయి. ఆరోగ్యకరమైంది కూడా. పిల్లలకు అమ్మచేతి వంటతో కలిగే లాభాలను వివరించాలి.

గ్యాస్టిక్, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి

–డా.సురేంద్రనాథ్‌రెడ్డి, చిన్నపిల్లల వెద్యనిపుణులు, ఆళ్లగడ్డ

పిల్లలు చిరుతిళ్లు అధికంగా తీసుకోవడం వల్ల గ్యాస్టిక్, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. బయట తయారు చేసే ఆహారాన్ని నిల్వ ఉంచేందుకు వాడే రసాయనాలు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. జీర్ణవ్యవస్థకు సంబంధించి ఐజీఎస్ (ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్) వస్తుంది. బయటి ఆహారంలో రంగుకోసం ప్రమాదకరమైన నిషేధించిన పదార్థాలను వాడుతుంటారు. వీటితో కాలేయ వ్యాధులు వస్తాయి. చిల్లీ,టమోటా సాస్‌లు, వెనిగర్ వంటివి స్థానికంగా నాసిరకం వస్తువులతో తయారు చేసినవే వినియోగిస్తుంటారు. మొత్తం మీద బయటి ఆహార పదార్థాలు అనారోగ్యాకారకాలుగానే పరిగణిస్తాం.


టీడీపీ కులాల మధ్య చిచ్చునిడుతోంది

వైసీపీ ఎమ్మెల్యే నారాయణస్వామి




నంద్యాల, మేజర్‌న్యూస్:ఉప ఎన్నికలో లబ్ధిపొందడం కోసం టీడీపీ నేతలు కులాల వారిగా విభజించి చిచ్చు పెడుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే నారాయణ స్వామి ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో మాలలు, మాదిగలను, బలిజను, ముస్లింలను విడదీస్తున్నారని మండిపడ్డారు. సొంత మామ నందమూరి తారక రామారావును దించిన చరిత్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదని, అలాంటి ఆయనకు ప్రజలకు ఓ లెక్కా అని అన్నారు. ఇప్పుడు ఎన్నికలు పెడితే 140 సీట్లు వస్తాయని పప్పు అయిన పంచాయతీ రాజ్ మంత్రి లోకేష్ అంటున్నారని, ఇలాంటి మాటలు కట్టిపెట్టి ముందు దమ్మూ, ధైర్యం ఉంటే పార్టీ ఫిరాయించి టీడీపీలో చేర్చుకున్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. గత ఎన్నికల్లో బీజేపీ, పవన్ కళ్యాణ్ ప్రచారం చేస్తేనే అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. భూమా అఖిలప్రియ వైఎస్ కుటుంబంపై అవాకులు, చవాకులు పేలితే నంద్యాల ప్రజలు మీకు గుణపాఠం చెబుతారని నారాయణ స్వామి హెచ్చరించారు.





సూర్య
హైదరాబాద్
శుక్రవారం
4 ఆగస్టు 2017





పచ్చని అందాల కూన తలకోన

శేషాచల కొండల వరుసలో తల బాగంలో వున్నందున ఈ పర్వత ప్రాంతాన్ని తలకోన అంటారు. ఇక్కడున్న జలపాతం ఎత్తు సుమారు మూడు వందల అడుగులు. దట్టమైన అడవి, ఎత్తన కొండలకు మధ్య నుండి జాలువారే జలపాతం పర్యాటకులకు అందమైన అనుభూతి కలిగిస్తుంది.

నెలకోన అందాలు చూడాల్సిందే:

తలకోన చేరుకోగానే మనకు దర్శనమిచ్చేవి సిద్దేశ్వరాలయము మరియు అమ్మవారు, విఘ్నేశ్వరుడు, సుబ్రమణ్యస్వామి ఆలయాలు. అలయానికి అతిసమీపముగా వాగు ఒకటి ఎల్లప్పుడూ ప్రవహిస్తూంటుంది. ఇందులోని నీరు చాల తేటగాను చాలా చల్లగాను ఉంటాయి. పర్యాటకులు తీసుకువెళ్లే వాహనాలను ఈ దేవాలయ ప్రాంతం వరకు మాత్రమే అనుమతిస్తారు. ఆపై జలపాతం వద్దకు చేరుకోవాలంటే నడకబాట పట్టాల్సిందే. సిద్దేశ్వరాలయము నుండి కొంత ముందుకు వెళితే నెలకోన, దిగువ ఝురి, ఎగువ ఝురి లకు వెళ్ళవచ్చు. ఈ మూడింటికీ చాలా ప్రాముఖ్యత ఉంది. నెలకోన అన్నది దట్టమైన కొండల మధ్య ఉంది. ఇక్కడి రెండు కొండల నడుమ ఒక నీటి ప్రవాహము వచ్చి ఒక కొలనులో దూకుతూ ఉంటుంది.

దేదీప్యమాన పుణ్యక్షేత్రం:

తలకోన ప్రకృతి శోభాయమానంతో అలరింపజేయడమే కాకుండా ఇదో పుణ్యక్షేత్రంగా దేదీప్యమానంగా మారుతోంది. ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం రోజున ఇక్కడ జరిగే ఉత్సవాలలో రాష్ట్రం నలుమూలల నుండి ప్రజలు, భక్తులు విశేష సంఖ్యలో హాజరవుతుండటంతో పాటు ప్రతి నిత్యం వందలాది సంఖ్యలో పర్యాటకులు తలకోనకు చేరుకుంటుంటారు.

అబ్బురపరిచే జలపాతం:

కొండ అంచుల్లో దట్టమైన అడవిగుండా దాదాపు రెండు కిలోమీటర్లు ముందుకు వెళితే అక్కడ జాలువారే జలపాతాన్ని మనం సందర్శించవచ్చు. రెండు కొండల మధ్య నుంచి జాలువారే జలపాత దృశ్యం బహు అద్భుతంగా ఉంటుంది. జలపాతానికి సమీపంలో కొంత ఎత్తువరకు ఆక్రమించిన బండరాళ్లపై పర్యాటకులు నిలబడి జలపాతం కింద తడవడానికి వీలవుతుంది. అలాగే జలపాతం కింద పడడం వల్ల ఆ ప్రాంతంలో ఏర్పడ్డ ఓ పెద్ద గుంటలాంటి ప్రదేశంలోని నీటిలో పర్యాటకులు హాయిగా ఈత కొడుతుంటారు.
ఈ అటవీ ప్రాంతంలో అనేక రకాల వృక్షాలు అనగా మద్ది, చందనం ఎర్ర చందనం వంటి వృక్షాలు అధికంగా వున్నాయి. అడవి కోళ్లు, నెమళ్లు, , దేవాంగ పిల్లి, ఎలుగులు, ముచ్చు కోతులు వంటి జంతు జాలం వున్నది. ఇక్కడికి కొంత మంది ఔత్సాహికులు ట్రెక్కింగ్ కొరకు కూడ వస్తుంటారు. ప్రకృతిని పక్షులను జంతువులను చూడడానికి అటవీ శాఖవారు ఇక్కడ ఎత్తయిన వాచ్ టవర్లను నిర్మించారు. వాటి పైకెక్కి చూడ వచ్చు.

తిరుపతి నుంచి ఆర్టీసీ సౌకర్యం:

తిరుపతి నుండి 49 కిలోమీటర్ల దూరంలో తలకొనకు బస్టాండ్ నుండి.ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. జాతీయ రహదారిపైన ఉన్న భాకరాపేట గ్రామం నుండి 24 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే తలకోన చేరుకోవచ్చు. భాకరాపేట నుంచి తలకోనకు నిత్యం ప్రయివేట్ వ్యాన్, ఆటోలు అందుబాటులో ఉన్నాయి.తలకోనలోని జలపాతాన్ని సందర్శించే పర్యాటకులు సాయంత్రం వరకు జలపాతం వద్ద గడిపి పొద్దుపోయే సమయానికి గుడివద్దకు చేరుకుంటారు.
తలకోనలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు అతిథి గృహాలు ఉన్నాయి. ఇందులో 12 గదులు ఉన్నాయి. అడ్వాన్స్ బుకింగ్ కోసం 08584-272425 నంబర్‌కు ఫోన్ చేసి రిజర్వేషన్ చేసుకోవచ్చు లేదా రాష్ట్రంలో ఎక్కడైనా పర్యాటకశాఖ కేంద్రాలు, అటవీశాఖ అధికారుల వద్ద గదులు బుక్ చేసుకోవచ్చు. డీలక్స్ గది అద్దె రూ. 500. అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వసతి గృహాలు, డార్మెటరీలు ఉన్నాయి. 4 లాట్లు ఉండగా ఇందులో 6 గదులతో పాటు డార్మెటరీ, సామూహిక బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే శాఖాహార, మాంసాహార భోజన సౌకర్యాన్ని అట వీశాఖ అందిస్తోంది.



రాయలసీమకే తలమానికం:

తలకోన.. రాయలసీమలోనే అతి సుందర పర్వత, పర్యాటక ప్రాంతం. దట్టమైన అడవి. 270 అడుగుల ఎత్తు నుంచి జాలు వారే జలపాతం. చల్లని గాలికి గలగల శబ్ధం చేస్తూ తలలూపే వృక్ష సమూహాలు.. పక్షుల కిలకిలరావాలతో నిండి ప్రకృతిలో మమేకమైన అందాల హరివిల్లు. కమనీయ దృశ్యాలే కాదు.. ఇదో వనమూలికల ఔషధాలయం. ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించే సిద్ధేశ్వరుడు సంతాన ప్రదాతగా విరాజిల్లుతున్నాడు. ఈ మలయ మారుతాల్ని ఆస్వాదించి సేదతీరాలంటే నేత్రమనోహరమైన ప్రకృతి పొదరిల్లును సందర్శించాల్సిందే.. తల కోన అందాలను వీక్షించే పర్యాటకులను సహజసిద్ధంగా 270 అడుగుల ఎత్తు నుంచి జాలువారే జలపాతం కనువిందు చేస్తుంది. తలకోనకు వచ్చే పర్యావరణ ప్రేమికులు ఈ జలపాతంలో స్నాన మాచిరించి ప్రత్యేక అనుభూతిని పొందుతారు. ఏడాది పొడవునా ఇక్కడ జలపాతం ప్రవహిస్తూనే ఉంటుంది. వర్షాకాలంలో మరింత ఉధృతంగా ఉంటుంది.



బోటింగ్, చిల్డ్రన్స్ పార్క్

తలకోనకు వచ్చే పర్యాటకులకు కొత్త అనుభూతిని కల్పించాలనే సంకల్పంతో అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలో బోటింగ్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా తలకోన ఏటిలో బోటింగ్‌కు అనువుగా కొలనులు ఏర్పాటు చేశారు. అలాగే చిన్నపిల్లల ఆటవిడుపు కోసం చిల్డ్రన్స్ పార్క్ ఉంది. మరోవైపు అటవీ అందాలను వీక్షించే పర్యాటకుల కోసం ప్రత్యేక వాహనాన్ని అందు బాటులోకి తెచ్చారు.

రామలక్ష్మణుల వృక్షాలు:

తలకోన శిరోద్రోణి తీర్థం (వాటర్ ఫాల్స్, ఝురి)కి వెళ్లే దారిలో రామలక్ష్మణుల మామిడి వృక్షాలు ఉన్నాయి. ఒకే పొడవుతో ఉన్న ఈ వృక్షాలను భక్తులు రామలక్ష్మణ వృక్షాలుగా పిలుస్తారు. వారు ఈ పర్వతాలపై సంచరించారనడా నికి గుర్తుగా ఈ వృక్షాలు ఉన్నట్లు భక్తుల నమ్మకం.

సుందరమైన నెలకోన: శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి 2 కిలోమీటర్ల దూరంలో జలపాతం మార్గంలో సుందరమైన నెలకోన ఉంది. నెలకోన ప్రాంతం నేత్ర మనోహరంగా ఉంటుంది. నెలకోనలో అంతు తెలియని విధంగా 20 అడు గుల ఎత్తు నుంచి కొండల నడుమ చిన్న జలపాతం ఉంది. ఈ నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు. చుట్టూ ఎత్తయిన పర్వతాల నడుమ హృాఎదయాన్ని పులకరింపజేసే లోయ ఉంది.

తలకోనకు ఇలా వెళ్లాలి: తలకోనకు తిరుపతి, పీలేరు నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. పీలేరు నుంచి 50 కిలోమీటర్లు, తిరుపతి నుంచి 49 కిలోమీటర్ల దూరంలో తలకోన ఉంది. భాకరాపేట నుంచి 26 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే తలకోన చేరుకోవచ్చు. భాకరాపేట నుంచి తలకోనకు నిత్యం ప్రయివేట్ వాహనాలు అందుబాటులో ఉన్నాయి.

తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయం: తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని క్రీ.శ. 16వ శతాబ్దం లో వనం అప్పస్వామి దీక్షితులు (సిద్ధి యోగి) నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో సిద్ధయోగులు, మునులు తపస్సు చేసి కైలాస అధిపతి శంకరుని అనుగ్రహం పొందారని ప్రతీతి. దీంతో సిద్ధ యోగులు శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయం నిర్మాణానికి సంకల్పించారు.

బోటింగ్, చిల్డ్రన్స్ పార్క్: తలకోనకు వచ్చే పర్యాటకులకు కొత్త అనుభూతిని కల్పించాలనే సంకల్పంతో అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ గెస్ట్ హౌస్ సమీపంలో బోటింగ్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా తలకోన ఏటిలో బోటింగ్‌కు అనువుగా కొలనులు ఏర్పాటు చేశారు. అలాగే చిన్నపిల్లల ఆటవిడుపు కోసం చిల్డ్రన్స్ పార్క్ ఉంది. మరోవైపు అటవీ అందాలను వీక్షించే పర్యాటకుల కోసం ప్రత్యేక వాహనాన్ని అందు బాటులోకి తెచ్చారు. ఇవన్నీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

శిరోద్రోణి తీర్థం

తలకోన శేషాచల పర్వతంలో ఉంది. శ్రీశైలం వద్ద పర్వత చివరిభాగం ఉండగా, తలకోన, తిరుమల గిరిలు శేషాచల పర్వతాల తలభాగంగా ఇతిహాసాల్లో పేర్కొన్నారు. ఎడమవైపు భాగంగా శిరోద్రోణి తీర్థంగా (ఝురి), కుడివైపు తిరుమల వద్ద పాపవినాశంగాను ఈ తీర్థంలో భక్తులు తరిస్తుంటారు. శిరోద్రోణి తీర్థానికి వెళ్లే దారిలో అటవీశాఖ స్నాన ఘట్టాన్ని ఏర్పాటు చేసింది. శిరోద్రోణికి వెళ్లలేని పెద్దలు, చిన్నారులు ద్రోణితీర్థం నుంచి పారే గంగా జలం లో స్నానమాచరించి శివుని దర్శించుకుంటారు.

గిల్లతీగ: భా ం త్ దేశంలోనే అరుదైన, అత్యంత పొడవైన గిల్లతీగ తలకోనలో చూపరులను ఆశ్చర్యపరుస్తోంది. ఝురికి వెళ్లే మార్గంలో కుడివైపు నెలకోన మార్గంలో గిల్లతీగ ఉంది. దీని శాఖోపశాఖల పొడవు 5 కిలోమీటర్లు, చుట్టు కొలత 260 సెంటీమీటర్లు, దీని కాయలు 100 సెంటీమీటర్లు పొడవు ఉంటాయి. దీని బెరడును కొన్ని మందుల తయారీకి వినియోగిస్తారు. తీగ జాతుల్లో గిల్లతీగ అత్యంత పొడవైనదిగా అటవీశాఖ గుర్తించింది.


వసతి సౌకర్యాలు: నిత్యం పర్యాటకులతో కిటకిటలాడే తలకోనలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు అతిథి గృహాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ 12 గదులు ఉన్నాయి. అడ్వాన్స్ బుకిం గ్ కోసం 08584-272425 నంబర్‌కు ఫోన్ చేసి రిజర్వేషన్ చేసుకోవచ్చు. డీలక్స్ గది అద్దె రూ. 500. అటవీ శాఖ






ఆధ్వర్యంలో ప్రత్యేక వసతి గృహాలు, డార్మెటరీలు ఉన్నా యి. 4 లాట్లు ఉండగా ఇందులో 6 గదులతో పాటు డార్మెంటరీ, సామూహిక బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. అలాగే శాఖాహార, మాంసాహార భోజన సౌకర్యాన్ని అట వీశాఖ అందిస్తోంది.

కనుమరుగైన కెనపీ వాక్: డార్జిలింగ్ తర్వాత తలకోనలో అటవీశాఖ కెనపీ వాక్ (చెట్లపై నడక) సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా అటవీ అధికారులు దీనిని నిర్మించారు. కెనపీ వాక్ ఏర్పాటుకు అత్యంత పొడవైన జాలరి చెట్లను ఆధారంగా చేసుకున్నారు. 240 మీటర్లు పొడవునా భూమికి 40 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన కెనపీ వాక్ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేది. అయితే కెనపీ వాక్ వల్ల జాలరి చెట్లు శిథిలమయ్యే ప్రమాదం పొంచి ఉండడంతో ఏడాది క్రితం అటవీ అధికారులు దీన్ని తొలగించారు.







శిరోద్రోణి తీర్థం: తలకోన శేషాచల పర్వతంలో ఉంది. శ్రీశైలం వద్ద పర్వత చివరిభాగం ఉండగా, తలకోన, తిరుమల గిరిలు శేషాచల పర్వతాల తలభాగంగా ఇతిహాసాల్లో పేర్కొన్నారు. ఎడమవైపు భాగంగా శిరోద్రోణి తీర్థంగా (ఝురి), కుడివైపు తిరుమల వద్ద పాపవినాశంగాను ఈ తీర్థంలో భక్తులు తరిస్తుంటారు. శిరోద్రోణి తీర్థానికి వెళ్లే దారిలో అటవీశాఖ స్నాన ఘట్టాన్ని ఏర్పాటు చేసింది. శిరోద్రోణికి వెళ్లలేని పెద్దలు, చిన్నారులు ద్రోణితీర్థం నుంచి పారే గంగా జలం లో స్నానమాచరించి శివుని దర్శించు కుంటారు.

cinema@suryaa.com

సూర్య సినిమా

సూర్య
హైదరాబాద్
శుక్రవారం
4 ఆగస్టు 2017



సాహోను ఎంజాయ్ చేస్తున్న ప్రభాస్

సుజీత్ దర్శకత్వంలో బాహుబలి ప్రభాస్ తదుపరి చిత్రం సాహో అని తెలిసిందే. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోందనే విషయం కూడా విదితమే. అయితే ఈ చిత్రం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ మాట్లాడారు. తను నటిస్తున్న సాహో చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు ఇప్పటి వరకు ఏ తెలుగు సినిమాలో లేని విధంగా ఉంటాయని కథానాయకుడు ప్రభాస్ అన్నారు. ఆయన హీరోగా అందరూ అనుకుంటున్నట్లు సాహో సైన్స్ ఫిక్షన్ సినిమా కాదు. ఇది హైటెక్‌గా ఉంటుంది. తెలుగు సినిమాలో ఇంత వరకు లేని విధంగా ఇందులో యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి. హాలీవుడ్ యాక్షన్ డెరెక్టర్ కెన్నీ గేట్స్ పోరాట సన్నివేశాల్ని కంపోజ్ చేస్తున్నారు. కచ్చితంగా అభిమానుల్ని ఈ సన్నివేశాలు థ్రిల్ చేస్తాయి. యాక్షన్ సీన్లు అద్భుతంగా ఉండేలా సాహో టీం సినిమాను తీస్తోంది. ఈ సినిమా షూట్‌ను చాలా ఏంజాయ్ చేస్తున్నా అని ప్రభాస్ తెలిపారు.

ఇంత వరకు సాహోలో కథానాయిక ఎవరన్నదీ ప్రకటించ లేదు. దాదాపు రూ. 150 కోట్ల బడ్జెట్‌తో దీన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు విశేషమైన స్పందన లభించిన సంగతి తెలిసిందే.



ఫిల్మ్ సిటీలో బాలయ్య 102వ చిత్రం ప్రారంభం

నటసింహ నందమూరి బాలకృష్ణ 102వ చిత్రం రామోజీ ఫిల్మ్ సిటీలో లాంఛనంగా ప్రారంభమైంది.. ఈ మూవీకి సీనియర్ దర్శకుడు కె.ఎస్ రవి కుమార్ డైరెక్టర్..నిర్మాత సి కళ్యాణ్ ముందుగా ఈ మూవీ పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు.. అనంతరం ముహూర్తపు షాట్ కు దర్శకుడు బోయపాటి శ్రీను క్లాప్ కొట్టారు.. చిత్ర ప్రారంభోత్సవానికి డైరెక్టర్ క్రిష్, ఎస్వీ కృష్ణారెడ్డి, అంబిక కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ కల్యాణ్ మాట్లాడుతూ, నెలాఖరు వరకూ రామోజీ ఫిల్మ్ సిటీలో, ఆపై తమిళనాడులోని కుంభకోణంలో షూటింగ్ చేస్తామన్నారు. ఆ తరువాత వైజాగ్, హైదరాబాద్ లో సినిమాను పూర్తి చేస్తామని వెల్లడించారు..ఈ మూవీని సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు ముందు గానే ప్రకటించారు. ఎఈ చిత్రంలో బాలయ్య సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న. ప్రకాష్ రాజ్, బ్రహ్మానందం, అశుతోష్ రాణాలతో పాటు పంజాబ్ చిత్ర సీమలో టాప్ హీరోగా ఉన్న నటుడు విలన్ గా నటించనున్నాడు.



ఫిదా పోరి రేటు పెంచేసిందట

ఫిదా చిత్రం అనగానే గుర్తొచ్చే పోరీ సాయి పల్లవి. ఈ చిత్రంలో తను చేసిన బాన్సు వాడ పాత్ర భానుమతి తెలంగాణ యాసలో సొంత గొంతుతో, అందమైన ముఖకవళికలతో కుర్రకారుల మతి పోగొట్టేసింది. మొన్నటి దాకా ఒక మళయాళ నటిగా మాత్రమే గుర్తించుకున్న ప్రతి ఒక్కరినీ ఒక్కసారిగా తన వైపుకు తిప్పేసుకుని ఫిదా అయ్యేలా చేసింది. సినీ పరిశ్రమలో హీరోలు రాజ్యాలు ఏలుతున్నారు అనే భావనను మార్చేసింది. అదే ఫిదా రూపంలో ఇప్పుడు మనకు కనిపిస్తుంది. ఈ చిత్రం ఈ రోజు ఇంత పెద్ద విజయం సాధించిందంటే కారణం సాయిపల్లవి అనడంలో ఆశ్చర్యమే లేదు. శేఖర్‌కమ్ముల కూడా తన సినిమాకు గుండె సాయిపల్లవి అయితే బాడీ వరుణ్ తేజ్ అన్నాడు. ఈ ఒక్క మాట చాలు సినిమాకు సాయి చేసిన కృషి ఏంటో చెప్పడానికి. ఇక ఇప్పుడు ఈమెకు ఫుల్ క్రేజ్ పెరిగిపోయింది. నానితో ఎంసిఏ సినిమాలో నటిస్తుంది ఈ ముద్దుగుమ్మ. ఈ చిత్రంతో పాటు నాగశౌర్య సినిమాలోనూ నటిస్తుంది. వీటిలో ఎంసిఏ షూటింగ్ నడుస్తుంది.. మరోటి పూర్తయ్యింది. ఫిదా.. ఎంసిఏ సినిమాలకు 30 వరకే తీసుకున్న సాయిపల్లవి.. ఇప్పుడు డబుల్ రెమ్యునరేషన్ తీసుకుంటుందని చెప్పుకుంటున్నారు. ఈమెకు ఇవ్వడంలో కూడా తప్పు లేదని భావిస్తున్నారు నిర్మాతలు. ప్రస్తుతం ఈ భానుమతికి ఉన్న డిమాండ్ కు కోటిచ్చినా తక్కువే అంటున్నారు. మరో రెండు సినిమాలు హిట్టైతే భాన్సువాడ భానుమతి టాప్ రేంజ్ కు వెళ్లిపోవడం గ్యారంటీ..

సంతోషం 15 అవార్డ్స కర్టెన్ రైజర్ వేడుక

కొండేటి సురేష్ 15 ఏళ్ళ క్రితం ఆగస్టు 12న ప్రారంభించిన సంతోషం అవార్డ్స వేడుక విజయవంతంగా జరుపుకుంటూ 16 వ సంవత్సరం లోనికి అడుగెడు తున్న సంధర్భంగా బుదవారం సాయంత్రం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి అతిథులుగా విచ్చేసిన రెజీనా, హెబ్బా పటేల్, మా ప్రెసిడెంట్ శివాజీ రాజా, హీరో ఆది ల చేతుల మీదుగా సంతోషం అవార్డ్స వేడుకకు సంబంధించిన టికెట్ ను విడుదల చేయించారు. అనంతరం రెజీనా మాట్లాడుతూ నేను తెలుగు ఇండస్ట్రీ కు వచ్చిన తరువాత అందుకున్న మొదటి అవార్డ్ సంతోషం అవార్డ్. ఒకె వ్యక్తి ఏకదాటిగా 15 సంవత్సరాల పాటు సురేష్ కొండేటి గారు ఎలా కష్టపడి చేస్తున్నాడో అర్థం కావడంలేదు. అతని కష్టానికి తగ్గట్టుగానే విజయవంతం అవుతోంది. ఈ ఏడాది సంతోషం అవార్డ్ అందుకుంటున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియచేస్తున్నా అన్నారు. ప్రతి ఏడాది సంతోషం అవార్డ్స ను ప్రోత్సహిస్తున్న , నాకు సహక రిస్తున్న ప్రతి ఒక్కరికీ నా ధన్యవాదాలు అన్నారు సంతోషం మాగ్జిన్ అధినేత సురేష్ కొండేటి..



సౌత్‌కి గ్రీన్‌సిగ్నల్

అంటే ప్రియాంకా చోప్రా సౌత్ సినిమాలో కథానాయికగా నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనుకుంటున్నారా? అది కాదు. అసలు విషయం వేరే ఉంది. కథానాయికగా సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోన్న ప్రియాంకా చోప్రా భోజ్‌పురి, మరాఠీ, పంజాబీ భాషల్లో సినిమాలు నిర్మిస్తున్నారు.

మరాఠీలో ఆమె నిర్మించిన వెంటిలేటర్ కథ సౌత్‌కి తగ్గట్టుగా ఉంటుందని, మలయాళంలో రీమేక్ చేస్తే బాగుంటుందనీ ఫ్రెండ్స్ సలహా ఇస్తే, ప్రియాంక సై అన్నారట. మల యాళంలో కంటెంట్ బేస్డ్ మూవీస్ వస్తుంటాయి. వెంటిలేటర్ రీమేక్ పనులన్నీ నిర్మాతగా నేను దగ్గరుండి చూసుకోబోతున్నా. ఇంకా దర్శకుడు, నటీ నటులను ఖరారు చేయలేదు అని ప్రియాంక తల్లి మధు చోప్రా పేర్కొన్నారు.



నేనేరాజునేనేమంత్రి జోగేంద్ర యువగర్జన కార్యక్రమం


డా.డి.రామానాయుడు సమర్పణలో తేజ దర్శకత్వంలో సురేశ ప్రొడక్షన్స్ మరియు బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం నేనే రాజు నేనే మంత్రి. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి డి. సురేశ్‌బాబు, ఎం.వి.కిరణ్ రెడ్డి, సి. భరత్ చౌదరి వివేక్‌లు నిర్మాతలు. ఈ నెల 11న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి జోగేంద్ర యువగర్జన కార్యక్రమం హైదరాబాద్ లో బుధవారం సాయంత్రం జరిగింది. వెంకటేశ్ అభిమానుల సతీమణులు పూర్ణ ఆధ్వర్యంలో సుఖీభవ సాంగ్ లాంచ్ చేశారు.

పిదప రానా మాట్లాడుతూ సినిమాల పరంగా, వ్యక్తిగతంగా, జీవితపరంగా నందమూరి తారకరామారావుగారంటే నాకు దేవుడులాంటివారు. ఎన్టీఆర్‌గారి, ఎంజీఆర్‌గారి ఫిలాసఫీలు జోగేంద్ర అనే పాత్రలో ఉంటాయి. అందుకే ఈ సినిమా చేశా. ఈ సినిమా నాకు చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయిన సినిమా. ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ఈ సినిమా గురించి నేను చాలా గర్వంగా ఉన్నా. ఈ సినిమాను మా తాత చూడలేకపోయారనే లోటు ఉంది. ఈ రోజు ఈ వేదిక మీద నిలబడ్డామంటే ఆయన వల్లే. ఆయనతో సినిమా చేయలేదనే బాధ ఉండేది. నాకు తెలిసి ఆయన వెళ్లిపోయాక చాలా పాజిటివ్స్ జరుగుతున్నాయి. పైనుంచి ఆయనే సెట్ చేస్తున్నారని అనిపిస్తోంది. మా నాన్నతో ఫస్ట్ టైమ్ కలిసి చేశాం. మా నాన్న రియలీ గుడ్ ప్రొడ్యూసర్. సినిమా మీద తేజగారికున్న అవగాహన చాలా ఎక్కువ. ఇది జోగేంద్ర జీవిత చరిత్ర. అది రాయాలంటే జీవితంపై అవగాహన ఉండాలి. లేకుంటే రాయలేరు. వెంకటేశ్‌గారి అభిమానులు నాకు తోడు ఉన్నారన్న ధైర్యంతోనే నేను అన్నీ చేస్తున్నా. ఇదే సపోర్ట్ ఇస్తే హాలీవుడ్ సినిమా కూడా చేస్తాను. ప్రతి సినిమా చేస్తున్నప్పుడు కొత్తగా చేయాలని ఉంటుంది. ప్రతి క్యారెక్టర్ కొత్తగా ఉండాలని అనుకుంటా. ఈ సినిమాలో చాలా స్మార్ట్ కనిపిస్తాను, లావుగా కూడా కనిపిస్తాను. కండ్లు కూడా తిరిగి ఉంటాయి. త్వరలోనే యువత కోసం భారీ కార్యక్రమం చేస్తాం. ఈ నెల 11న విడుదల చేస్తాం అని తెలిపారు. తేజ మాట్లాడుతూ రానా గారికి కథ చెప్పగానే ఆయనకి నచ్చిందని చేశాం. రానా అంత పొడవుగా ఉన్న అమ్మాయి కావాలని కాజల్‌గారి దగ్గరకు వెళ్లాం. స్టైలిష్ కేరక్టర్ కోసం కేథరిన్‌ని తీసుకున్నాం. కొత్తోళ్లతో సినిమా చేసి బోర్ కొట్టిందని పాత వాళ్లతో తీశా అని చెప్పారు.



గౌతమ్ నంద విజయోత్సవ వేడుక

శ్రీ బాలాజీ సినీ మీడియా సమర్పణలో సంపత్ నంది దర్శకత్వం వహించిన గౌతమ్ నంద జె. భగవాన్, జె పుల్లారావు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం గత వారం 28న విడుదలయ్యి విజయవంతంగా థియేటర్లలో నడుస్తుండం తో ఈ చిత్ర యూనిట్ గురువారం బ్లూ ఫాక్స్ లో విజయోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత జె. భగవాన్ మాట్లాడుతూ మా గౌతమ్ నంద చిత్రం విడుదలయ్యి ఎనిమిది రోజులు అవుతున్నా సక్సెస్ ఫుల్ గా నడుస్తోంది, ఈ ఎనిమిది రోజులకు గాను మొత్తం 22,2547,437 రూపాయల కలెక్షన్ వచ్చింది, ఇక పై సెలవలు కూడా ఉండటం తో కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉంది, మా ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ మా కృఎతజ్ఞతలని తెలిపారు, అనంతరం దర్శకుడు సంపత్ నంది మాట్లాడుతూ పాత కథనే కొత్తగా చూపించాను, ఇంతకముందు నేను చేసిన సినిమా ల కంటే ఈ గౌతమ్ నంద చిత్ర కథ నాకు తృఎప్తినిచ్చింది, చిత్రం చూసిన ప్రతిఒక్కరూ డైలాగ్స్ కు కొన్ని సన్నివేశాలకు కనెక్ట్ అయ్యి స్వయంగా నాకు మెసేజెస్ పెడుతున్నారు, ఒక దర్శకుడి గా నాకు ఇంతకంటే ప్రశంస లేదనుకుంటున్నాను, సినిమా ను ఆదరిస్తున్న ప్రతి ప్రేక్షకునికి నా కృఎతజ్ఞతలని తెలిపారు, ఇక హీరో గోపి చంద్, హీరోయిన్ క్యాథరిన్ లు తమ కృఎతజ్ఞతలను తెలిపారు.



స్నేహానికి సరికొత్త నిర్వచనం

న్యూఢిల్లీ : కాలేయ వ్యాధితో బాధ పడుతున్న స్నేహితురాలిని ఫేస్‌బుక్‌లో చూసి గుర్తించిన స్నేహితుడు వెంటనే ఆమెను చేరుకుని, కాలేయ దానం చేసి ఆమె ప్రాణాలు రక్షించాడు. ఢిల్లీలో జరిగిందీ ఘటన. ఢిల్లీకి చెందిన పూజా భట్నాగర్ (44) గత 17 ఏళ్లుగా కాలేయ సమస్యతో బాధ పడుతున్నారు. ఇక మందులతో ఆమె బతకడం కష్టమని లివర్ మార్పిడి ఒక్కటే పరిష్కారమంటూ వైద్యులు చేతులు ఎత్తేశారు. దీంతో కుటుంబ సభ్యులు కాలేయ దానం చేసే వారి కోసం బంధువుల్లో ప్రయత్నించారు. అయితే, ఎవరి కాలేయమూ ఆమెకు సరిపోదని తేలింది. దీంతో భట్నాగర్ ఫేస్‌బుక్ పేజీ ద్వారా కాలేయం కోసం అభ్యర్థించారు. తన ప్రాణాలు కాపాడమంటూ ఫేస్‌బుక్‌లో భట్నాగర్ వేడుకోలును చూసి చలించిపోయిన చెన్నైలో ఉంటున్న ఆమె పాత స్నేహితుడు ప్రసన్న గోపీనాథ్ వెంటనే ఢిల్లీ చేరుకుని తన కాలేయం ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాడు. ఆపరేషన్ కోసం కొందరు నిధులు పోగు చేయడంతో జూలై 21న సాకేత్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో కాలేయ మార్పిడిని వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా భట్నాగర్‌తో తనకు ఉన్న స్నేహాన్ని గోపీనాథ్ గుర్తు చేసుకున్నాడు. 2007లో అంటే పదేళ్ల క్రితం వేల్స్‌లోని గ్లామోర్గాన్ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు తాను పూజా దంపతులతో కలసి ఫ్లాట్‌ను షేర్ చేసుకున్నట్టు తెలిపారు. ఆమె తనకు కుటుంబ సభ్యుల వంటి వారని పేర్కొన్నారు. ఆమె అంత బాధలో ఉందని తెలిసి తాను ఎలా చూస్తూ ఉండగలనని ప్రశ్నించారు. 34 ఏళ్ల గోపీనాథ్ ప్రస్తుతం చెన్నైలో శునకాల శిక్షకుడిగా ఉన్నారు. బ్రిటన్‌లో విద్యాభ్యాసం పూర్తయిన తరువాత 2009లో ఇండియాకు తిరిగి వచ్చారు. భారత్‌కు వచ్చిన తరువాత గురుగ్రామ్‌లో ఉంటున్న భట్నాగర్‌తో టచ్‌లో ఉండేవారు. కాగా, లివర్ ఇచ్చేందుకు గోపీనాథ్ ముందుకు వచ్చినా ఆపరేషన్ కోసం రూ. 25 లక్షలు అవసరమైందని, అంత డబ్బు తన వద్ద లేదని పూజ భర్త అనురాగ్ భట్నాగర్ పేర్కొన్నారు. అయితే, గురుగ్రామ్‌లోని పూజ విద్యార్థులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అందరూ కలసి నిధులు సేకరించారని, ప్రపంచవ్యాప్తంగా మొత్తం 363 మంది డబ్బులు పంపడంతో ఆపరేషన్ పూర్తయిందని వివరించారు. ఒకటి రెండు రోజుల్లో పూజ ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకోనున్నారు. స్నేహితురాలికి తన లివర్ ఇచ్చి ప్రాణాలు కాపాడిన గోపీనాథ్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి.

మరోసారి మసూద్ అజహర్‌ను వెనకేసుకొచ్చిన చైనా

- ఉగ్రవాది మృతదేహాన్ని తీసుకునేందుకు నిరాకరించిన పాక్
- సరిహద్దుల్లో 8 నెలల్లోగా అంగుళం కూడా వదలకుండా స్మార్ట్ ఫెన్స్
- అంతర్జాతీయ సరిహద్దుల వెంట స్మార్ట్ ఫెన్స్
- పాక్ నుంచి కాశ్మీర్‌లో కల్లోలం రేపేందుకు వచ్చిన లష్కరే తాయిబా చీఫ్ కమాండర్ అబూ దుజాన
- అమ్మాయిలే ఉగ్రవాదులను పట్టిస్తున్నారా?



న్యూఢిల్లీ : ఐక్యరాజ్య సమితి : జైషే మహమ్మద్ చీఫ్ మౌలానా మసూద్ అజహర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించకుండా మరోసారి చైనా మోకాలొడ్డింది. మసూద్‌ను ఉగ్రవాదిగా ప్రకటించాలని, గత సంవత్సరం మార్చిలో భారత్ చేసిన విజ్ఞప్తికి 15 దేశాల ఐక్యరాజ్య సమితి కమిటీలో 14 దేశాలు అంగీకరించిన వేళ, చైనా సాంకేతిక కారణాలు చూపుతూ అడ్డుకున్న సంగతి తెలిసిందే. అప్పట్లో ఆగస్టు 2లోగా చైనా తన నిర్ణయాన్ని ప్రకటించాలని యుఎస్ ఆదేశించింది. ఆ తేదీ ముగియడానికి గంటల ముందు తమకు మరి మూడు నెలల సమయం కావాలనిచైనా కోరింది. చైనా ఈ పొడిగింపు గడువును కోరు కోకుండా ఉంటే మసూద్ అజహర్ ఆటోమేటిక్‌గా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటింపబడి ఉండేవాడు. ఈ డెడ్‌లైన్ ముగింపు దశకు వచ్చిన వేళ, ఉగ్రవాదికి మద్దతు పలికేలా చైనా తీసుకున్న నిర్ణయాన్ని భారత్ ఆక్షేపించింది. కాగా, ఇండియాలో పలు ఉగ్ర దాడులకు సూత్రధారిగా ఉన్న మసూద్ అజహర్ ను తమకు అప్పగించాలని, లేదంటే, అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించాలని భారత్ చాలా కాలంగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

భారత్, పాకిస్తాన్ సరిహద్దుల్లో అంగుళం కూడా వదలకుండా 2018 మార్చి నాటికి స్మార్ట్ ఫెన్స్‌ను ఏర్పాటు చేయడాన్ని తదుపరి తక్షణ లక్ష్యం గా భావించి, పనులు పూర్తి చేయనున్నామని సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ కేకే శర్మ వెల్లడించారు. న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, ముఖ్యంగా జమ్మూ సెక్టార్‌లో సరిహద్దుల మూసివేత పనులను చేపట్టాల్సి ఉందని అన్నారు. బంగ్లాదేశ్ వైపు పెద్దగా ప్రమాదమేమీ లేదని, పాక్ సరిహద్దులే కీలకమని వ్యాఖ్యానించిన ఆయన, ఈ ప్రాంతం నుంచి ఎవరు చొరబడినా, భారత్‌కు ప్రమాదమేనని అభిప్రాయపడ్డారు. అమరులైన బిఎస్ఎఫ్ జవాన్ల కోసం వచ్చే అక్టోబర్‌లో హాఫ్ మారథాన్‌ను నిర్వహించనున్నామని తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దుల వెంట స్మార్ట్ ఫెన్స్ ఏర్పాటు పనులు సాగుతున్నాయని, జమ్మూ సెక్టార్ వరకూ పనులు మరి ఎనిమిది నెలల్లో పూర్తవుతాయని చెప్పారు. భారత్, బంగ్లా సరిహద్దుగా ఉన్న సుమారు 4,096 కిలో మీటర్ల పొడవునా ఇదే తరహా ఫెన్సింగ్ ఉంటుందా అన్న ప్రశ్నకు తాము ప్రాధాన్యతాపూర్వకంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు.

పవిత్ర యుద్ధం పేరుతో ఉగ్రవాదులుగా మారేవారు కుక్కచావు చస్తారనే విషయాన్ని పాకిస్తాన్ మరోసారి నిరూపించింది. పాక్ నుంచి కాశ్మీర్‌లో కల్లోలం రేపేందుకు వచ్చిన లష్కరే తాయిబా చీఫ్ కమాండర్ అబూ దుజాన మృతదేహం తమకు అక్కరలేదని పాకిస్తాన్ స్పష్టం చేసింది. పుల్వామా జిల్లాలో భార్యతో గడిపేందుకు వచ్చిన దుజానాను భద్రతా బలగాలు మట్టుబెట్టిన సంగతి తెలిసిందే. అనంతరం అతని మృతదేహాన్ని తీసుకువెళ్లాలని కోరుతూ జమ్ము కాశ్మీర్ పోలీసులు పాక్ హైకమిషన్‌కు లేఖ రాశారు. అయితే, దానిని పాక్ అధికారులు తిరస్కరించారు. అతని మృతదేహాన్ని తీసుకుంటే, అతను పాకిస్తానీ అని, ఉగ్రవాదాన్ని పెంచి పోషించేది పాకిస్తానే అని ప్రపంచ దేశాలకు స్పష్టంగా నిర్ధారణ అవుతుంది. అలా జరగకుండా జాగ్రత్త పడడంలో భాగంగా పాక్ అతని మృతదేహం తీసుకునేందుకు నిరాకరించింది. ఇక, అతని స్థానంలో కొత్త కమాండర్‌ను నియమించేందుకు లష్కరే వర్గాలు సన్నాహాలు చేపట్టినట్టు తెలుస్తోంది. కొత్త చీఫ్ కమాండర్‌గా బాధ్యతలను అమర్‌నాథ్ యాత్రికులపై దాడికి పాల్పడిన మహ్మద్ అబూ ఇస్మాయిల్‌కు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఉగ్రవాదులు కాశ్మీర్‌లోని యువతులతో సంబంధాలు పెట్టుకోవడం తమకు కలసి వస్తోందని భద్రతా బలగాలు పేర్కొంటున్నాయి. ఈ మధ్య కాలంలో ఎన్‌కౌంటర్‌లో హతమైన ఉగ్రవాదులు బుర్హాన్ వనీ, అబూ తల్హా, అబ్దులా యుని, ఇప్పుడు తాజాగా అబు దుజానా వీరంతా ఏదో రకంగా కాశ్మీర్ అమ్మాయిలతో సంబంధాలు నెరిపేందుకు ఉత్సాహం చూపినవారే. జీహాద్ (పవిత్ర యుద్ధం) కోసం అన్నీ వదిలేశామని, త్యాగాలతో అల్లా కోసం పోరాడుతున్నామని చెప్పుకునే ఉగ్రవాదులు వివిధ ప్రాంతాలకు తిరుగుతూ దాడులు చేస్తుంటారు. అయితే, వీరు వివాహం రూపంలో కానీ, ఇతర పద్ధతుల్లో కానీ అమ్మాయిలతో బంధాలు పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రాంతాలకు చెందిన యువతులను వివాహం పేరుతో వంచించడం, లొంగదీసుకోవడం వంటి చర్యల ద్వారా సంబంధాలు నెరపుతున్నారు. దీంతో సదరు మహిళలే ఉగ్రవాదులకు చెందిన సమాచారాన్ని తమకు అందిస్తున్నారని భద్రతా బలగాలకు చెందిన ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అబూ దుజానా కూడా ఇలాగే హతమయ్యాడని ఆయన పేర్కొన్నారు.

ప్రణబ్ దా : మీరు నాకు తండ్రితో సమానం


మాజీ రాష్ట్రపతికి ప్రధాని మోడీ లేఖ



న్యూఢిల్లీ : 'మూడేళ్ల క్రితం నేను ఢిల్లీ వచ్చాను. నా ముందు చాలా లక్ష్యాలు ఉన్నాయి. వాటిని సాధించడంలో ఒక తండ్రిలా మీరు నా వెంటే ఉన్నారు' అంటూ ప్రధాని నరేంద్ర మోడీ తనకు రాసిన లేఖను మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్రపతిగా తన చివరి రోజున మోడీ రాసిన ఈ లేఖ తన మనసును హత్తుకుందని ప్రణబ్ తెలియజేశారు. 'వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందినా, భావనలు వేరైనా, మీ వివేకం వల్లే మనం కలసి పని చేయగలిగాం. మీ మార్గదర్శకం, వ్యక్తిగత ఆత్మీయతలు నాలో నమ్మకాన్ని పెంపొందించాయి. మీరు ఒక జ్ఞాన నిధి. మీ తెలివితేటలు, బుద్ధి కుశలత నాకు, నా ప్రభుత్వానికి అండగా ఉన్నాయి' అని మోడీ లేఖలో పేర్కొన్నారు. ప్రణబ్ స్వార్థం లేకుండా ప్రజల కోసం పాటుపడే రాజకీయ నాయకుల కోవకు చెందినవారని, ఆయన వంటి రాష్ట్రపతిని పొందినందుకు దేశం గర్వపడుతోందని మోడీలేఖలో తెలియజేశారు. అలాగే ప్రభుత్వ పాలనలో తనకు అండగా ఉన్నందుకు మోడీ కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా దేశ అభివృద్ధిలో తనకు మార్గదర్శకం చేయాలని ఆయన ప్రణబ్‌ను కోరారు. ప్రణబ్ ట్వీట్ చేసిన లేఖపై కూడా మోడీ స్పందించారు. 'ప్రణబ్ దా! మీతో పనిచేయడం నాకు ఎప్పటికీ ఆనందమే' అని మోడీ ట్వీట్ ద్వారా బదులు చెప్పారు.

స్వాతంత్ర్యం తరువాత కాంగ్రెస్‌ను మూసేయాలని గాంధీ చెప్పారు

- ఇప్పుడు మరో గాంధీ ఆ పని చేస్తున్నారు
- రాహుల్‌పై అమిత్ షా విసుర్లు



రోహ్‌తక్ : కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. హర్యానాలోని రోహ్‌తక్‌లో ఆయన ప్రజలను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీని మూసేయాలని మహాత్మా గాంధీ కోరారని, అయితే ఇప్పుడు ఆ పనిని కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ చేస్తున్నారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రశంసించిన అమిత్ షా వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని, దేశాన్ని మరింత అభివృద్ధి చేస్తుందని జోస్యం చెప్పారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంతంలో అభివృద్ధి చేసిందని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉండగా అభివృద్ధి రేటు గణనీయంగా పడిపోయిందని అన్నారు. మళ్లీ ఈ ప్రాంతం (హర్యానా)లో బీజేపీ అధికారంలోకి వస్తే మళ్లీ అభివృద్ధి పట్టాలు ఎక్కుతుందని అమిత్ షా సూచించారు.

బీహార్‌లో రైలు హైజాక్ మావోయిస్టులు, పోలీసుల మధ్య కొనసాగుతున్న కాల్పులు!



లఖిసరాయ్ : బీహార్‌లోని లఖిసరాయ్ జిల్లాలో గురు వారం తెల్లవారు జామున మావోయిస్టులు ఓ రైలును హైజాక్ చేశారు. అనంతరం ఆ ప్రాంతం లోని మొబైల్ టవర్‌ను ధ్వంసం చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతం లో సీఆర్‌పీఎఫ్, మావో యిస్టుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకైతే రెండు వైపుల నుంచి ఎటువంటి ప్రాణ నష్టం లేదు. దానాపూర్ దుర్గ్ ఎక్స్‌ప్రెస్ రైలు (13288) భలుయి స్టేషనల్ వద్ద గురు వారం తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో హైజాక్ అయినట్టు సీఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు. అలాగే కేబిన్ మ్యాన్‌ను అపహరిం చినట్టు పేర్కొన్నారు. ఇరు వర్గాల మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది.

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో 'నోటా' ఉంటుంది : సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ : గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో 'పైవారు ఎవరూ కాదు (నోటా)' ఆప్షన్‌పై స్టే విధించాలని కాంగ్రెస్ వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. రాజ్యసభ ఎన్నికల్లో నోటా ఉంటుందని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యసభ ఎన్నికల్లో నోటా ఉపయోగించడం వల్ల 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1961 ఎన్నికల చట్టానికి విరుద్ధమని కాంగ్రెస్ వాదిస్తూ, దీనిపై స్టే విధించాలని సుప్రీం కోర్టును కోరింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ దీపక్ మిశ్రా ధర్మాసనం కాంగ్రెస్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. గుజరాత్ ఎన్నికల్లో నోటా అమలు చేయాలని స్పష్టం చేసింది. గుజరాత్‌లోని మూడు స్థానాలకు ఈ నెల 8న ఎన్నికలు జరగనున్నాయి. పెద్దల సభకు జరిగే ఎన్నికల్లో రహస్య బ్యాలట్ పద్ధతి ఉపయోగించరు. వోటు వేసిన ఎమ్మెల్యేలు తమ బ్యాలట్ పత్రాన్ని తమ పార్టీ పోలింగ్ ఏజెంట్‌కు చూపించిన తరువాతే బ్యాలట్ పెట్టెలో వేయాల్సి ఉంటుంది. ఈ విధానానికితోడు నోటా కూడా అమలు చేయడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఇప్పుడు సుప్రీం తీర్పుతో మొదటి సారి రాజ్యసభ ఎన్నికల్లో నోటా అమలు చేయనున్నారు. గుజరాత్‌లోని 3 స్థానాలకు బీజేపీ నుంచి అమిత్ షా, స్మృతీ ఇరానీ, బల్వంత్ సింగ్ రాజ్‌పుత్ పోటీ పడుతుండగా, కాంగ్రెస్ నుంచి సోనియా సలహాదారు అహ్మద్ పటేల్ బరిలోకి దిగుతున్నారు.

దిలీప్ కుమార్‌కు తీవ్ర అస్వస్థత

ముంబయి : బాలీవుడ్ దిగ్గజ నటుడు దిలీప్ కుమార్ మరోసారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో, బుధవారం ఆయనను ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో చేర్చారు. దిలీప్ కుమార్ డీహైడ్రేషన్‌కు గురయ్యారని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. కాగా, గత రెండు రోజులుగా ఆయన జ్వరంతో బాధ పడుతున్నట్టు ఆయన ఫ్యామిలీ ఫ్రెండ్ ఉదయ తారా నాయర్ వెల్లడించారు. ఇంతకు ముందు కూడా ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై, ఆసుపత్రిలో చికిత్స పొందిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆయన శ్వాసకోశ సంబంధిత రుగ్మతలతో ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. దిలీప్ కుమార్ ప్రస్తుత వయసు 94 సంవత్సరాలు. 1998లో చిట్టచివరగా 'ఖిలా' అనే సినిమాలో నటించారు.

తమిళనాట మలుపులు తిరుగుతున్న రాజకీయం

- దినకరన్ సవాలు
- పళని, పన్నీర్ వ్యూహాలు



చెన్నై : తమిళనాట ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. శశికళ వర్గాన్ని పార్టీ నుంచి సాగనంపేందుకు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు. ఎత్తుకు పైయెత్తులతో పార్టీపై పట్టు నిలుపుకునేందుకు పళనిస్వామి, పన్నీర్ సెల్వం, దినకరన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా పళనిస్వామి, పన్నీర్ సెల్వం విలీనం ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, ఎన్డీయేతో భాగస్వామ్యం పంచుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో కేంద్రంలో మంత్రి పదవులు ఇచ్చేందుకు కూడా ఎన్డీయే సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అన్నా డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి, శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్ స్పందించారు. బెంగళూరు పరప్పణ అగ్రహార జైలులో శిక్ష అనుభవిస్తున్న శశికళతో సమావేశమైన అనంతరం మాట్లాడుతూ, ఈ వారంలో పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళతానని చెప్పారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి రాకుండా ఎవరు అడ్డుకుంటారో చూస్తానని ఆయన సవాల్ విసిరారు. తనకు 122 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ఆయన ప్రకటించారు. పార్టీ యథాతథంగా కొనసాగుతుందని అన్నారు. పళని, పన్నీర్ విలీనంపై మాట్లాడుతూ, అలాంటిదేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేబినెట్ సమావేశం నిర్వహించిన పళనిస్వామి దీనిపై చర్చించారు. ప్రభుత్వం సమర్థంగా పని చేస్తోందని, ఎవరి గురించీ ఆందోళన చెందడం లేదని తెలిపారు.

నా కొడుకు అమెరికా వల్ల చెడిపోయాడు

- నాపై కేసు పెడతాడేమోనని భయమేస్తోంది
- జాకీ చాన్ సంచలన వ్యాఖ్యలు



బీజింగ్ : అమెరికా సంప్రదాయాలపై ప్రముఖ హాలీవుడ్ నటుడు జాకీ చాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కామెడీ యాక్షన్ సినిమాలతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న జాకీ చాన్ పాశ్చాత్య సంస్కృతి తన కుమారుడ్ని చెడగొట్టిందని అన్నారు. చైనా మీడియాతో ఆయన మాట్లాడుతూ, తన తండ్రి తనను ఎంతో కష్టపడి, క్రమశిక్షణతో పెంచారని అన్నారు. కేవలం ఇంటిలోనే కాకుండా హోటల్‌కు వెళ్లినా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన నేర్పినట్లే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం అలవాటైందని ఆయన తెలిపారు. ఇంటిలోకి వెళ్లేటప్పుడు చెప్పులు ఎక్కడ పడితే అక్కడ పెట్టకుండా తలుపు పక్కనే సర్దేవారమని అన్నారు. తన కుమారుడు మాత్రం ఈ నిబంధనలు పట్టించుకోడని జాకీ తెలిపారు. తన కుమారుడు ఇంటికి వచ్చేటప్పుడు షూస్ ఎలా పడితే అలా విసిరేస్తుంటాడని చెప్పాడు. షూస్‌తో ఇంటిలోకి వచ్చేస్తాడని అన్నారు. పెద్దలతో మాట్లాడేటప్పుడు నిలబడి సీట్ ఇవ్వడం పెద్దరికమని, కానీ తన కుమారుడు అలా చేయడని, పైగా ఎలా పడితే అలా మాట్లాడేస్తాడని చెప్పారు. తన కుమారుడ్ని అమెరికా సంస్కృతి, సంప్రదాయాలు చెడగొట్టాయని ఆయన స్పష్టం చేశారు. పోనీ వాడిని సరైన మార్గంలో పెడదామంటే తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నానని తనపై కేసు పెడతాడేమోనని భయంగా ఉందని చెప్పి, ఆయన అందర్నీ నవ్వించారు.

డోక్లామ్ నుంచి పారిపోయిన ఇండియా: చైనా సంచలన వ్యాఖ్య

బీజింగ్ : డోక్లామ్ ప్రాంతంలో మోహరించిన సైన్యంలో అత్యధిక భాగాన్ని భారత్ ఉపసంహరించుకున్నదని, ఇది తమకు లభించిన విజయమని చైనా వ్యాఖ్యానించింది. నెల రోజుల క్రితం సుమారు 400 మంది వరకూ ఈ ప్రాంతంలో ఉండగా, ఇప్పుడు వారి సంఖ్య 40 మాత్రమేనని చైనా వెల్లడించగా, భారత్ దాన్ని ఖండించింది. డోక్లామ్ నుంచి సైన్యాన్ని ఉపసంహరించినట్టు వచ్చిన వార్తలు అవాస్తవమని స్పష్టం చేసింది. కాగా, బుధవారం చైనా 15 పేజీల స్టేట్‌మెంట్‌ను విడుదల చేస్తూ, మ్యాప్‌లు, ఫోటోగ్రాఫ్ మొదలైనవాటితో డోక్లామ్‌లో ఉన్న వాస్తవ పరిస్థితి ఇదేనని పేర్కొంది. సిక్కిం, భూటాన్, టిబెట్ ట్రై జంక్షన్ ప్రాంతం తమదేనని మరోసారి తేలిపోయిందని వ్యాఖ్యానించింది. భారత్ వెనక్కు తగ్గడంతో 45 రోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు తగ్గాయని తెలిపింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ బీజింగ్‌కు వెళ్లి, చైనా జాతీయ సలహాదారు యాంగ్ జీచీని కలిసి చర్చలు జరిపిన అనంతరం ఈ ప్రకటన వెలువడడం గమనార్హం.

కర్నాటక మంత్రి శివకుమార్‌కు బిగుస్తున్న ఉచ్చు

అరెస్ట్ చేసే అవకాశం



బెంగళూరు : కర్నాటక రాష్ట్ర మంత్రి డికె శివ కుమార్ ఇళ్లలో ఐటీ శాఖ సోదాలు కొనసా గుతూనే ఉన్నాయి. బెంగళూరు, మైసూరు సహా 39 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. మంత్రి సంబంధీకులు, ఆయన పిల్లలు, అత్తమామల ఇళ్లను కూడా ఐటీ అధికారులు వదలలేదు. ఢిల్లీలోని సర్దార్ జంగ్ ప్రాంతంలోని ఆయన నివాసంలో సైతం సోదాలు జరుగుతున్నాయి. బుధవారం శివ కుమార్ నివాసాల్లో జరిగిన సోదాల్లో రూ. 11 కోట్ల నగదుతో పాటు, అక్రమ ఆస్తులకు సంబంధించి పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మరో వైపు అధికారుల ప్రశ్నలకు శివకుమార్ సరైన సమాధానాలు కూడా చెప్పలేక పోతున్నారు. అన్ని ప్రశ్నలకు 'నాకు తెలియదు, మా చార్టర్డ్ అకౌంటెంట్ చెబుతారు, మా లాయర్ చెబుతారు' అంటూ సమాధానాలను దాటవేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆయనను మనీ లాండరింగ్ కింద అరెస్ట్ చేయనున్నారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. మరో వైపు బెంగళూరులోని సదాశివనగర్‌లో ఉన్న ఆయన నివాసంలోకి మూడు ఫోటోస్టాట్ మెషీన్లు, మూడు స్కానింగ్ మెషీన్లను అధికారులు తీసుకువెళ్లారు. వీటి ద్వారా వివిధ స్థిర, చరాస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, కీలక పత్రాలను జిరాక్స్ తీస్తున్నారు. సౌర విద్యుత్ ప్రాజెక్టులకు సంబంధించిన లావాదేవీలపై కూపీ లాగుతున్నారు. దీనికి తోడు, బుధవారం రాత్రి ఆయనకు వరుసకు సోదరి అయ్యే పద్మ ఇంట్లో ఐటీ అధికారులు రూ. 10 కోట్ల నగదు, రూ. 10 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

బీఎస్పీ చీఫ్ మాయావతికి బిగ్ షాక్

ఆ పార్టీకి గుడ్‌బై చెప్పిన జాతీయ జనరల్ సెక్రటరీ సరోజ్



లక్నో : బీఎస్పీ అధినేత్రి మాయావతికి ఆ పార్టీ జాతీయ జనరల్ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే ఇంద్రజీత్ సరోజ్ షాక్ ఇచ్చారు. మాయావతి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ పార్టీని వీడారు. సరోజ్ దళిత సామాజిక వర్గంలోని పాసి వర్గానికి చెందిన వారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రూ. 9 లక్షల నుంచి రూ. 22 లక్షలు తీసుకురావాలని మాయావతి ఆదేశించినట్టు ఆరోపించారు. అయితే, అంత డబ్బును తాను తీసుకురాలేనని ఆమెకు తేల్చి చెప్పినట్టు తెలిపారు. తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, కానీ పార్టీలోనే కొనసాగుతానని మాయాకు చెప్పినట్టు వివరించారు. దీంతో ఆమె కోపంతో ఊగిపోయారని, పార్టీ కోసం పని చేయాల్సిన అవసరం లేదని, పార్టీ వీడి వెళ్లిపోవాలన్నారని పేర్కొన్నారు. కౌశాంబి జిల్లాలోని మాంజాపూర్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సరోజ్ పార్టీని వీడడం బీఎస్పీకి పెద్ద ఎదురు దెబ్బేనని చెబుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో పాసి వర్గానికి 15-18 శాతం వోటు బ్యాంకు ఉంది. సరోజ్ పార్టీని వీడడంతో ఈ వర్గం వోట్లు బీఎస్పీకి పడే అవకాశం లేదని చెబుతున్నారు.

విమానం తోకపై పడ్డ పిడుగు

ఫ్లోరిడా : ఎయిర్‌పోర్టులో విమానం తోకపై పడ్డ పిడుగు ఇంజన్ దగ్గర పని చేస్తున్న కార్మికుడికి తగిలి విద్యుదాఘాతానికి గురైన ఘటన అమెరికాలోని ఉతర ఫ్లోరిడాలో చోటు చేసుకుంది. ఘటన వివరాల్లోకి వెళితే, ఉత్తర ఫ్లోరిడాలోని ఫోర్ట్ మేయర్ పట్టణంలోని ఎయిర్‌పోర్టులో జూలై 22న ప్రయాణానికి విమానాన్ని సిద్ధం చేస్తున్నారు. అన్ని తనిఖీలు పూర్తి కావచ్చాయి. ప్రయాణికులు ఎక్కగానే రన్‌వేపై నుంచి గాలిలోకి ఎగరడమే ఆలస్యం. ఇంతలో విమానాన్ని ప్రయాణికులను ఎక్కించేందుకు పోర్ట్ ఫ్లాట్‌ఫామ్ వద్దకు తీసుకు వచ్చేందుకు ట్రక్ సిద్ధమైంది. కాక్‌పిట్ దగ్గర ఉన్న ఫ్రంట్ గేర్, ఇంజన్ దగ్గర ఏదో పనిలో ఆస్టిన్ డన్ (21) అనే కార్మికుడు పని చేస్తున్నాడు. ఇంతలో ఓ పిడుగు ఈ విమానం తోకపై పడింది. దీంతో భారీగా ఉత్పత్తి అయిన విద్యుత్ విమానాన్ని చుట్టుముట్టింది. పెద్దగా మంటలు రేగాయి. ఇంజన్ దగ్గర పని చేస్తున్న ఆస్టిన్ దాని ధాటికి మృతి చెందాల్సిందే. కాని, అదృష్టవశాత్తు, విద్యుదాఘాతానికి అతను కింద పడిపోయాడు. దగ్గర పని చేస్తున్న కార్మికులు పరుగున వెళ్లి అతనిని ఆసుపత్రికి తరలించగా, స్వల్ప గాయాలతో బతికి బయటపడ్డాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు దేవుడు తమ పట్ల అద్భుతం చేశాడని పేర్కొంటున్నారు. ఈ తతంగం మొత్తం సీసీ ఫుటేజ్‌లో బహిర్గతమైంది.

మరణించిన ఉగ్రవాది అబు దుజానా స్థానంలో అబు ఇస్మాయిల్

అమర్‌నాథ్ యాత్ర సూత్రధారి ఇతడే

శ్రీనగర్ : ఇండియన్ ఆర్మీ చేతిలో హతమైన లష్కరే తాయిబా కమాండర్ అబు దుజానా స్థానంలో పాకిస్తాకు చెందిన అబు ఇస్మాయిల్ లష్కరే కమాండర్‌గా పగ్గాలు చేబట్టాడు. కాశ్మీర్ డివిజన్ లష్కరే గ్రూపునకు ఇక నుంచి ఆయనే కమాండర్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవల దక్షిణ కాశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్రికులపై జరిగిన ఉగ్ర దాడికి సూత్రధారి ఇస్మాయిలే. ఆ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన ఏడుగురిలో ఆరుగురు మహిళలే.

నన్ను పట్టుకున్నందుకు అభినందనలు.. కానీ నేను లొంగే ప్రసక్తే లేదు:

ఆర్మీతో ఉగ్రవాది దుజానా సంభాషణ వైరల్

ఇది ఇలా ఉండగా, భద్రతా దళాల చేతిలో హతమైన లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) కమాండర్ అబు దుజానా ఆర్మీ అధికారితో చెప్పిన మాటలు వైరల్ అవుతున్నాయి. తనను పట్టుకున్నందుకు కంగ్రాట్స్ చెబుతూనే లొంగే ప్రసక్తి మాత్రం లేదని పేర్కొన్నాడు. మంగళవారం పుల్వామాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో దుజానా హతమయ్యాడు. అంతకు ముందు ఓ అధికారి దుజానాతో ఫోన్‌లో మాట్లాడాల్సిందిగా ఓ మహిళను పురమాయించారు. ఆమె కాసేపు మాట్లాడిన తరువాత ఫోన్‌ను అధికారికి ఇచ్చాడు. ఆ తరువాత ఇద్దరి మధ్య సంభాషణ ఇలా సాగింది. 'క్యా హాల్ హై? మైనే కహా, క్యా హాల్ హై?' (ఎలా ఉన్నావ్? ఎలా ఉన్నావని అడుగుతున్నా?) అని అధికారి దుజానాను ప్రశ్నించారు. 'హుమారా హాల్ చోర్ దుజానా. వై డోంటు యు సరెండర్?' (నువ్వీ అమ్మాయిని పెళ్లాడావు, నువ్వు చేస్తున్నది తప్పు) అని అధికారి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దానికి దుజానా స్పందిస్తూ, 'హమ్ నిక్లే థీ షాహీద్ హో. మై క్యా కరూం, జిస్కో గేమ్ ఖేల్నా హై. ఖేలో.. కభీ హమ్ ఆగే, కభీ ఆప్, ఆజ్ అప్‌నే పకడ్ లియే, ముబారక్ హో ఆప్‌కో. జిస్కో జో కర్నా హై కర్లో (నేను అమరుడయ్యేందుకే వచ్చా. నేనేం చేయగలను. ఈ ఆటలో కొన్ని సార్లు మీరు ముందు ఉంటారు, కొన్ని సార్లు మేం. ఈసారి మాత్రం మీరే. నన్ను పట్టుకున్నందుకు శుభాకాంక్షలు. ఇప్పుడేం చేస్తారో చేసుకోండి) అని చెబుతూనే నేనైతే లొంగిపోయే ప్రసక్తే లేదు. నా అదృష్టం ఎలా ఉంటే అల్లా అలానే చేస్తాడు. సరేనా?' అని అధికారికి తేల్చి చెప్పాడు. దుజానాను లొంగిపోవలసిందిగా చెప్పేందుకు అధికారి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కాశ్మీరీ యువతను ఉగ్రవాదంలో చేర్చుకుని వారి భవిష్యత్తును నాశనం చేయవద్దని కోరుతుండగా దుజానా ఫోన్ కట్ చేశాడు. ఆ తరువాత అతడిని భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఇప్పుడీ ఆడియో టేప్ బయటపడి సంచలనం సృష్టిస్తోంది.



హర్మన్‌కు త్వరలో డీఎస్పీ బాధ్యతలు

చండీగఢ్ : ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీ సెమీస్‌లో ఆసీస్‌పై 171 పరుగులతో చెలరేగిన క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ త్వరలోనే పంజాబ్ పోలీసు శాఖలో డీఎస్పీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు హర్మన్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని డీజీపీ సురేశ్ అరోరాను సీఎం ఆదేశించారు. ఈ యువ ప్రతిభావంతురాలు తమ రాష్ట్ర పరిధిలో పనిచేయాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రైల్వేలో పనిచేస్తున్న హర్మన్‌కు అక్కడ బాండ్ ఉంది. త్వరలోనే దీని పరిష్కారానికి కృషి చేస్తానని సీఎం చెప్పారు. హర్మన్ డిపార్ట్‌మెంట్‌లో చేరగానే పోలీసు శాఖలో క్రికెట్ జట్టును రూపొందిస్తామని డీజీపీ ఆరోరా వెల్లడించారు. హర్మన్ ఆసీస్‌పై 115 బంతుల్లో 171 పరుగులతో అజేయంగా నిలిచిన సంగతి తెలిసిందే.



రవిశాస్త్రికి దాదా చురక

ఇంగ్లాండ్, పాక్‌పై విజయాలను మరిచిపోయావా?



న్యూఢిల్లీ : భారత క్రికెట్ జట్టు మాజీ సారథి సౌరభ్ గంగూలీ టీమిండియా కోచ్ రవిశాస్త్రికి చురక అంటించాడు. దిగ్గజ ఆటగాళ్లతో కూడిన భారత జట్లకు సాధ్యం కాని విజయాన్ని కోహ్లీ సారథ్యంలోని యువ జట్టు అందుకుందని శాస్త్రి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా దాదా స్పందించాడు. ఇంగ్లాండ్, పాకిస్థాన్‌పై సాధించిన విజయాలను శాస్త్రి మర్చిపోయాడని దాదా అన్నాడు. నిజంగా చెప్పాలంటే.. శాస్త్రి వ్యాఖ్యలపై నేను అంతగా మాట్లాడదలచుకోలేదు. గంగూలీ, సచిన్, లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా కమిటీ అతనికి మంచి ఉద్యోగం ఇచ్చింది. దాన్ని సద్వినియోగం చేసుకుని 2019 ప్రపంచ కప్ టోర్నీ వరకు కోచ్ పదవిలో కొనసాగి భారత్‌కు ట్రోఫీ అందించేలా కృషి చేయాలని కోరుకుంటున్నా. 2007లో ఇంగ్లిష్ గడ్డపై ఇంగ్లాండ్‌పై విజయం సాధించాం. దాయాదీ గడ్డపై పాక్‌ను చిత్తు చేశాం. దయచేసి ఒకదానితో మరొకటి పోల్చొద్దు. భవిష్యత్తులో కోహ్లీ సేన మరిన్ని విజయాలు అందుకునేలా నీ సేవలు అందించు అని గంగూలీ అన్నాడు. రవిశాస్త్రి ఇటీవల ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడుతూ... గతంలో దిగ్గజ ఆటగాళ్లతో కూడిన జట్లకు సాధ్యం కాని విజయాలను ఇప్పటికే ప్రస్తుత జట్టులోని కుర్రాళ్లు అందుకున్నారు. రెండేళ్ల క్రితం శ్రీలంక పర్యటనే అందుకు ఉదాహరణ. పెద్ద పేరున్న ఆటగాళ్లు టీమిండియా తరఫున 20 ఏళ్ల పాటు ఆడారు. వాళ్లు శ్రీలంకలో చాలా సార్లు పర్యటించినా ఎప్పుడూ సిరీస్ గెలవలేదు. కానీ ఈ కుర్ర జట్టు సాధించింది. మిగతా భారత జట్లకు, ప్రత్యేకంగా విదేశీ పర్యటనల్లో సాధ్యం కాని ఘనతలను అందుకునే సత్తా ఈ జట్టుకు ఉంది అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

ఆదిత్య స్పోర్ట్స్, శాప్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు

- 13 జిల్లాల నుంచి హాజరు కానున్న క్రీడాకారులు
- అసోసియేషన్ కార్యదర్శి రమణారావు వెల్లడి

నెల్లూరు, సూర్య ప్రతినిధి : శివంతి ఆదిత్యన్ స్పోర్ట్స్ ఫౌండేషన్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా మినీ వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, అర్జున, ద్రోణచార్య అవార్డు గ్రహీత రమణారావు పేర్కొన్నారు. ఆదిత్యన్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కమిటీ, శాప్ సంయుక్తంగా తొలిసారిగా ప్రతిష్ఠాత్మకంగా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు, అధికారులు హాజరవుతారని ప్రకటించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి జాతీయస్థాయి పోటీలకు పాల్గొనేలా జట్టును తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతాయన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీవీ రమణయ్య మాట్లాడుతూ క్రీడాకారులకు బస ఏర్పాట్లు చేయడం జరిగిందని, గూడూరు బస్ స్టేషన్ ప్రాంతాల నుంచి వాహనాలు అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్ర క్రీడా నూతన విధానాల్లో భాగంగా ఈ స్టేడియాన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేసేలా వసతులు సమకూర్చామన్నారు.

హరికృష్ణకు చేజారిన టైటిల్



న్యూఢిల్లీ : బీల్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్లో భారత గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణకు నిరాశ ఎదురైంది. చివరిదైన తొమ్మిదో రౌండ్లో ఓటమితో అతడు టైటిల్‌ను చేజార్చుకున్నాడు. ఎనిమిదో రౌండ్ ముగిసేసరికి 5.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంతో ఉన్న హరికృష్ణ.. ఆఖరి రౌండ్లో ఫ్రాన్స్‌కు చెందిన బార్కోట్ ఎతీనె (6) చేతిలో పరాజయం పాలయ్యాడు. ఆఖరి రౌండ్లో నెగ్గిన హు ఇఫాన్ (చైనా) 6.5 పాయింట్లతో టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. హరికృష్ణ మూడో స్థానంతో సంతృప్తి చెందాడు.

సీఏ వివాదానికి తెర



సిడ్నీ : జీతాలపై క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ), ఆసీస్ ఆటగాళ్ల మధ్య నెలకొన్న వివాదానికి తెరపడింది. తాజాగా సీఏ-ఆసీస్ ఆటగాళ్ల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో స్మిత్ సేన త్వరలో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లడం ఖాయమైంది. జీతాలపై నెలకొన్న వివాదం కారణంగా ఆస్ట్రేలియా-ఎ దక్షిణాఫ్రికా పర్యటనను బహిష్కరించిన సంగతి తెలిసిందే. కొత్త కాంట్రాక్టులో కొన్ని మార్పులు చేయడంతో ఇరువురి మధ్య వివాదానికి తెరపడిందని క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటీవ్ జేమ్స్ సుదర్లాండ్, ఆస్ట్రేలియా క్రికెటర్ల సంఘం చీఫ్ అలిస్టెర్ నికొల్సన్ వెల్లడించారు. సుమారు 230 మంది ఆటగాళ్లు సీఏతో చేసుకున్న ఐదేళ్ల ఒప్పందం జూన్ 30తో ముగిసింది. కొత్త కాంట్రాక్టులో కీలక మార్పులు చేయడంతో దానిపై ఆటగాళ్లు సంతకాలు చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆటగాళ్ల సంఘం.. సీఏతో చర్చలు మొదలెట్టింది. సుదీర్ఘకాలం పాటు చర్చల అనంతరం ఈ రోజు ఇరువురి మధ్య ఒప్పందం కుదిరింది. కొత్త కాంట్రాక్టులో కొన్ని మార్పులు చేయడంతో సయోధ్య కుదిరిందని ఈ సందర్భంగా బోర్డు ప్రతినిధులు వెల్లడించారు. దీంతో జీతాలపై నెలకొన్న వివాదం తెరపడిందని.. త్వరలో ఆసీస్ జట్టు బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లనుందని ప్రకటించారు. సుమారు 396 మిలియన్ డాలర్ల ఒప్పందానికి ఆసీస్ ఆటగాళ్లు సంతకాలు చేసినట్లు సమాచారం. బంగ్లాదేశ్ పర్యటన అనంతరం ఆసీస్ భారత్, ఇంగ్లాండ్ పర్యటనలకు వెళ్లనుంది.

గోడ కట్టారు!



- తొలిరోజు 3 వికెట్ల నష్టానికి 344 పరుగులు
- శతకాలతో కదం తొక్కిన పుజారా, రహానె
- లోకేష్ రాహుల్ అర్ధ శతకం, విఫమైన కోహ్లీ
- కొలంబోలో భారత్-శ్రీలంక రెండో టెస్టు మ్యాచ్

కొలంబో : శ్రీలంక పర్యటనలో భాగంగా జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సీరీస్‌లో ఇప్పటికే తొలి టెస్టును ఏకపక్షం చేసుకున్న భారత్ రెండో మ్యాచ్‌లోనూ అదే స్థాయిలో దూసుకుపోతోంది. గురువారం నాడు ప్రారంభమైన భారత్-శ్రీలంక మధ్య ఈ టెస్టు మ్యాచ్‌లో తొలిరోజు ఆటముగిసే సమయానికి కోహ్లీ సేన 3 వికెట్ల నష్టానికి 344 పరుగులు చేసి పటిష్ఠ స్థితిలో నిలిచింది. భారత ఓపెనర్లు కేఎల్ రాహుల్, శిఖర్‌ధావన్ చక్కని ఆరంభాన్నివ్వగా... అదే స్ఫూర్తిని ఇన్నింగ్స్‌ను కొనసాగించిన అజయెంక్యా రహనె (103; 168 బంతుల్లో 12 ఫోర్లు) ఛతేశ్వర్ పుజారా (225 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్) శతకాలతో విరుచుకుపడి శ్రీలంక బౌలర్లకు పరీక్ష పెట్టారు. ఇద్దరు స్టార్ బ్యాట్స్ తొలిరోజే శతకాలు పూర్తి చేసుకోవడంతో టీమిండియా స్కోరుబోర్డు భారీ పరుగుల దిశగా సాగుతోంది. తొలుత రాహుల్ అర్ధశతకం నమోదు చేయగా, ధావన్ 35 పరుగులకు ఔటయ్యాడు. సెకెండ్ డౌన్‌లో క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ కోహ్లీ (13) భారీ ఇన్నింగ్స్ ఆడడంలో విఫలమయ్యాడు. కాగా పుజారా, రహానె శతకాలతో రాణిస్తుండడంతో... తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోరు 3 వికెట్ల నష్టానికి 344 పరుగులకు చేరింది.

నిరాశపరిచిన కోహ్లీ ... గాలె టెస్టులో రాహుల్ స్థానంలో ఓపెనర్‌గా బరిలోకి దిగి శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడిన ధావన్ కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టులో నిరాశపరిచాడు. రాహుల్‌తో కలిసి భారత్‌కు శుభారంభాన్ని ఇచ్చిన ధవన్ కాస్త దూకుడు ప్రదర్శించాడు. ఇద్దరూ కలిసి 10 ఓవర్లకే జట్టు స్కోరును 50 పరుగులు జోడించారు. ఆ తర్వాత దిల్‌రువన్ పెరెరా వేసిన బంతికి ధావన్ (35) ఎల్బీడబ్ల్యు రూపంలో వెనుదిరిగాడు. అతని స్థానంలో క్రీజ్‌లోకి వచ్చిన పుజారా తన కెరీర్‌లో 50వ టెస్టు ఆడుతున్నాడు. నిలకడైన ఆటతీరును ప్రదర్శించిన పుజారా... రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఇద్దరూ కలిసి రెండో వికెట్‌కి 53 పరుగులు జోడించి పరవాలేదనిపించారు కాగా 31వ ఓవర్లో అనవసర పరుగుకి పోయిన రాహుల్ (57) ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కోహ్లీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. గాలె టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో వ్యక్తిగత స్కోరు 3 పరుగుల వద్దే ఔటైన కోహ్లీ ఈ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లోనూ నిరాశపరిచాడు. 39వ ఓవర్లో హెరాత్ వేసిన బంతిని ఎదుర్కొన్న కోహ్లీ.. మాథ్యూస్‌కి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో రెండో సెషన్‌లో భారత్ రెండు కీలక వికెట్లు కోల్పోయింది.



కోహ్లీ స్థానంలో బ్యాటింగ్‌కు రహానె... పుజారాకి జత కలిశాడు. ఇద్దరూ కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దారు. ఆచితూచి ఆడుతూ స్కోరు బోర్డును ముందుకు నడిపారు. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. ఈ క్రమంలోనే ఇద్దరూ శతకాలు నమోదు చేశారు. 67.4వ ఓవర్లో పుజారా శతకం పూర్తి చేశాడు. 50వ టెస్టు ఆడుతోన్న పుజారాకిది 13వ శతకం. ఆ తర్వాత రహానె కూడా శతకంతో రాణించాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి పుజారా-రహానె జోడీ నాలుగో వికెట్‌కి అజేయంగా 211 పరుగులు భాగస్వామ్యం నెలకొల్పింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. 90 ఓవర్లు ఆడిన భారత్ 3 వికెట్ల నష్టానికి 344 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో పుజారా(128), రహానె(103) ఉన్నారు. శ్రీలంక బౌలర్లు హెరాత్, దిల్రువన్ పెరీరా చెరో వికెట్ దక్కించుకున్నారు.

50వ టెస్టులో పుజారా సూపర్ శతకం

టెస్టు కెరీర్‌లో 50వ టెస్టు ఆడుతోన్న చతేశ్వర్ పుజారా అర్ధశతకంతో రాణించాడు. భారత్-శ్రీలంక మధ్య జరుగుతున్న రెండో టెస్టులో పుజారా 50 పరుగులు పూర్తి చేశాడు. భారత్ తరఫున 50 టెస్టుల్లో 4 వేలకుపైగా పరుగులు సాధించిన నాలుగో ఆటగాడిగా పుజారా నిలిచాడు.

4 వేల పరుగుల క్లబ్‌లో పుజారా

50వ టెస్టు ఆడుతోన్న పుజారా మరో ఘనతను అందుకున్నాడు. 41.2వ ఓవర్లో దిల్రువన్ వేసిన బంతిని ఎదుర్కొన్న పుజారా రెండు పరుగులు తీయడంతో టెస్టుల్లో 4వేల పరుగులను పూర్తి చేశాడు. 50 టెస్టుల్లో 4 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాళ్ల జాబితాలో పుజారా నాలుగో స్థానంలో నిలిచాడు. అంతకు ముందు గవాస్కర్ (4,947), రాహుల్ ద్రవిడ్ (4,315), సెహ్వాగ్ (4,103) 50 టెస్టుల్లోనే 4వేలకు పైగా పరుగులు సాధించా రు. ఆ తర్వాత 47.1వ ఓవర్లో పెరీరా వేసిన బంతిని ఎదుర్కొన్న పుజారా ఒక పరుగు తీసి అర్ధశతకం పూర్తి చేశాడు.

భారత్ తొలి ఇన్నింగ్స్ : శిఖర్ ధావన్ ఎల్బీడబ్ల్యు బి దిల్‌రువాన్ పెరెరా 35, లోకేష్ రాహుల్ రనౌట్ (ఛండీమల్/డిక్‌వెల్) 57, ఛతేశ్వర్‌పుజారా నాటౌట్ 128, విరాట్ కోహ్లీ సి మ్యాథ్యూస్ బి హెరాత్ 13, అజయెంక్యా రహనే నాటౌట్ 103. అదనం-8. మొత్తం : (90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి) 344. వికెట్ల పతనం : 1-56 శిఖర్‌ధావన్, 2-109 లోకేష్‌రాహుల్, 3-133 విరాట్ కోహ్లీ. బౌలింగ్ : నువాన్ ప్రదీప్ 17.4-2-63-0, రంగనా హెరాత్ 24-3-83-1, దిముత్ కరుణరత్నే 3-0-10-0, దిల్‌రువాన్ పెరెరా 18-2-68-1, మలిందా పుష్పకుమార 19.2-0-82-0.



*హైదరాబాద్ : తెలుగు టైటాన్స్ జట్టు మరోసారి ఓటమిపాలైంది. గురువారం నాడు పాట్నా పైరేట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో **36-43** తేడాతో ఓటమి పాలయ్యారు. పాట్నా పైరేట్స్‌తో ఇది రెండో అపజయం కాగా... వరుస పరాజయాలతో రాహుల్ చౌదరి సేన అప్రతిష్ఠ మూటకట్టుకుంటోంది.*

అవార్డు కోసం ఇద్దరు క్రీడాకారులకు పేర్లు

సర్దార్‌సింగ్‌కు ఖేల్‌రత్న... పుజారాకు అర్జున





న్యూఢిల్లీ : క్రీడా రంగంలో అద్భుత ప్రదర్శన కనబర్చే క్రీడాకారులకు ఏటా ఇచ్చే ఖేల్ రత్న, అర్జున అవార్డుల సిఫారసు జాబితాలో ప్రముఖ హాకీ క్రీడాకారుడు సర్దార్ సింగ్, క్రికెటర్ చతేశ్వర్ పుజారా సహా మొత్తం 17 మందికి చోటు దక్కింది. ఈ అర్జున అవార్డుల కోసం ఎంపిక చేసిన జాబితాలో క్రికెటర్లు పుజారా, హర్మన్‌ప్రీత్ కౌర్‌లు సహా క్రీడాకారులు సాకేత్ మైనేని, మరియప్పన్, వీజే శ్వేత, ఖుష్బిర్‌కౌర్, ఆరోఖ్య రాజీవ్, ప్రశాంతి సింగ్, ఎస్వీ సునీల్, ఎస్ఎస్‌పీ చౌరాసియా, సత్యవ్రత్ కడియన్, ఆంతోని అమల్‌రాజ్, పీఎన్ ప్రకాశ్, జస్విర్‌సింగ్, దేవేంద్రో సింగ్, బింబా దేవి, వరుణ్ భాటి తదితరులు ఉన్నారు.

ఖేల్‌రత్నకు ఇద్దరి పేర్లు సిఫారసు

ప్రతిష్ఠాత్మక ఖేల్‌రత్న అవార్డుకు ఇద్దరి పేర్లను సిఫార్సు చేసినట్టు సమాచారం. హాకీ మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్, పారా అథ్లెట్ దేవేంద్ర ఝఝారియాలను కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. 2016 రియో పారాలింపిక్స్‌లో దేవేంద్ర ఝఝారియా బంగారు పతకం సాధించిన విషయం తెలిసిందే.

కోహ్లీని సచిన్, లక్ష్మణ్, ద్రవిడ్‌లతో పోల్చలేం

పాకిస్తాన్ మాజీ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్



కరాచీ : భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మంచి బ్యాట్స్‌మెన్ అనడంలో ఎలాంటి సందేహం లేదని కానీ అతడు సచిన్ టెండూల్కర్, ద్రవిడ్ లాంటి దిగ్గజాలతో మాత్రం పోల్చలేమని పాక్ మాజీ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్ అన్నాడు. గురువారం ఓ మీడియా ఛానెల్‌తో ఆయన మాట్లాడుతూ విరాట్ కోహ్లీ మంచి బ్యాట్స్‌మెన్. అతడి ఆటను చూసేందుకు నేను చాలా ఇష్టపడతా. కానీ అతడు సచిన్ తెందూల్కర్, ద్రవిడ్, లక్ష్మణ్ వంటి వారితో సమానమని మాత్రం అనుకోను అంటూ వ్యాఖ్యానించారు. చాలా మంది తాను చెప్పేదానికి అంగీకరించపోవచ్చని కానీ తాను క్రికెట్ ఆడిన సమయంలో ఉన్న నాణ్యమైన బ్యాట్స్‌మెన్లు, బౌలర్లు నేడు లేరని చెప్పారు. ప్రస్తుత ఆస్ట్రేలియా బౌలింగ్ లౌనప్‌ను తీసుకుంటే వారిలో మెక్‌గ్రాత్, షేన్ వార్న్‌లకు సరితూగగలిగేవారు ఒక్కరైనా లేరన్నారు. భారత్‌కు సైతం అప్పట్లో అనిల్ కుంబ్లే, శ్రీనాథ్ లాంటి అద్భుత బౌలర్లున్నారని చెప్పారు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లకూ మంచి బౌలింగ్ దళం ఉండేదని.. శ్రీలంక మురళీధరన్‌పై ఎక్కువగా ఆధారపడేదని ఆనాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత నియమాలు కూడా బ్యాట్స్‌మెన్‌కు అనుకూలంగా మారిపోయాయని.. పిచ్‌లు సైతం బ్యాట్స్‌మెన్లకు సహకరించేలా రూపొందుతున్నాయని చెప్పారు. గతంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాల్లో పర్యటనకు వెళ్లినప్పుడు భిన్నమైన పిచ్‌లు ఎదరయ్యేవని ఇప్పుడు అన్నిచోట్లా ఒకేరంగా ఉంటున్నాయంటూ అభిప్రాయపడ్డారు.

క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం : వెంకటేశం



హైదరాబాద్, మేజర్‌న్యూస్: క్రీడాకారులకు ప్రోత్సాహన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలంగాణ టూరిజం, క్రీడా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన 3వ స్టూడెంట్స్ ఒలింపిక్స్ ఇంటర్నేషనల్‌లో నాగర్ కర్నూలు జిల్లా పదర మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి తిరుపతి నాయక్ జూడో క్రీడల విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించినందుకు బుర్రా వెంకటేశం గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు ఒలింపిక్స్ లో పథకాలు సాధించటమే లక్ష్యంగా సాగాలని కోరారు. తెలం గాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ ఛైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి నాయక్ కు భవిష్యత్ క్రీడ పోటీలలో పాల్గొనటానికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని అదించాలని ఛైర్మన్ వెంకటేశ్వర రెడ్డి విజ్ఞప్తిని కార్యదర్శి వెంకటేశం సానుకూలంగా స్పందించారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·